www.andhrajyothy.com పేజీలు: 14 | విజయవాడ సిటీ

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 336

శనివారం | 22-3-2025 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: అష్టమి తె.5.24 తదుపరి నవమి, నక్షత్రం: మూల తె.3.23 తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: ఉ.10.18-12.00, రా.1.40-3.23, అమృతఘడియలు: రా.8.33-10.15, దుర్ముహూర్తం: ఉ.6.21-7.57, రాహుకాలం: ఉ. 9.00-10.30, సూర్యోదయం: 6.21, సూర్యాస్తమయం: 6.22

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఢిల్లీ హైకోర్టు జడ్జి ఇంట్లో..

నోట్ల కట్టలు!



జస్టిస్ యశ్వంత్ వర్మ

అగ్నిప్రమాదంతో బయటపడ్డ వైనం.. 14న ఘటన.. 21న వెలుగులోకి

- హోలీ నాడు జస్టిస్ యశ్వంత్ వర్మ బంగ్లాలో అగ్ని ప్రమాదం.. ఆర్పడానికి వెళ్లిన అగ్నిమాపక సిబ్బంది
- అక్కడ వారికి ఓ గదిలో కనిపించిన డబ్బు కట్టలు
- రూ. 15-50 కోట్ల దాకా ఉంటుందంటూ కథనాలు
- ప్రభుత్వ వర్గాల ద్వారా సీజేఐకి ఈ సమాచారం
- ఆయన నేతృత్వంలో సమావేశమైన కొలీజియం
- జస్టిస్ వర్మ బదిలీకి ఆ భేటీలో ఏకగ్రీవ ప్రతిపాదన!
- అలహాబాద్ హైకోర్టు న్యాయవాదుల అభ్యంతరం
- తమ హైకోర్టు ఏమైనా చెత్తబుట్టా అని ఆగ్రహం
- డబ్బు కట్టలపై ఢిల్లీ హైకోర్టు సీజే ఇప్పటికే అంతర్గత విచారణ చేపట్టినట్టు సుప్రీం కోర్టు ప్రకటన
- విచారణకు, బదిలీ ప్రతిపాదనకు సంబంధం లేదని తేల్చిచెప్పిన సర్వోన్నత న్యాయస్థానం
- జడ్జి ఇంట్లో డబ్బే దొరకలేదు: ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ డీజీ

న్యూఢిల్లీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ బంగ్లాలో అగ్ని ప్రమాదం జరిగితే ఆర్పడానికి వెళ్లిన అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు ఆ ఇంట్లో గోనెసంచుల్లో కట్టలకొద్దీ నగదు కనిపించినట్టు వచ్చిన వార్త దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈనెల 14వ తేదీ (హోలీ రోజు) రాత్రి 11.35 గంటల సమయంలో ఈ ప్రమాదం జరగ్గా.. డబ్బు కట్టలు బయటపడ్డ విషయం 21వ తేదీ దాకా బయటకు రాకపోవడం మిస్టరీగా మారింది. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో న్యాయమూర్తి ఊళ్లో లేరని సమాచారం. ఆయన కుటుంబసభ్యులు అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయగా.. సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి లోపలకు వెళ్లగా ఒక గదిలో కట్టల కట్టల నగదు కనిపించిందని.. ఆ డబ్బు రూ.15 కోట్ల దాకా ఉంటుందని కొన్ని వర్గాలు తెలపగా.. దొరికిన డబ్బు రూ.50 కోట్ల దాకా ఉంటుందని మరికొన్ని వర్గాలు చెబుతున్నాయి. వాస్తవంగా ఆ రోజు ఎంత డబ్బు బయటపడిందన్న విషయంపై అధికారిక సమాచారమేదీ లేదు. కాగా.. జడ్జి ఇంట్లో భారీ ఎత్తున నగదు బయటపడిన విషయాన్ని స్థానిక పోలీసులు ఉన్నతాధికారులకు చేరవేశారని.. వారి ద్వారా ఈ విషయం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నాకు తెలిసిందని చెబుతున్నారు. ఆయన దీన్ని తీవ్రంగా పరిగణించి కొలీజియం సమావేశం నిర్వహించగా.. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని ఆ సమావేశంలో ఏకగ్రీవంగా ప్రతిపాదించినట్టు తెలిసింది. అయితే.. జరిగిన ఘటన తీవ్రత నేపథ్యంలో కేవలం బదిలీతో సరిపెడితే అది న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను, ప్రజలకు న్యాయ వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుంది కాబట్టి జస్టిస్ వర్మ రాజీనామా కోరాలని కొలీజియంలోని కొందరు సభ్యులు

మిగతా 2వ పేజీలో...

అలహాబాద్ హైకోర్టు తీర్పు ఆందోళనకరం

- బాలిక పైజమా తాడు లాగినా రేప్ కిందికి రాదనడం సరికాదు
- సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి
- కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవి

నీకో సగం... నాకో సగం!

అన్న ప్రసాదంలో వడ పంచుకున్న చంద్రబాబు దంపతులు



మనవడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సభ్యులు తిరుమల వెంకన్నను దర్శించుకున్నారు. ప్రతి ఏడాదిలాగే.. ఈసారీ మనవడి పేరున ఒకరోజు అన్నప్రసాద వితరణ విరాళం రూ.44 లక్షలను అందించారు. తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద సత్రంలో భక్తులకు అల్పాహారం వడ్డించారు. ఆ తర్వాత వారు కూడా అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆసక్తికరమైన సంఘటన జరిగింది. సిబ్బంది వడ వడ్డించబోగా... చంద్రబాబు సతీమణి భువనేశ్వరి తొలుత వద్దన్నారు. అన్న ప్రసాదంలో ఇటీవలే వడ ప్రవేశపెట్టిన సంగతి చంద్రబాబు ఆమెకు చెప్పారు. తనకు ఒక ముక్క మాత్రం ఇవ్వాలన్నట్లుగా సిబ్బందికి సైగ చేశారు. దీంతో భువనేశ్వరి ఒక వడను చంద్రబాబుకు వేయించారు. తర్వాత దానిని తీసుకుని రెండు ముక్కలు చేసి, సగం చంద్రబాబుకు ఇచ్చి, మిగిలిన సగం తాను ఆరగించారు.

ఆ హోటళ్లకు అనుమతులు రద్దు

ఏడుకొండల్లో వ్యాపారీకరణను అనుమతించం.. అందుకే గత ప్రభుత్వం ఇచ్చిన 35.32 ఎకరాలను రద్దు చేస్తున్నాం.. సీఎం చంద్రబాబు ప్రకటన 14

వివేకా హత్య కేసు విచారణలో

ఇంత జాప్యమా?



ట్రయల్ ప్రారంభం కాకపోవడానికి కారణాలేంటి?

- సీబీఐకి తెలంగాణ హైకోర్టు నోటీసులు
- నిందితులూ స్పందించాలని ఆదేశం
- వారికి వ్యక్తిగత నోటీసులు పంపేందుకు సునీతారెడ్డికి అనుమతి
- విచారణ 4 వారాలు వాయిదా
- ఏడాదిన్నరగా సీఆర్పీసీ 207 దశలోనే
- హార్డ్‌డిస్క్‌ల్లో పత్రాలు ఓపెన్ కావడం లేదంటూ నిందితుల అడ్డుపుల్లలు
- ఇలాగైతే ఏడేళ్లకూ విచారణ మొదలవదు
- వెంటనే ట్రయల్ ప్రారంభించాలి
- ఆరు నెలల్లో పూర్తిచేయాలి
- ఆమె తరఫు న్యాయవాది అభ్యర్థన

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో తీవ్ర జాప్యం ఎందుకు జరుగుతోంది.. ట్రయల్ ప్రారంభం కాకపోవడానికి కారణాలు ఏంటో సమాధానం చెప్పాలంటూ తెలంగాణ హైకోర్టు సీబీఐకి నోటీసులు జారీచేసింది. ఈ వ్యవహారంలో నిందితులు సైతం స్పందించాలని స్పష్టంచేసింది. కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరి (అప్రూవర్), శివశంకర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డిలకు వ్యక్తిగతంగా నోటీసులు పంపేందుకు వివేకా కుమార్తె, పిటిషనర్ సునీతారెడ్డికి న్యాయస్థానం

మిగతా 13వ పేజీలో...



ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు రూ. 600 కోట్లు విడుదల

- త్వరలో మరో రూ.400 కోట్లు
- విద్యాశాఖ కార్యదర్శి వెల్లడి
- విద్యార్థులపై ఒత్తిడి చేయొద్దని యాజమాన్యాలకు హెచ్చరిక

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు విడుదల చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి రూ.600 కోట్లు విడుదల చేసినట్లు విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. త్వరలో మరో రూ.400 కోట్లు విడుదల చేయనున్నట్టు వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటికే రూ.788 కోట్లు విడుదల చేశామని తెలిపారు. గతంలోని ఫీజుల బకాయిలను కూడా దశలవారీగా చెల్లిస్తామని పేర్కొన్నారు. ఫీజుల కోసం విద్యార్థులపై కాలేజీ యాజమాన్యాలు ఒత్తిడి చేయరాదని ఆదేశించారు. తరగతులకు హాజరుకాకుండా నిరోధించడం, హాల్ టికెట్లు నిలిపివేయడం, పరీక్షలు రాయనీయకుండా అడ్డుపడడం వంటి చర్యలకు దిగితే.. కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

శనివారం నో బ్యాగ్ డే 14



31లోపు రేషన్ కార్డుదారుల ఈకేవైసీ

- లేదంటే భవిష్యత్తులో ఇబ్బందులు
- కమిషనర్ ఆదేశాలు 10



ధనాధన్ ఫటాఫట్ 10

నేటి నుంచే ఐపీఎల్.. తొలి పోరులో కోల్‌కతా X బెంగళూరు

వలపువలలో కన్నడ నేతలు



సస్పెన్షన్ వేటుపడిన ఎమ్మెల్యేలను బయటికి తరలిస్తున్న మార్షల్స్

- కర్ణాటకను కుదిపేస్తున్న హనీట్రాప్
- ఇద్దరు మంత్రులు సహా 48 మంది ఎమ్మెల్యేలపై అశ్లీల వీడియోలు
- కొందరు జాతీయ పార్టీ నేతలు, న్యాయమూర్తులవి కూడా..
- అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి రాజన్న
- వెనుక డీకే శివకుమార్ ఉన్నారని బీజేపీ, కాంగ్రెస్ నేతల అనుమానాలు
- అసెంబ్లీలో గందరగోళం.. 18 మంది బీజేపీ ఎమ్మెల్యేలపై ఆర్నెల్ల సస్పెన్షన్

బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): హనీట్రాప్ వ్యవహారం కర్ణాటక రాజకీయాలను కుదిపేస్తోంది. ఆ పార్టీ, ఈ పార్టీ అని కాకుండా పలువురు నేతలు ఇందులో చిక్కుకున్నారు. ఇద్దరు మంత్రులు సహా 48 మంది కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ ఎమ్మెల్యేలు, కేంద్ర కాంగ్రెస్ నాయకులు, న్యాయమూర్తులపై వలపు వల విసిరి.. అశ్లీల వీడియోలు తీసినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఓ సీనియర్ మంత్రే అసెంబ్లీలో బయటపెట్టడం కలకలం రేపింది. తాను కూడా హనీట్రాప్ బాధితుడినేనని, విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అసలీ అంశం వెనుక.. సీఎం కావాలని అభిలషిస్తున్న సీనియర్ నాయకుడి హస్తం ఉందని కాంగ్రెస్‌లో చర్చ నడుస్తోంది. కొందరు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై

మిగతా 2వ పేజీలో...

మందులపై 'ఆపరేషన్ గరుడ'

రాష్ట్రవ్యాప్తంగా 645 మెడికల్ స్టోర్లు, ఏజెన్సీల్లో ఏకకాలంలో తనిఖీలు 13

అవకతవకలకు పాల్పడిన వారిపై కేసులు.. కొన్నిచోట్ల నిషేధిత మందులు స్వాధీనం

సేవకు సరైన 'సమయం'!

రాష్ట్రంలో 'టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' సేవలు

- ఇప్పుడు వృద్ధుల సేవ కోసం సమయం కేటాయించి భవిష్యత్తులో తామూ సేవలు పొందవచ్చు
- సభ్యులు చేసే సేవల సమయం ఖాతాలో జమ.. అవసరమైనపుడు ఆ సమయాన్ని వాడుకునే వీలు
- ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తామన్న సంస్థ 13

‘వలపు వల’లో కన్నడ నేతలు

(మొదటి పేజీ తరువాయి)


కర్ణాటక సహకార మంత్రి రాజన్న

అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. దీనికి సీఎం సిద్దరామయ్య సమాధానం చెప్పాలని బీజేపీ సభ్యులు అసెంబ్లీలో పట్టుబట్టారు. జ్యుడీషియల్ విచారణ గానీ, సీబీఐ దర్యాప్తు గానీ చేపట్టాలని డిమాండ్ చేశారు. వెల్‌లోకి దూసుకెళ్లి గందరగోళం సృష్టించారు. కాగితాలు చించి స్పీకర్‌పై విసిరివేశారు. దీంతో 18 మంది బీజేపీ ఎమ్మెల్యేలను ఆరు నెలలపాటు సస్పెండ్ చేస్తూ పాలక పక్షం సభలో తీర్మానించింది. మార్షల్స్ సాయంతో వారిని సభ బయటకు పంపింది.

మూడ్రోజుల కిందట..

హనీట్రాప్ అంశాన్ని తొలుత బుధవారం బీజేపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సునీల్‌కుమార్ ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హనీట్రాప్ ఫ్యాక్టరీ నడుపుతోందని, ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. హనీట్రాప్ వెనుక కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు ఉన్నారని.. నాయకత్వ సంక్షోభంలో రాజకీయ ప్రత్యర్థుల ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ఇలా చేశారని బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాల్ కూడా ఆరోపించారు. సీఎం పదవిపై కన్నేసిన కాంగ్రెస్ నేతలు ఇలాంటి కుయత్నాలకు దిగినట్లు ప్రచారం జరుగుతోందన్నారు. దీనిపై గురువారం సహకార మంత్రి కేఎన్ రాజన్న సభలో ప్రస్తావించారు. తాను కూడా హనీట్రాప్ బాధితుడినని చెప్పడంతో సభలో కలకలం రేగింది. ‘నేనొక్కడినే కాదు. 48 మంది ఎమ్మెల్యేలతో పాటు కేంద్ర నాయకులు, న్యాయమూర్తులు కూడా బాధితులే. వారి అశ్లీల వీడియోలు తీశారు. కొందరి వద్ద సంబంధిత పెన్‌డ్రైవ్‌లు, సీడీలు ఉన్నట్లు నాకు సమాచారం ఉంది. ఇది కర్ణాటకకే పరిమితం కాలేదు. చాలా మంది జాతీయ స్థాయి పార్టీ నేతల పెన్‌డ్రైవ్‌లు కూడా ఉన్నాయి. దీనిపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తా. లోతైన దర్యాప్తు జరగాలి. ఈ పెన్‌డ్రైవ్‌లు, సీడీల సృష్టికర్తలు ఎవరు? వీటి దర్శకులెవరు.. నటులెవరు.. అంతా బయటకు రావాలి’ అని స్పష్టం చేశారు. ఇది చాలా తీవ్రమైన అంశమని.. రాజన్న లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే సమగ్ర దర్యాప్తు జరిపిస్తానని హోం మంత్రి జి.పరమేశ్వర హామీ ఇచ్చారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న మాట్లాడుతూ.. తాను కూడా రాజకీయ వేధింపులకు బలయ్యానని అన్నారు.

అసెంబ్లీలో దుమారం..

బడ్జెట్ సమావేశాల చివరిరోజైన శుక్రవారం ఈ అంశంపై కర్ణాటక అసెంబ్లీలో తీవ్ర గందరగోళం చెలరేగింది. సభ ఉదయం ప్రారంభం కాగానే బీజేపీ, జేడీఎస్ ఎమ్మెల్యేలు వెల్‌లోకి దూసుకెళ్లారు. హనీట్రాప్ రుజువులంటూ సీడీలను ప్రదర్శించారు. బడ్జెట్‌పై చర్చకు సీఎం సిద్దరామయ్య సిద్ధం కాగా.. మొదట హనీట్రాప్ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని పట్టుబట్టారు. దీనిపై హోం మంత్రి ఇప్పటికే ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారని, ఇలాంటి కార్యకలాపాల్లో పాత్ర ఉన్న ఏ పార్టీ నేతనూ వదిలేది లేదని సీఎం సిద్దరామయ్య స్పష్టం చేశారు. ఓవైపు ఆయన వివరణ ఇస్తుండగానే బీజేపీ సభ్యులు పోడియంవైపు దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సాయంత్రం 4.30 గంటలకు తిరిగి సభ ప్రారంభం కాగానే.. స్పీకర్ స్థానాన్ని అగౌరవపరచినందుకు 18 మంది బీజేపీ ఎమ్మెల్యేలను 6నెలలపాటు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ఖాదర్ ప్రకటించారు. వారు బయటకు వెళ్లకపోవడంతో మార్షల్స్ వచ్చి బలవంతంగా తీసుకెళ్లారు.

‘ప్రతిభ’ అనే భావనే అనుచితం: రాహుల్

న్యూఢిల్లీ, మార్చి 21: ప్రతిభ అనే భావనే అనుచితమని.. అగ్ర కులాల కథనమని.. పూర్తిగా లోపభూయిష్టమని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ అన్నారు. భారతీయ విద్యావ్యవస్థ బడుగు వర్గాలకు అన్యాయం చేసిందన్నారు. యూజీసీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ సుఖ్‌దేవ్ థోరట్‌తో తాను జరిపిన సంభాషణను రాహుల్ శుక్రవారం ‘ఎక్స్’లో పోస్టుచేశారు. పరిపాలన, విద్యా రంగాల్లో సమానావకాశాల కోసం దళితులు, గిరిజనులు ఇప్పటికీ పోరాడుతున్నారని ఆయన తెలిపారు. భారత్‌లో అసమానతల వెనుక నిజాన్ని వెలికితీసేందుకు కులగణన ముఖ్యమన్నారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ విరుచుకుపడింది. ప్రతిభ వ్యతిరేక మనస్తత్వం ప్రమాదకరమని, కుటుంబవాదులు, వంశపారంపర్య మనస్తత్వం కలిగినవారు ఎన్నటికీ ప్రతిభను గౌరవించరని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ విమర్శించారు. ఇదిలా ఉండగా, ‘మనం బీజేపీ, ఆరెస్సెస్‌తోనే కాదు..భారత రాజ్యంపైనే పోరాటం చేస్తున్నాం’ అన్న వ్యాఖ్యల కేసులో సంభాల్ కోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. ఏప్రిల్4న హాజరు కావాలని, లేదంటే సమాధానమైనా పంపించాలని జిల్లా కోర్టు ఆదేశించింది.

ఢిల్లీ హైకోర్టు జడ్జి ఇంట్లో.. నోట్ల కట్టలు!


జస్టిస్ యశ్వంత్ వర్మ

(మొదటి పేజీ తరువాయి)

అభిప్రాయపడినట్టు తెలిసింది. ఒకవేళ ఆయన అందుకు నిరాకరిస్తే సీజేఐ ఆయనపై అంతర్గత విచారణ చేపట్టాలని కూడా సూచించినట్టు సమాచారం. కాగా.. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలన్న ప్రతిపాదనపై అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ తీవ్రంగా స్పందించింది. న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో ఏదో కొరవడుతోందని, అది అవినీతికి దారితీసి.. అంతిమంగా ప్రజలకు న్యాయవ్యవస్థపై ప్రజలకున్న నమ్మకాన్ని దెబ్బతీస్తోందని ఆందోళన వెలిబుచ్చింది. "అలహాబాద్ హైకోర్టు ఏమీ చెత్తబుట్టా?" అని ఆగ్రహం వ్యక్తం చేసింది.

తప్పుడు సమాచారం..

అలహాబాద్ హైకోర్ట్ బార్ అసోసియేషన్‌తోపాటు.. దేశవ్యాప్తంగా న్యాయవర్గాలు, ప్రజల నుంచి దీనిపై విమర్శలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ఒక ప్రకటన విడుదల చేసింది. "జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటివద్ద జరిగిన ఘటనకు సంబంధించి తప్పుడు సమాచారం, వదంతులు వ్యాపిస్తున్నాయి" అని అందులో పేర్కొంది. ఈ వ్యవహారంపై మార్చి 20న సుప్రీం కోలీజియం సమావేశం కావడానికి ముందే.. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అంతర్గత విచారణ ప్రారంభించి, వివరాలు సేకరిస్తున్నారని వెల్లడించింది. ఆయన్నుంచి నివేదిక అందగానే దాన్ని పరిశీలించి తదుపరి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. "ఢిల్లీ హైకోర్టులో రెండో సీనియర్ మోస్ట్ జడ్జి, కొలీజియం సభ్యుడు అయిన జస్టిస్ యశ్వంత్‌వర్మను.. ఆయన పేరెంట్ కోర్టు అయిన ‘హైకోర్ట్ ఆఫ్ జ్యుడికేచర్ ఎట్ అలహాబాద్’కు బదిలీ చేయాలన్న ప్రతిపాదన, ఢిల్లీ హైకోర్టులో ఆయనపై జరుగుతున్న అంతర్గత విచారణ.. ఈ రెండూ వేర్వేరు అంశాలు. ఆయన్ను బదిలీ చేయాలన్న ప్రతిపాదనను సుప్రీం సీజే, నలుగురు సీనియర్ మోస్ట్ సుప్రీం జడ్జీలతో కూడిన కొలీజియం మార్చి 20న పరిశీలించింది. అనంతరం దీనిపై సుప్రీంకోర్టులోని కన్సల్టీ జడ్జీలకు, సంబంధిత హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకు లేఖలు రాసింది. వారి నుంచి వచ్చిన ప్రతిస్పందనలను పరిశీలించి, కొలీజియం దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటుంది" అని ఆ ప్రకటనలో సుప్రీంకోర్టు పేర్కొంది.

తీవ్రమైన విషయం..

జస్టిస్ వర్మ ఇంట్లో డబ్బు కట్టల వ్యవహారంపై పలువురు ప్రముఖ న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది చాలా తీవ్రమైన విషయమని.. ఆయన్ను వెంటనే రాజీనామా చేయాల్సిందిగా కోరాలని సీనియర్ అడ్వొకేట్ వికాస్ సింగ్ అభిప్రాయపడ్డారు. ఇలాంటి వ్యవహారాల్లో బదిలీ పరిష్కారం కాదని ఆయన తేల్చిచెప్పారు. ఇక.. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు అంతర్గత విచారణ జరిపి, నిజాలను రాబట్టాలని మరో సీనియర్ అడ్వొకేట్ రాకేశ్ ద్వివేది అభిప్రాయపడ్డారు. దీనికి సంబంధించిన వాస్తవాలను పూర్తిగా, స్వేచ్ఛగా, సూటిగా బయటపెట్టాల్సిన బాధ్యత సుప్రీంకోర్టు కోలీజియంపై ఉందని సీనియర్ అడ్వొకేట్ ఇందిరా జైసింగ్ అన్నారు. ఎప్పుడో మార్చి 14న ఘటన జరిగితే.. మార్చి 21 దాకా ఆ విషయం బయటపడకపోవడం ఆశ్చర్యంగా ఉందని ఆమె వ్యాఖ్యానించారు.

రాజ్యసభలో ప్రస్తావన..

జస్టిస్ వర్మ ఇంట్లో నోట్ల కట్టల వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలో.. శుక్రవారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేశ్ ఈ అంశాన్ని లేవనెత్తారు. న్యాయవ్యవస్థలో జవాబుదారీతనం గురించి రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ స్పందన కోరారు. అలాగే.. అలహాబాద్ హైకోర్టు జడ్జికే సంబంధించి పెండింగ్‌లో ఉన్న అభిశంసన నోటీసు గురించి కూడా గుర్తుచేశారు. దీనిపై స్పందించిన జగ్‌దీప్ ధన్‌ఖడ్.. ఈ ఘటన జరిగిన వెంటనే బయటకు రాకపోవడం తనను ఎక్కువగా బాధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు.. జడ్జి బదిలీతో ఈ వ్యవహారాన్ని ముగించలేరని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా వ్యాఖ్యానించారు. "జస్టిస్ వర్మ.. ఉన్నావ్ రేప్ కేసు సహా పలు తీవ్రమైన కేసులను వింటున్నారు. న్యాయవ్యవస్థపై దేశప్రజలకు ఉన్న నమ్మకాన్ని పోకుండా చూడాలంటే.. ఆయన ఇంట్లో దొరికిన డబ్బు ఎవరిదో, ఆయనకు ఎందుకు ఇచ్చారో కనిపెట్టాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

ఎవరీ జస్టిస్ వర్మ?

కోట్ల కొద్దీ డబ్బు కట్టల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ.. 1969, జనవరి 5న అలహాబాద్‌లో జన్మించారు. ఢిల్లీ యూనివర్సిటీ హన్స్‌రాజ్ కాలేజీలో బీకామ్ ఆనర్స్ పట్టా పుచ్చుకున్న ఆయన.. మధ్యప్రదేశ్‌లోని రేవా యూనివర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు. 1992 ఆగస్టు 8న అలహాబాద్ హైకోర్టులో అడ్వొకేట్‌గా పేరు నమోదు చేసుకున్నారు. 2006 నుంచి 2014 అక్టోబరు దాకా అలహాబాద్ హైకోర్టు స్పెషల్ కౌన్సెల్‌గా సేవలందించారు. 2014 అక్టోబరులో.. అలహాబాద్ హైకోర్టులో అదనపు జడ్జిగా నియమితులయ్యారు. 2021 అక్టోబరులో ఆయన్ను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేశారు.

డబ్బు కట్టలేం దొరకలేదు

» ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ చీఫ్ అతుల్ గార్గ్

జస్టిస్ వర్మ ఇంట్లో కట్టల కొద్దీ డబ్బు దొరికిన వ్యవహారంపై దేశవ్యాప్తంగా దుమారం రేగుతుండగా.. ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ చీఫ్ అతుల్ గార్గ్ మాత్రం ఆయన ఇంట్లో తమ సిబ్బందికి అసలు డబ్బే దొరకలేదని చెప్పారు. శుక్రవారం ఈ అంశంపై ఆయన వివరణ ఇచ్చారు. "మార్చి 14న రాత్రి 11.35 గంటలకు.. జస్టిస్ వర్మ నివాసంలో మంటలు చెలరేగాయని పేర్కొంటూ మా కంట్రోల్ రూమ్‌కు కాల్ వచ్చింది. 11.43 గంటలకల్లా రెండు అగ్నిమాపక శకటాలను ఆయన ఇంటికి పంపించాం. కాగితాలు, ఇతర వస్తువులు ఉన్న స్టోర్ రూమ్‌లో చెలరేగిన మంటలను మా సిబ్బంది 15 నిమిషాల్లో ఆర్పేశారు. వెంటనే దీనిపై పోలీసులకు సమాచారం అందించి.. మా సిబ్బంది అక్కణ్నుంచీ వచ్చేశారు. మా ఫైర్‌ఫైటర్లు అక్కడ ఎలాంటి నగదునూ కనుగొనలేదు" అని ఆయన స్పష్టం చేశారు.

మీద కూర్చొని.. గుండెల్లో మూడు సార్లు పొడిచేసింది..

» భయపెడుతున్న మర్చంట్ నేవీ అధికారి హత్య తీరు

మేరఠ్, మార్చి 21 : ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌లో జరిగిన మర్చంట్ నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్ హత్య విషయంలో ఒళ్లు గగుర్పొడిచే విషయాలు బయటికొస్తున్నాయి. భార్య ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్.. మార్చి 4న సౌరభ్‌ను చంపి 15 ముక్కలు చేసి వాటిని ఓ సిమెంట్ డ్రమ్ములో వేసి విహారయాత్రకు వెళ్లిన సంగతి తెలిసిందే. అయితే, పథకం ప్రకారం సౌరభ్‌ను మత్తులోకి పంపిన ముస్కాన్.. భర్త ఛాతీ మీద కూర్చొని.. అతని గుండెల్లో మూడు సార్లు కత్తితో పొడిచేసింది. కత్తితో పొడిచేందుకు ముస్కాన్ తొలుత సంశయించగా.. "మనం కొత్త జీవితం మొదలుపెట్టాలంటే నువ్వు సౌరభ్‌ను చంపాల్సిందే" అంటూ సాహిల్ చెప్పిన మాటలకు ప్రభావితమై ఘాతుకానికి పాల్పడింది. కత్తిని ఎలా పట్టుకోవాలి, ఎలా పొడవాలి అంటూ సాహిల్ చేసిన సూచనలను పాటిస్తూ కిరాతకానికి తెగబడింది. ఈమేరకు సౌరభ్‌ను హత్య చేసిన తీరును ముస్కాన్ పోలీసులకు వెల్లడించింది. సౌరభ్ మొండాన్ని బెడ్‌బాక్స్‌లో పెట్టి ముస్కాన్ ఆ రాత్రి అదే మంచంపై నిద్రించిందని, కాళ్లూచేతులను సాహిల్ తన ఇంటికి తీసుకెళ్లాడని, కానీ పథకం మార్చుకుని తర్వాతి రోజు వాటిని ఓ డ్రమ్ములో వేసి సిమెంట్ పోశారని జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇక, ఈ కేసులో మరో నిందితుడైన ముస్కాన్ ప్రియుడు సాహిల్ విచిత్రమైన స్వభావం కలిగిన వ్యక్తి అని, డ్రగ్స్ బానిసని పోలీసు విచారణలో తేలింది.

లోకం తీరు



అలహాబాద్ హైకోర్టు తీర్పు ఆందోళనకరం

» బాలిక పైజామా తాడు లాగినా రేప్ కిందికి రాదనడం సరికాదు

» కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవి వ్యాఖ్య



న్యూఢిల్లీ, మార్చి 21: మైనర్ బాలిక ఛాతీపై చేయి వేసినా, ఆమె ధరించిన పైజామా తాడు లాగినా దానిని రేప్, అత్యాచార యత్నంగా పరిగణించబోరంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. తీవ్రమైన ప్రభావం చూపే ఈ తీర్పులో జోక్యం చేసుకోవాలని సుప్రీంకోర్టును కోరింది. శుక్రవారం కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ హైకోర్టు తీర్పును తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని చెప్పారు. నాగరిక సమాజంలో ఇలాంటి తీర్పులకు చోటు లేదని అన్నారు. 2011లో 11 ఏళ్ల బాలికను ఇద్దరు యువకులు (21 ఏళ్లు) వంతెన కిందికి తీసుకెళ్లి ఆమె ఛాతీపై చేయి వేయడంతో పాటు, ఆమె ధరించిన పైజామా తాడును లాగారు. అదే సమయంలో ఎవరో వస్తుండడాన్ని చూసి పారిపోయారు. పోలీసులు వారిద్దరిపై ఐపీసీలోని సెక్షన్ 376 (రేప్), పోక్సో చట్టంలోని సెక్షన్ 18 (నేరం చేసేందుకు ప్రయత్నించడం) కింద కేసులు పెట్టారు. కానీ, అలహాబాద్ హైకోర్టు.. వారు అత్యాచారం చేయడానికి ప్రయత్నించినట్టు కనిపించడం లేదని భావించి.. తక్కువ శిక్షలు పడే ఐపీసీ సెక్షన్ 354బీ(దుస్తులు లాగేందుకు బలవంతంగా ప్రయత్నించడం), పోక్సో చట్టంలోని సెక్షన్ 9/10 (లైంగికదాడికి పాల్పడడం) కింద మళ్లీ కేసు పెట్టాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది.

2009 నుంచి 2024 వరకు 15,564 మందిని పంపేశారు

» భారతీయ అక్రమ వలసదారుల లెక్క ఇది

» ట్రంప్‌కు ముందునుంచే ‘డిపోర్టేషన్’

» త్వరలో మరో 295మంది భారత్‌కు

» రాజ్యసభలో విదేశాంగ శాఖ ప్రకటన



న్యూఢిల్లీ, మార్చి 21 : అమెరికా ప్రభుత్వం మరో 295 మంది భారతీయ అక్రమ వలసదారులను వెనక్కి పంపించనుంది. వీరంతా ప్రస్తుతం తమ నిర్బంధంలో ఉన్నారని, త్వరలో వారిని తిరిగి పంపించివేస్తామని అమెరికా అధికారులు తెలిపినట్టు కేంద్ర విదేశాంగ శాఖ శుక్రవారం రాజ్యసభకు తెలిపింది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 388మంది భారత జాతీయులను వెనక్కి పంపారని వివరించింది. సీపీఐ సభ్యుడు జాన్ బ్రిటస్ దీనిపై అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ ఇలా లిఖితపూర్వకంగా సమాధానమిచ్చింది. అక్రమ వలసదారులను వెనక్కి పంపించివేయడం అనే ప్రక్రియ ట్రంప్‌కు ముందే మొదలైందని, 2009-2024 మధ్యకాలంలో 15,564మందిని వెనక్కి పంపారని తెలిపింది. "ట్రంప్ తొలిసారి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల కాలంలో 6వేలమంది భారతీయులను అక్రమ వలసదారులుగా గుర్తించి పంపివేశారు. బైడెన్ ప్రభుత్వం అదే తరహాలో 3,652 మంది భారతీయ అక్రమ వలసదారులను తిరిగి పంపించారు" అని విదేశాంగ శాఖ వివరించింది.

సంకెళ్లపై సభ్యుల నిరసనలు..

భారతీయ అక్రమ వలసదారులను సంకెళ్లు వేసి తరలించిన అంశంపై విపక్షాలు నిరసన తెలిపాయి. దీనిపై కేంద్ర విదేశాంగ శాఖ స్పందిస్తూ.... ఈ అంశంపై అమెరికాకు నిరసన తెలిపామని వెల్లడించింది. "ఫిబ్రవరి ఐదున భారత్‌కు తిరిగి పంపినవారి చేతులు, కాళ్లకు సంకెళ్లు వేసిన విషయం అమెరికా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ముఖ్యంగా, మహిళలకు సంకెళ్లు వేయడంపై మన అభ్యంతరాన్ని గట్టిగా తెలియజేశాం. ఆ తర్వాత అమెరికా వైఖరి మారింది. అదే నెల 15,16వ తేదీల్లో పంపిన మరో విడత అక్రమ వలసదారుల్లో పిల్లలు, స్త్రీలకు సంకెళ్లు వేయలేదు" అని విదేశాంగశాఖ తెలిపింది. కాగా, ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన మొదటి నెల రోజుల్లో మొత్తంగా 37,600 మంది అక్రమ వలసదారులను వెనక్కి పంపించారు.

గ్రీన్‌కార్డు కోసం పెళ్లి చేసుకుంటే బహిష్కరణే!


ఐదేళ్ల జైలు, రూ.2కోట్ల ఫైన్ కూడా

అమెరికా పౌరులను వివాహం చేసుకోవడం ద్వారా వేగంగా గ్రీన్‌కార్డు పొందాలని భావించేవారికి అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం(యూఎస్‌సీఐఎస్) గట్టి షాక్ ఇచ్చింది. వలస ప్రయోజనాలు పొందడానికి ఉద్దేశించిన మోసపూరిత వివాహాలు వ్యవస్థను బలహీనపరుస్తాయని, ఇటువంటి చర్యలను ఫెడరల్ నేరంగా పరిగణిస్తామని పేర్కొంది. దీనికి ఐదేళ్ల వరకూ జైలు శిక్ష, రూ.2కోట్లకు పైగా జరిమానాతో పాటు బహిష్కరణకు కూడా దారితీసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు యూఎస్‌సీఐఎస్ గురువారం ‘ఎక్స్’లో పోస్టు చేసింది. వివాహం, వర్క్ వీసాల మోసాలు, ఇమిగ్రేషన్ బెనిఫిట్ ప్రోగ్రాంల దుర్వినియోగం వంటి అనుమానాస్పద కేసుల సమాచారాన్ని తమకు నివేదించాలని పౌరులను కోరింది. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచిన ఫాం ద్వారా పౌరులు తమకు సులభంగా సమాచారం ఇవ్వవచ్చని సూచించింది.

ఇజ్రాయెల్ నిఘా చీఫ్‌పై వేటు!

» 1949 తర్వాత చరిత్రలో తొలిసారి ‘షిన్ బెట్’ అధిపతి తొలగింపు

» తాత్కాలిక స్టే విధించిన సుప్రీంకోర్టు



టెల్ అవివ్/జెరూసలేం, మార్చి 21: హమాస్‌తో ఏడాదిన్నరగా యుద్ధం చేస్తున్న ఇజ్రాయెల్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తన శక్తివంతమైన అంతర్గత నిఘా విభాగం ‘షిన్ బెట్’ చీఫ్ రొనెన్ బార్‌పై ప్రధాని నెతన్యాహు వేటు వేశారు. బార్‌ను సర్వీసు నుంచి తొలగించాలని గురువారం రాత్రి జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. బార్‌పై నెతన్యాహు విశ్వాసం కోల్పోయారని ప్రధాని కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది. గాజాలో ఇజ్రాయెల్ యుద్ధ లక్ష్యాలను సాధించేందుకు బార్ తొలగింపు అవసరమని, ‘తదుపరి విపత్తు’ను నివారించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. ఆయన వారసుడిని నియమించే వరకు కాని, ఏప్రిల్ 10 వరకు గానీ ఏది ముందు అయితే అప్పటి వరకు బార్ పదవిలో కొనసాగుతారని పేర్కొంది. ఇజ్రాయెల్ చరిత్రలో షిన్ బెట్‌ను ఏర్పాటు చేసిన 1949 నుంచి ఈ తరహా అసాధారణ నిర్ణయం తీసుకోవడం ఇదే తొలిసారి. బార్ పదవీ కాలం వాస్తవానికి మరో ఏడాదిన్నర ఉంది. తనను తొలగించడాన్ని సవాల్ చేస్తూ బార్ వేసిన పిటిషన్‌పై ఇజ్రాయెల్ సుప్రీంకోర్టు తక్షణం స్పందించింది. ఆ పిటిషన్‌పై విచారణ జరిపే వరకు నెతన్యాహు నిర్ణయాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. అప్పీల్‌ను ఏప్రిల్ 8లోగా విచారిస్తామని పేర్కొంది. 2023, అక్టోబర్ 7న హమాస్ దాడిని గుర్తించడంలో షిన్ బెట్ విఫలమైందని, దానివల్లే నెతన్యాహు రోనెన్ బార్‌ను తొలగించారని తెలుస్తోంది. మరోవైపు, బార్ తొలగింపు వెనుక ‘ఖతార్-గేట్’ దర్యాప్తుల అంశం ఉండొచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి. కొందరు నెతన్యాహు సన్నిహితులు ఖతార్ తరఫున లాబీయింగ్ చేశారన్న ఆరోపణపై షిన్ బెట్ పరిశీలన చేస్తోంది. ఖతార్ ప్రభుత్వంతో ఆర్థిక సంబంధాలు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై ఇద్దరు నిందితులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు.

ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్‌లో శాంతి: అమిత్ షా

న్యూఢిల్లీ, మార్చి21: జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఉగ్రవాదం విషయంలో యువత ప్రమేయం దాదాపు కనుమరుగైందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజ్యసభలో చెప్పారు. యూపీఏ హయాంలో ఉగ్రవాదులను కీర్తించడంతో పాటు ఉగ్రవాదుల శవాలతో అంత్యక్రియలు జరిగేవని, ప్రస్తుతం ఉగ్రవాదులను హతమార్చిన చోటే పూడ్చిపెడుతున్నామన్నారు. 2004 నుంచి 2014 మధ్య 7,2,17 ఉగ్రవాద ఘటనలు జరిగితే 2014 నుంచి 2024 మధ్య 2,242 ఘటనలు జరిగాయన్నారు. ఉగ్రవాదం కారణంగా జరిగే మరణాల సంఖ్య 70 శాతం తగ్గిందన్నారు. ఉగ్రవాదాన్ని ఏ మాత్రం ఉపేక్షించడం లేదని యూరీ, పుల్వామా ఘటనల తర్వాత పది రోజుల వ్యవధిలోనే సర్జికల్, ఎయిర్ స్ట్రైక్స్ జరిపి గట్టిగా బదులిచ్చామన్నారు. 2024లో జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

భారత విద్యార్థి సూరిని బహిష్కరించవద్దు

అమెరికా ప్రభుత్వానికి ఫెడరల్ కోర్టు ఆదేశం



హమాస్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్నాడన్న ఆరోపణలపై అరెస్టయిన భారతీయ విద్యార్థి బాదర్ ఖాన్ సూరికి అమెరికా కోర్టులో ఊరట లభించింది. అమెరికా నుంచి అతని బహిష్కరించాలన్న ప్రభుత్వ ఆదేశాలను ఫెడరల్ కోర్టు జడ్జి నిలిపివేశారు. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు అతడిని అమెరికా నుంచి పంపేయడానికి వీల్లేదని జడ్జి పాట్రీసియా టోలీవర్ గైల్స్ తన తీర్పులో ప్రభుత్వానికి స్పష్టం చేశారు. అంతకుముందు హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రతినిధి సూరి విషయంలో ఓ ప్రకటన విడుదల చేశారు. జార్జిటౌన్ వర్సిటీ విద్యార్థి అయిన బాదర్ ఖాన్ సూరి హమాస్‌కు మద్దతుగా ప్రచారం చేయడంతో పాటు సోషల్ మీడియాలో యూదు వ్యతిరేక ప్రచారం చేశారని ఆ ప్రకటనలో తెలిపారు. ఆయన్ను అమెరికా నుంచి బహిష్కరిస్తామని 15న ప్రకటించారు.

‘బెట్టింగ్ యాప్’ నిందితులకు 24 గంటల్లో నోటీసులు!

» సినీ, టీవీ ప్రముఖులకు ఇచ్చేందుకు రంగం సిద్ధం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): బెట్టింగ్ యాప్‌ల ప్రచారం వ్యవహారంలో పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. హైదరాబాద్‌లోని మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో 25 మంది ప్రముఖ సినీ, టీవీ నటులు, యూట్యూబర్లపై కేసులు నమోదైన నేపథ్యంలో వారికి మరో 24 గంటల్లో నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. అంతకుముందు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన మరో కేసులో 11 మంది ఉండగా.. వారిలో 8మంది మియాపూర్ కేసులోని వారేనని పోలీసులు తెలిపారు. సినీ నటులతో బెట్టింగ్ యాప్‌ల అగ్రిమెంట్లపై ఇప్పటికే దాదాపు 15 బెట్టింగ్ యాప్ సంస్థలను గుర్తించారు. రెండు చోట్ల కేసుల నమోదైన వారి విషయంలో ఎలా ముందుకెళ్లాలన్న దానిపై కూడా పోలీసులు న్యాయ నిపుణులతో చర్చిస్తున్నారు. ఇక పంజాగుట్ట పీఎస్‌లో కేసులు నమోదైన నిందితులకు ఇప్పటికే విచారణకు హాజరుకావాలంటూ నోటీసులిచ్చారు. ఇప్పటివరకు టేస్టీ తేజ, కానిస్టేబుల్ కిరణ్ గౌడ్, విష్ణుప్రియ, రీతూ చౌదరి విచారణకు హాజరయ్యారు. మిగతావారు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. మరోవైపు.. బెట్టింగ్ యాప్‌ల వ్యవహారంలో ఈ నెల 24న పోలీసుల ముందు హాజరవ్వాలని యాంకర్ శ్యామలను తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. బెట్టింగ్ యాప్‌ల కేసుతో తనకెలాంటి సంబంధం లేదని.. పంజాగుట్ట పోలీసులు తనపై నమోదుచేసిన కేసు కొట్టేయాలని ఆమె హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. పిటిషనర్‌కు బీఎన్ఎస్ఎస్ 35 (సీఆర్పీసీ 41ఏ) నోటీసు ఇవ్వాలని పోలీసులకు స్పష్టం చేసింది.

పత్తి పంటను బతికించుకోవాలి

» అఖిల భారత కాటన్ వార్షిక సమావేశంలో శాస్త్రవేత్తలు

గుంటూరు సిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంభవించిన వాతావరణ మార్పులతో జీవచ్ఛవంలా మారిన పత్తి పంటకి తిరిగి ప్రాణం పోయాల్సిన అవసరం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. గుంటూరు సమీపంలోని లాం ఫామ్‌లోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అఖిల భారత పత్తి వార్షిక సమావేశం-2025 శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశంలో 160 మంది జాతీయ స్థాయి శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. భవిష్యత్తు విధానాలను రూపొందించడంలో పత్తి వార్షిక సమావేశం ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. పత్తి ఉత్పత్తి 15 ఏళ్ల కనిష్ఠ స్థాయికి చేరుకుందన్నారు. దిగుమతులు 3 మిలియన్ బేళ్లను మించడం కూడా ఆందోళన కలిగిస్తోందన్నారు. స్వదేశీ ఉత్పత్తిని పెంచడం తక్షణ అవసరమని చెప్పారు. భారత కాటన్ మ్యాన్‌గా పిలిచే డాక్టర్ సీడీ మాయీ మాట్లాడుతూ, గతంలో బీటీ పత్తి వంగడంతో ఉత్పత్తి, ఉత్పాదకత, లాభం పెరిగాయన్నారు. గులాబీరంగు పురుగును, వాతావరణ పరిస్థితులను తట్టుకొనే నూతన వంగడాల సృష్టి ద్వారానే దేశ భవిష్యత్ వస్త్ర అవసరాలు తీర్చగలమని పేర్కొన్నారు. సమావేశంలో నాగ్‌పూర్ ఐసీఏఆర్ - సీఐసీఆర్ డైరెక్టర్ డాక్టర్ జి.ప్రసాద్, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.కె. శుక్లా మాట్లాడారు.



విచారణకు హాజరైన పూర్వ సీవీఎస్వో శ్రీధర్ తదితరులు

భక్తుల భద్రత బాధ్యత మీదే కదా?

- మరి తొక్కిసలాట ఎలా జరిగింది?
- టీటీడీ పూర్వ సీవీఎస్వోకు కమిషన్ ప్రశ్నలు
- నేటితో మూడో దశ విచారణ పూర్తి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 21(ఆంధ్రజ్యోతి): 'తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల భద్రత బాధ్యత మీదే కదా. ఆ సమయంలో మీరెక్కడ ఉన్నారు? పద్మావతి పార్కులోకి భక్తులను ఎలా పంపించారు? ఇది మీ నిర్ణయమా, పోలీసుశాఖ నిర్ణయమా' అంటూ ఏకసభ్య న్యాయ విచారణ కమిషన్ జస్టిస్ సత్యనారాయణ మూర్తి టీటీడీ పూర్వ సీవీఎస్వో శ్రీధర్‌పై ప్రశ్నల వర్షం కురిపించినట్టు సమాచారం. తిరుపతి తొక్కిసలాట ఘటనపై శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాలులో సుమారు 3 గంటల పాటు బాధితులను, టీటీడీ విజిలెన్సు, పోలీసు, ఇతర అధికారులను జస్టిస్ సత్యనారాయణమూర్తి విచారించారు. ఆనాడు విధుల్లో ఉన్న టీటీడీ సీవీఎస్వో శ్రీధర్‌ను విచారిస్తూ.. 'పార్కుకు ఎందుకు తాళాలు వేశారు? గేటు తెరవాల్సిన అవసరం ఏముంది? తెరిచే సమయంలో ముందస్తు జాగ్రత్తలు ఎందుకు తీసుకోలేదు' అని ప్రశ్నించినట్టు తెలిసింది. ఇదే ఘటనలో సస్పెండైన డీఎస్పీ రమణకుమార్ తరపున లాయర్లు శ్రీధర్‌ను క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. ఈ ఘటనలో సస్పెండైన డీఎస్పీ రమణకుమార్, ఎస్వీ గోశాల డైరెక్టర్ హరినాథ్‌రెడ్డిని శనివారం విచారించనున్నారు. దీంతో మూడో దశ విచారణ ప్రక్రియ ముగియనుంది.

శ్రీవారి సేవలో జస్టిస్ కృష్ణమోహన్



తిరుమల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ శుక్రవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేకువజామున జరిగిన అభిషేక సేవతో పాటు ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు.

టీటీడీ ఆరోగ్య వరప్రసాదినికి రూ. కోటి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న ఏపీ రమణరాజు

తిరుమల, మార్చి21(ఆంధ్రజ్యోతి): టీటీడీ శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీమ్‌కు శుక్రవారం రూ.కోటి విరాళంగా అందింది. ఎనర్జిక్ కామెనెట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధినేత ఏపీ రమణరాజు ఈ విరాళాన్ని తిరుమలలోని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

మంత్రి ఫరూక్‌కు సతీవియోగం



షహనాజ్

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సతీమణి షహనాజ్ (69) శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లో కన్నుమూశారు. రెండేళ్లుగా శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. పవిత్ర శుక్రవారమే అంత్యక్రియలు చేయాలని పెద్దలు నిర్ణయించిన మేరకు హైదరాబాద్‌లోనే అంత్యక్రియలు నిర్వహించారు.

ఫోన్‌లో పరామర్శించిన చంద్రబాబు, పవన్, లోకేశ్

షహనాజ్ మృతి విషయం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఇతర మంత్రివర్గ సహచరులు ఫరూక్‌ను ఫోన్‌లో పరామర్శించారు.

మంత్రాలయం హుండీ ఆదాయం రూ.3.49 కోట్లు

మంత్రాలయం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.3,48,69,621 వచ్చినట్టు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, మేనేజర్-సి, ఈఈ సురేష్ కోణాపూర్ తెలిపారు. ఫిబ్రవరి 19వ తేదీ నుంచి ఈనెల 20 తేదీ వరకు భక్తులు సమర్పించిన 24 హుండీల ఆదాయాన్ని శుక్రవారం లెక్కించినట్టు తెలిపారు.

టెన్త్ ఇంగ్లిష్ పరీక్షకు 98.92 % హాజరు

అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు 98.92 శాతం మంది హాజరయ్యారని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామరాజు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ఐదుగురు విద్యార్థులను డీబార్ చేశారని, 15 మంది సిబ్బందిని సస్పెండ్ చేశారని వివరించారు. తిరుపతి జిల్లాలో ఒక విద్యార్థిని డీబార్, ఒక టీచర్ సస్పెండ్ అయ్యారని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'సమాధి' రాజకీయం

మొగల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని తొలగించాలని డిమాండ్ చేస్తూ పరివార్ సంస్థలు నిర్వహించిన నిరసన ప్రదర్శనకు, పలు అసత్యప్రచారాలు కూడా తోడై నాగపూర్ తీవ్ర మతహింసను చవి చూసింది. దీనిని ఖండిస్తూ, ఔరంగజేబు సమాధి వర్తమానంలో ఒక అనవసరపు అంశంగా ఆరెస్సెస్ వ్యాఖ్యానించడం అత్యధికులకు ఆశ్చర్యం కలిగించింది. నాగపూర్ ఆరెస్సెస్ కేంద్రస్థానం కావడమే కాక, ఔరంగజేబు సహా మొగల్ చక్రవర్తులంతా పరివార్ ప్రధాన లక్ష్యంగా కొన సాగుతున్న సంగతి తెలిసిందే. నాగపూర్ కార్యాలయం పెద్దలకు తెలియకుండానే ఈ వివాదం రేగి, ఇంత హింసాకాండ జరిగిందని అధికులకు ఎందుకో నమ్మకం కలగడం లేదు. చిన్ననిప్పురవ్వలు, కాస్తంత గాలి తోడైతే ఎన్ని కొంపలనైనా తగలబెట్టవచ్చును. నాగపూర్ హింస కార్య కారణసంబంధాలకంటే, మొత్తంగా మొగల్స్ చుట్టూ ఎంతోకాలంగా సాగుతున్న మత రాజకీయం, వారి సమాధులు, నిర్మాణాలు నిరంతర లక్ష్యాలుగా మారుతూండటం ప్రధానంగా గమనించాలి. ఎవరో అంటిస్తే తప్ప, మత హింస తనకుతానుగా రాజుకోదు.

ఈ హింస వెనుక లోతైన, ముందస్తు కుట్ర ఉన్నదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వ్యాఖ్యానించారు. ఆయన ఎవరిని లక్ష్యంగా చేసుకొని, ఏ కోణంలో ఆ మాటన్నారో తెలియదు కానీ, పెద్దగా ప్రాచుర్యం లేకుండా పడివున్న ఓ మూడువందల ఏళ్ళకు పైబడిన సమాధిని తొలగించాలని పరివార్ కార్యకర్తలు డిమాండ్ చేయడం వెనుక మాత్రం స్పష్టమైన ఆదేశాలు, నిర్దేశిత లక్ష్యాలూ ఉన్నాయి. ఇటీవలే పేరుమార్చిన ఔరంగాబాద్‌కు సమీపంలోని ఖుల్దాబాద్‌లో పెద్దగా పోల్చుకోవడానికి కూడా గొప్ప ఆనవాళ్ళు లేని ఆ కట్టడం వారిని ఆగ్రహంతో ఊపేస్తోంది. స్వయంగా ముఖ్యమంత్రే ఆ కట్టడంమీద అంత ద్వేషం ప్రకటించినప్పుడు కర్తవ్యనిర్వాహకులను, కరసేవకులను తప్పుబట్టి ప్రయోజనం లేదు. పురావస్తుశాఖ ఆధ్వర్యంలో ఉన్నందున, ఖర్మకాలి దానిని కాపాడవలసివస్తున్నదన్న రీతిలో ఫడ్నవీస్ నిండు సభలో వ్యాఖ్యానించారు. ఆ కట్టడం ఊసెత్తడమే మహాపాపం అన్నట్టుగా ఎంతో తేలికగా మాట్లాడారు. ఇక, ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీ జీవిత ఘట్టాలతో కూడిన ఒక నవల ఆధారంగా తయారైన ఛావా సినిమా మీద ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను లోతుగా గమనించినప్పుడు, నాగపూర్ హింసకు కారణమని ఆయన ఈ సినిమాను తప్పుబట్టినట్టు కనబడదు. పైగా, ఆయన ఈ చిత్రాన్ని అమితంగా ప్రశంసించారు, అందులో చెప్పినవన్నీ నిజాలేనని, చూపినవన్నీ చారిత్రక సత్యాలేనని నిర్ధారించారు. ఆ సినిమా చూసి, అసలు చరిత్రను తెలుసుకొని గుండెలు రగిలినందునే ఈ హింస జరిగిందన్న రీతిలో మాట్లాడారు. నాగపూర్ హింసకు ఎంతో ముందునుంచే సదరు చిత్రం చుట్టూ రాజకీయం నడవడం, ప్రధాని సహా బీజేపీ పెద్దలంతా చిత్రాన్ని మెచ్చుకోవడం, దాని విజయోత్సవ వేడుకల్లో ప్రత్యక్షంగా పాల్గొని ప్రోత్సహించడం చూశాం. అందులో ఉన్నది చరిత్ర కాదని, కల్పన అని, ఔరంగజేబు క్రూరుడు కాదని సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే అబూ ఆజ్మీ వ్యాఖ్యానిస్తే, మరాఠా వారసత్వాన్ని అవమానించిన ద్రోహి అంటూ మహాయుతి నాయకులంతా ఆయనను సభనుంచి గెంటివేయడమూ తెలిసిందే. మొన్నటివరకూ ముఖ్యమంత్రిగా ఉన్న శిందేకు ఏకంగా ఈ సందర్భంలో ఒసామా బిన్ లాడెన్ కూడా గుర్తుకొచ్చాడు.

ఔరంగజేబు సమాధిని కూల్చాలన్న డిమాండ్ పైస్థాయి బీజేపీ నేతలతోనే పుట్టింది. రాణేలు, శిందేలు, భోసాలేలు పద్ధతిప్రకారం వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుంటే, మా అందరిదీ ఒకేమాట, కానీ, కాంగ్రెస్ ఏలుబడిలో ఏఎస్ఐ రక్షణ దక్కడంతో దానిని విధిలేక కాపాడవలసి వస్తున్నదని స్వయంగా ముఖ్యమంత్రే చెప్పిన తరువాత, అది ఒక సందేశంగా, నెరవేర్చాల్సిన లక్ష్యంగా దిగువస్థాయికి చేరడం సహజం. తీవ్ర హింస, విధ్వంసం, వందలాది అరెస్టులతో ప్రస్తుతానికి పరిస్థితులు సద్దుమణిగినట్టు కనిపిస్తున్నప్పటికీ, త్వరలోనే ఔరంగజేబు సమాధికి బాబరీమసీదు గతే పడుతుందన్న హెచ్చరికలు భవిష్యత్ పరిణామాలకు సంకేతాలు. దేశ ఆర్థిక రాజధానినీ, పారిశ్రామికంగా అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రాన్నీ ఇటువంటి వివాదాలకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత దేవేంద్ర ఫడ్నవీస్ మీద ఉంది.

సుంకాలపై సమష్టి పోరాటం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ షేక్ స్పియర్‌ను చదివారో లేదో గాని ఆ మహాకవి మాటలలోని సత్యాన్ని బాగానే గ్రహించారు: 'స్నేహంలో చిత్తశుద్ధిలేని ముఖస్తుతి ఉన్నది'. అమెరికాకు రెండోసారి అధ్యక్షుడు అయిన తన స్నేహితుడు డోనాల్డ్ ట్రంప్‌ను పొగడ్తలతో ముంచెత్తిన మోదీ వలసలు, వీసాలు, వాణిజ్య సమతుల్యత, సుంకాలు, అణు ఇంధనం, దక్షిణ చైనా సముద్రం, బ్రిక్స్, క్వాడ్, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం మొదలైన అంశాలపై స్వదేశానికి అనుకూలంగా ట్రంప్‌తో సంప్రతింపులు జరపగలననే ఆశాభావంతో ఉన్నారు.

అధ్యక్షుడు ట్రంప్ నాలుగు సంవత్సరాలు అధికారంలో ఉంటారు. అంతకు మించి ఉండరు. ప్రధానమంత్రి నరేంద్రీ మోదీ మూడో పదవీ కాలం ఇంకా నాలుగు సంవత్సరాలు ఉన్నది. మరోసారి కూడా ప్రధానమంత్రి కావాలని ఆయన ఆశిస్తున్నారని చెప్పవచ్చు. అయితే నాలుగు సంవత్సరాల ఉమ్మడి వ్యవధిలో సమస్యలు అన్నిటినీ పరిష్కరించడం సాధ్యం కాదన్నది స్పష్టం. రాబోయే అమెరికా ప్రభుత్వం రిపబ్లికన్ పార్టీది అయినా, డెమొక్రాటిక్ పార్టీది అయినా ట్రంప్ విధానాలను కొనసాగించక పోవచ్చు. ఈ సంభావ్య పరిణామమే భారత్‌కు మొదటి పాఠం కావాలి. ప్రభుత్వాధినేతల మధ్య వ్యక్తిగత స్నేహ సంబంధాలకు అతీతంగా పరిస్థితులను సమగ్రంగా చూడాలి. ట్రంప్ గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది? ఆయనకు ఒక స్నేహితుడు ఎప్పుడు శత్రువు అవుతాడో, ఒక శత్రువు ఎప్పుడు మిత్రుడు అవుతాడో ఎవరూ చెప్పలేరు.



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

పాడ్‌కాస్టర్ లెక్స్ ఫ్రిడ్‌మాన్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో అధ్యక్షుడు ట్రంప్‌ను ప్రధాని మోదీ ఘనంగా ప్రశంసించారు. ఆయన వినమ్రతను, కష్టాల నుంచి బయటపడగల శక్తిని బాగా మెచ్చుకున్నారు. ద్వితీయ పర్యాయం అధ్యక్ష పదవీ కాలంలో సాధించాల్సిన లక్ష్యాల విషయమై ట్రంప్ మొదటిసారి కంటే బాగా సన్నద్ధమయ్యారని మోదీ అన్నారు. ఆయనకొక మార్గదర్శక ప్రణాళిక ఉన్నదని, వేసే ప్రతి అడుగు లక్ష్య పరిపూర్తికి తోడ్పడేదిగా ఉంటుందని మోదీ అన్నారు. మోదీ ఇంకా ఇలా అన్నారు: 'తాను నిర్దేశించిన లక్ష్యాలను సాధించగల శక్తిమంతమైన పాలనాదక్షుల బృందానికి బాధ్యతలు అప్పగించారు. సమర్థులైన ఆ అధికారులు అధ్యక్షుడు ట్రంప్ దార్శనికతను అమలుపరచగలరని నేను గట్టిగా విశ్వసిస్తున్నాను'.

అమెరికా ప్రజలు అందరూ ఈ ప్రశంసతో ఏకీభవించకపోవచ్చు. సెనేటర్లు, ప్రతినిధుల సభ సభ్యులు అందరూ ఆయా ప్రభుత్వ విభాగాలకు ట్రంప్ ఎంపిక చేసుకున్న అధికారులు అందరూ శక్తి మంతులని, పాలనా దక్షులని భావించడం లేదు. ట్రంప్ దార్శనికత అమెరికాకు గానీ, ప్రపంచానికిగానీ శ్రేయస్సును సమకూర్చేదని అమెరికా ప్రజలు అందరూ భావించడం లేదు.



సూత్ర బద్ధ చర్చలు, సంప్రదింపులే దౌత్యానికి హృదయం వంటివి. ముఖస్తుతి మాటలు ఎంతమాత్రం దౌత్య వ్యవహారం కాబోవు. అంతర్జాతీయ చట్టాలు, ఒడంబడికలను విచక్షణారహితంగా ఉల్లంఘించకుండా ట్రంప్‌ను అడ్డుకోవడంలో న్యాయనియమాల ప్రాతిపదికన పోరాడే వారి పక్షాన భారత్ నిలబడి తీరాలి.

డోనాల్డ్ ట్రంప్ తన దార్శనికతను అమలుపరచడమనేది భారత్‌కు శుభ వార్త కాబోదు. తన లక్ష్యాల పరిపూర్తిలో ట్రంప్ సఫలమయితే దాని పర్యవసానాలు భారత్‌కు ఎలా ఉంటాయో చూద్దాం: సరైన పత్రాలు లేకుండా అమెరికాకు వలస వెళ్లిన భారతీయులు (దాదాపు 7 లక్షల మంది అని అంచనా) దాదాపుగా అందరినీ తిరిగి భారత్‌కు పంపించి వేస్తారు; అమెరికాలో గ్రీన్‌కార్డ్ ఉన్న భారతీయులకు అమెరికా శాశ్వత పౌరసత్వాన్ని నిరాకరించే అవకాశమున్నది; విద్యాధికులు, వృత్తి నిపుణులకు జారీ చేసే హెచ్ 1బి వీసాల జారీని గణనీయంగా తగ్గించివేస్తారు; హార్లే డేవిడ్‌సన్ బైకులు, బౌర్బన్ విస్కీ, జీన్స్, ఇతర అమెరికన్ సరుకులపై దిగుమతి సుంకాలను తగ్గించడం భారత్‌కు అనివార్యమవుతుంది; భారత్ నుంచి అల్యూమినియం, ఉక్కు ఎగుమతులు, బహుశా ఇంకా ఇతర భారతీయ సరుకులపై అమెరికా భారీ స్థాయిలో సుంకాలు విధించే అవకాశమున్నది; భారత్‌లో ఉద్యోగాలను సృష్టించే పరిశ్రమలను నెలకొల్పకుండా అమెరికన్ ప్రైవేట్ పెట్టుబడులను నిరుత్సాహపరుస్తారు.

అంతర్జాతీయ సంబంధాలలో ట్రంప్ పోకడల విషయాన్ని చూద్దాం. పనామా కాలువను అమెరికా తన నియంత్రణలోకి తీసుకుంటే నరేంద్ర మోదీ ఏ విధంగా ప్రతిస్పందిస్తారు? ఆ సముద్ర మార్గంలో భారత్, ఇతర దేశాల ఓడల రాకపోకలకు అనుమతించినంతవరకు ఎవరూ నిరసన తెలుపకపోవచ్చు. అయితే పనామా కాలువను అమెరికా తన నియంత్రణలోకి తీసుకోవడమనేది నిస్సందేహంగా ఒక దురాక్రమణే. అంతర్జాతీయ న్యాయ సూత్రాలను ఉల్లంఘించడమే. గ్రీన్‌ల్యాండ్‌ను ఏదో ఒక విధంగా అమెరికా స్వాయత్తం చేసుకుంటే మోదీ ఏ విధంగా ప్రతిస్పందిస్తారు? గ్రీన్‌ల్యాండ్ మనకు సుదూరంలో ఉన్న దీవి కనుక, అమెరికా చర్యకు మనం ఆందోళన పడవలసిన అవసరం లేదని భారత్ భావిస్తుందా? కొన్ని 'దురాక్రమణలను' క్షమించవచ్చుగానీ రష్యా మరిన్ని ఉక్రెయిన్ ప్రాంతాలను, తైవాన్‌ను చైనా స్వాధీనం చేసుకుంటే భారత్ ఏ విధంగా ప్రతిస్పందిస్తుంది? అక్సాయిచిన్, అరుణాచల్‌ప్రదేశ్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు చైనా ప్రయత్నిస్తేనో?! భారత్, చైనాల మధ్య యుద్ధం తప్పక సంభవిస్తుంది. ఆ యుద్ధంలో మనకు మద్దతుగా ఏ దేశం నిలబడుతుంది?

ఆధునిక దౌత్యం వ్యక్తిగత స్నేహాలను మించిన వ్యవహారం. డెమొక్రాటిక్ పార్టీతో నెలకొల్పుకున్న స్నేహ సంబంధాలను వదులుకుని ట్రంప్ పార్టీకి మోదీ మళ్లీ ప్రాధాన్యమిస్తారా? ఏది ఏమైనా జనవరి 20, 2029 తరువాత ట్రంప్ అధికారంలో ఉండరు. తదుపరి అధ్యక్షుడు డెమొక్రాటిక్ పార్టీకి చెందిన నాయకుడు కావచ్చు.

గత పది సంవత్సరాలుగా దేశీయ పరిశ్రమల సంరక్షణ విధానానికి నరేంద్ర మోదీ ఎనలేని ప్రాధాన్యమిస్తున్నారు. ఆయన దాన్ని ఘనంగా ఆత్మనిర్భరత అని చాటుతున్నారు. తన స్నేహితుడు డాక్టర్ అర్వింద్ పనాగరియాతో సహా పలువురు ఆర్థికవేత్తల విజ్ఞతాపూర్వక సలహాలు, సూచనలను పెడచెవిని పెట్టి మోదీ ప్రభుత్వం 500కు పైగా సరుకుల దిగుమతులపై సుంకాలు, సుంకాలేతర చర్యలు చేపట్టింది. భారతీయ సరుకులపై అమెరికా వసూలు చేస్తున్న అధిక సుంకాలపై మోదీ నిరసన తెలిపినప్పుడు అయన ఆక్షేపణలను ట్రంప్ మహాశయుడు పూర్తిగా కొట్టివేశాడు. ఏప్రిల్ 2, 2025 నుంచి పూర్తి స్థాయిలో సుంకాల సమరాన్ని ప్రారంభించేందుకు ట్రంప్ ప్రభుత్వం సర్వసన్నద్ధమవుతోంది. ట్రంప్‌తో మోదీ దోస్తీ, ముఖ ప్రీతి మాటలు బాగానే ఉన్నాయి గానీ, ట్రంప్ సుంకాల సమరం నుంచి ఇండియాను మినహాయించడానికి అవి తోడ్పడుతాయా? ట్రంప్ విధించే ప్రతీకార సుంకాలను భారత్ ప్రతిఘటిస్తుందా?

సూత్రబద్ధ చర్చలు, సంప్రదింపులే దౌత్యానికి హృదయం వంటివి. ముఖస్తుతి మాటలు ఎంతమాత్రం దౌత్య వ్యవహారం కాబోవు. ఆచరణాత్మక వైఖరి నిండుగా ఉన్న ఫ్రెడ్రిచ్ మెర్జ్ (కాబోయే జర్మన్ ఛాన్సలర్), ట్రంప్ విసురుతున్న సవాళ్లకు దీటుగా ప్రతిస్పందిస్తున్న కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ, 27 యూరోపియన్ యూనియన్ దేశాలను సంఘటితం చేసిన యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్‌లు అంతర్జాతీయ చట్టాలు, ఒడంబడికలను విచక్షణారహితంగా ఉల్లంఘించకుండా ట్రంప్‌ను అడ్డుకోవడంలో విజయం సాధించే అవకాశమున్నది. న్యాయ నియమాల ప్రాతిపదికన పోరాడేవారి పక్షాన భారత్ నిలబడి తీరాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)


భారత్ భవిష్యత్తుపై రెండు దృక్కోణాలు

తమిళనాడు పాలక పార్టీ నాయకులు, బీజేపీ రాజకీయవేత్తల మధ్య మాటల యుద్ధాన్ని రెండు భాషల (తమిళం, హిందీ) మధ్య పోరాటంగా పత్రికలలో చిత్రిస్తున్నారు. ఈ వర్ణన సరైనదే కానీ, సంపూర్ణమైనది కాదు. విశదంగా చూస్తే అధికార భాషా చర్చ రెండు భిన్న భారత్ భావనలకు ప్రాతినిధ్యం వహిస్తోంది: మొదటి భావన రాజకీయాలలోను, సంస్కృతిలోను వైవిధ్యం, వ్యత్యాసాన్ని స్వాగతించేది కాగా రెండో భావన అవ్యక్త ఆదర్శం 'ప్రమాణీకరణ, సజాతీయత, కేంద్రీకరణ'.

తమిళనాడులో హిందీ పట్ల వ్యతిరేకతకు దశాబ్దాల చరిత్ర ఉన్నది. 1937లో మద్రాస్ ప్రెసిడెన్సీలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ దశల వారీగానే అయినప్పటికీ పాఠశాలల్లో హిందీ బోధనను తప్పనిసరి చేసింది. ఇందుకు కారకుడు అయిన నాటి మద్రాస్ ప్రధానమంత్రి (ముఖ్యమంత్రికి అప్పటి వాడుక అది) సి.రాజగోపాలాచారి ఆ తరువాత హిందీకి వ్యతిరేకమయ్యారు. 1950వ ఆరంభం నాటికే ఆయన, ఇప్పటి తమిళ రాజకీయవేత్తలవలే, మాతృభాషకు అదనంగా ద్వితీయ భాషనేదైనా బోధించవలసివస్తే అది ఇంగ్లీషే అవ్వాలి కాని, హిందీ కాకూడదని వాదించారు. 1965లో ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి హిందీని దేశవ్యాప్తంగా అధికార భాషగా అమలుపరిచేందుకు ప్రయత్నించారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య ప్రభుత్వ వ్యవహారాలన్నీ ఆంగ్లంలో కాకుండా హిందీలో జరగాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై మద్రాసు రాష్ట్రంలో నిరసనలు వెల్లువెత్తాయి. ఆనాడు ఆ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న డీఎంకే హిందీ వ్యతిరేక ఆందోళనను తనకు అనుకూలంగా ఉపయోగించుకుని రాజకీయ లబ్ధి పొందింది. తమిళుల మనోభావాలను గాయపరిచిన హిందీ ఉత్తర్వును శాస్త్రి ఉపసంహరించుకున్నప్పటికీ కాంగ్రెస్ ప్రతిష్ఠకు తీరని విఘాతమేర్పడింది. తమిళనాట దశాబ్దాలుగా ప్రాబల్య పార్టీగా ఉన్న కాంగ్రెస్ 1967లో అధికారాన్ని కోల్పోయింది. తదాది తమిళనాడులో ఏదో ఒక ద్రావిడ పార్టీ మాత్రమే అధికారంలో ఉంటూ వస్తోంది.

ఈ చరిత్ర అంతా ఎమ్‌కె స్టాలిన్, ఆయన సలహాదారులకు బాగా తెలుసు. హిందీ పట్ల తీవ్ర వ్యతిరేకత 1960ల్లో ఒక ఆధిపత్య రాజకీయ పార్టీని అధికారం నుంచి కూల్చి వేసినట్టుగానే ఇప్పుడు కూడా ఆ వ్యతిరేకత వర్తమాన ఆధిపత్య పార్టీని దూరంగా ఉంచుతుందనేది వారి సునిశ్చిత విశ్వాసం. తమిళనాడులో రాజకీయంగా విస్తరించి అధికార జయ పతాక నెగురవేసేందుకు బీజేపీ శతవిధాల ప్రయత్నిస్తోంది. నరేంద్ర మోదీ విశేష ప్రచారం కల్పించిన 'కాశీ–తమిళ్ సంగమం' కార్యక్రమం, కొత్త పార్లమెంటు భవనంలో 'సెంగోల్' ప్రతిష్ఠాపన, ఒక మాజీ ఐపీఎస్ అధికారిని తమిళనాడులో హిందూత్వ ఉద్ధారకుడుగా నిలబెట్టేందుకు బీజేపీ అగ్రనాయకత్వం వినియోగిస్తున్న శక్తియుక్తులను పరిశీలిస్తే తమిళనాట అధికారాన్ని కైవసం చేసుకునేందుకు బీజేపీ ఎంతగా ఆరాటపడుతుందో అర్థమవుతుంది.

హిందీ విధింపుపై తమిళనాడు వ్యతిరేకతకు రాజకీయ, సాంస్కృతిక ప్రాతిపదికలు ఉన్నాయి. అయినప్పటికీ మౌలిక రాజ్యాంగ స్ఫూర్తికి అది పూర్తిగా అనుకూలంగా ఉన్నది. 1976 వరకు విద్య రాష్ట్ర జాబితాలోని అంశంగా ఉండేది. అత్యవసర పరిస్థితి కాలంలో దానిని ఉమ్మడి జాబితాలో చేర్చారు. నిరంకుశపాలనలో ఏకపక్షంగా జరిగిన మార్పు అది. ఆ రాజ్యాంగ సవరణ ఆధారంగానే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తాను నిర్దేశించిన విద్యా విధానాన్ని అనుసరించి తీరాలని తమిళనాడును ఒత్తిడి చేస్తోంది. లేనిపక్షంలో నిధులను ఉపసంహరించుకుంటామని బెదిరిస్తోంది. తమిళనాడు వైఖరిని వ్యతిరేకిస్తున్నవారు వివిధ కమిషన్లు సిఫారసు చేసిన త్రిభాషా సూత్రాన్ని ప్రస్తావిస్తున్నారు. పాఠశాల బాలలు మాతృభాష, ఇంగ్లీష్‌తో పాటు మూడో భాషనూ నేర్చుకోవాలని ఆ సూత్రం ప్రతిపాదించింది.



స్వతంత్ర భారతదేశం మత, భాషాపరమైన బహుళతత్వాన్ని అంగీకరించి ఆదరించి అనుసరిస్తోంది. తమిళనాడు, కేంద్ర ప్రభుత్వాల మధ్య ప్రస్తుత ప్రతిష్టంభన మన దేశం గురించిన రెండు దృక్కోణాల మధ్య ఘర్షణ. వాటిలో ఒకటి– వస్త్రధారణ, ఆహార అలవాట్లు, వివాహ బంధం, దైవ ప్రార్థన విషయంలో భారతీయుల స్వేచ్ఛను సమర్థించేది, ప్రోత్సహించేది. మరొకటి ఆ స్వేచ్ఛ స్థానంలో అన్నిరకాల నిర్దేశాలు, నిషిద్ధాలు విధించేది.

అయితే హిందీ రాష్ట్రాలలో మూడో భాషగా సంస్కృతాన్ని మాత్రమే బోధించడం జరుగుతోంది. యూపీ, బిహార్‌ల్లో ప్రభుత్వ పాఠశాలల్లో తమిళం లేదా కన్నడం లేదా బెంగాలీ లేదా మలయాళ భాషను ఎన్నడూ మూడో భాషగా బోధించిన దాఖలాలు లేవు. కనీసం మరాఠీ లేదా గుజరాతీని సైతం బోధించలేదు. ఈ త్రిభాషా సూత్రాన్ని తమిళనాడు అమలుపరచ లేదు. ఉత్తరాది రాష్ట్రాలలో అది ఆచరణలో ఎలా పరిణమించిందన్నది తమిళనాడు అభ్యంతరాలను ధ్రువ పరిచింది. జాతీయ సమైక్యతను పెంపొందించడానికి బదులుగా ప్రభుత్వ ప్రాయోజిత హిందీ విస్తరణ వాదానికి త్రిభాషా సూత్రం ఒక అనుద్దేశపూర్వక సాధనమయింది. సరిగ్గా ఈ కారణంగానే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం కూడా త్రిభాషాసూత్రాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ విషయమై ప్రధానమంత్రి మౌనంగా ఉన్నప్పటికీ హోం మంత్రి మాత్రం విభిన్న రాష్ట్రాల మధ్య కమ్యూనికేషన్ మాధ్యమంగా హిందీ మాత్రమే ఉండాలని ఉంటుందని పదే పదే ఉద్ఘాటిస్తూ వస్తున్నారు. ఆంగ్లంలో మాట్లాడే భారతీయుల పట్ల తన అయిష్టతను సైతం ఆయన పదే పదే వ్యక్తం చేస్తూనే ఉన్నారు. 1965 నుంచి 2014 దాకా అర్ధ శతాబ్దం పాటు హిందీయేతర రాష్ట్రాలలో హిందీని ప్రోత్సహించేందుకు కేంద్రం శ్రద్ధగా ప్రయత్నించలేదు. అయినప్పటికీ హిందీ దేశ వ్యాప్తంగా వ్యాపించింది. అంతర్ రాష్ట్ర వలసలు, మరీ ముఖ్యంగా సినిమాలు, టీవీ మాధ్యమం ద్వారా ఆ భాషా వ్యాప్తి జరిగింది. బాంబే హిందీ సినిమాలు, టీవీ సీరియల్స్‌లో ఉపయోగించే హిందీ మృదువైన, వ్యవహారిక హిందుస్థానీయే గానీ ఆకాశవాణి, ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలలో ఉపయోగించే సౌలభ్యమూ, సౌందర్యమూ కొరవడిన, మితిమీరిన స్థాయిలో సంస్కృతీకరణ అయిన హిందీ కాదు.



▪ రామచంద్ర గుహ

గతానుగతం

మోహన్ భగవత్ ఇటీవల కేరళలో ఒక సమావేశంలో మాట్లాడుతూ హిందువులు ఆంగ్ల భాషను త్యజించాలని కోరారు. ఒకప్పుడు లోహియా వలే ఇప్పుడు ఆరెస్సెస్ అధినేత కడా ఇంగ్లీష్‌ను ఆంగ్ల మానస పుత్రులైన భారతీయుల భాషగా పరిగణిస్తున్నారు. వలసపాలన భావ దాస్యంలో ఉన్నవారు ఆ భాషను ఔదలదాలుస్తున్నారనేది వారి ఆరోపణ. ఇంగ్లీష్ త్వరలోనే భారత్ నుంచి బహిష్కృతమవుతుందని లోహియా భావించారు. ఆయన ఆశించినట్టు జరగలేదు. ముఖ్యంగా 1990ల నుంచి ఇంగ్లీష్ శీఘ్రగతిన వ్యాప్తి చెందింది. ప్రభుత్వ ప్రాపకం ద్వారా కాకుండా ఇతరేతర రీతుల్లో అది వ్యాప్తి చెందింది. సాఫ్ట్‌వేర్ బూమ్ ఇందుకొక ప్రధాన కారణం. మన ఇంజినీరింగ్ కళాశాలలు అన్నీ ఇంగ్లీష్‌లోనే బోధించడం వల్లే అది సంభవించింది. సామాజిక చలనశీలతకు మార్గంగా, వృత్తిపరమైన పురోగతికి సోపానంగా, విశాల ప్రపంచాన్ని అర్థం చేసుకునేందుకు ఒక ప్రధాన గవాక్షంగా ఆంగ్ల భాష గుర్తింపు, ప్రాధాన్యాన్ని పొందింది.

ఆధునిక వృత్తులలోకి ప్రవేశించేందుకు దళితులు ఆంగ్ల భాషను నేర్చుకుని తీరాలని ప్రముఖ మేధావి చంద్రభాన్ ప్రసాద్ చాలా సంవత్సరాలుగా వాదిస్తున్నారు. ఆంగ్ల భాషలో ప్రావీణ్యాలు లేకపోవడం వల్లే ఆధునిక వృత్తులలో దళితుల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని ఆయన విశ్వసిస్తున్నారు. 'ఇంగ్లీష్ సివంగి పాలు వంటిది, ఆ పాలను తాగిన వారే గర్జించగలరన్న' అంబేడ్కర్ మాటలను తన వాదనకు మద్దతుగా ఆయన తరచు ఉటంకిస్తుంటారు. మాతృభాషా అభిమానంతో కన్నడ సాహిత్యలోక దిగ్గజాలు పాఠశాలల్లో ఆంగ్ల భాషను బోధించ వద్దని విజ్ఞప్తి చేసినప్పుడు దళిత మేధావులు గర్జిస్తూ ఇలా ప్రతిస్పందించారు: తొలుత మీరు మాకు సంస్కృతాన్ని నిరాకరించారు. ఇప్పుడు ఇంగ్లీష్‌నూ అదే విధంగా నిరాకరిస్తున్నారు. మీ అగ్రకుల ప్రాముఖ్యాన్ని, నిలబెట్టుకునేందుకే మీరు ఇలా చేస్తున్నారు.

నరేంద్ర మోదీ అధికారానికి రావడానికి ముందు కాలంలో హిందీ, ఇంగ్లీష్ రెండూ దేశవ్యాప్తంగా విశేష ప్రాచుర్యం పొందాయి. వ్యాకరణ సమ్మతంగా రాయలేకపోయినప్పటికీ, స్ఫుటంగా మాట్లాడలేకపోయినప్పటికీ ఇప్పుడు చాలా మంది భారతీయులు ఆ రెండిటిలో ఏదో ఒక భాషను గానీ లేదా రెండిటినీ గానీ అర్థం చేసుకోగలుగుతారు. హిందీయేతరులు హిందీని, భారతీయులు ఇంగ్లీష్‌ను ఇలా ఆదరంగా స్వీకరించడమనేది స్వచ్ఛందంగా, స్వతస్సిద్ధంగా జరిగిందని చెప్పి తీరాలి. ఇది దేశ ప్రజలపై రాజకీయంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా ఆరోగ్యకరమైన ప్రభావాన్ని చూపింది. విషాదేమేమిటంటే ఈప్రక్రియ మరింత ప్రగతిశీలంగా ముందుకు సాగకుండా సంఘ్ పరివార్ రాజ్యాధికారాన్ని ఉపయోగించి ఆంగ్లాన్ని అణచివేసి హిందీని సర్వత్రా ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తోంది. హిందువులు మాత్రమే ఈ దేశ సహజ పౌరులు అన్న వారి సంకుచిత విశ్వాసం వల్లే ఇలా వ్యవహరించడం జరుగుతోంది. భాషా రంగంలో జాతీయ సమైక్యతకు హిందీ ఉపయోగపడుతుందని వారు విశ్వసిస్తున్నారు.

హిందువులే ఈ దేశ నిజమైన పౌరులు అని చెప్పుతూ భారతీయ ముస్లింలను తులనాడుతూ అణచి వేసేందుకు మోదీ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం చేస్తున్న ప్రయత్నాలను ఇదే కాలమ్‌లో గతంలో పలుమార్లు వివరించాను. అయితే నేను తమిళనాడులో ఓటు వేయడం లేదు. కుటుంబ పాలన విషయంలో కాంగ్రెస్‌కు తీసిపోని డీఎంకే పట్ల నాకు అభిమానమూ లేదు, నేను ఆ పార్టీ పక్షపాతినీ కాను. అధికార భాషపై ఘర్షణ రెండు పాలక పార్టీల మధ్య కాదు, అది మన దేశం గురించిన రెండు దృక్కోణాల మధ్య ఘర్షణ. వాటిలో ఒకటి– వస్త్రధారణ, ఆహార అలవాట్లు, వివాహ బంధం, దైవ ప్రార్థన విషయంలో భారతీయుల స్వేచ్ఛను సమర్థించేది, సంపూర్ణంగా ప్రోత్సహించేది కాగా మరొకటి ఆ స్వేచ్ఛ స్థానంలో అన్నిరకాల నిర్దేశాలు, నిషిద్ధాలు విధించేది.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

పెనుప్రమాదంలో హిమానీనదాలు

మంచినీటి ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడానికి, జలవనరుల స్థిరనిర్వహణ కోసం 32వ ప్రపంచ నీటి దినోత్సవాన్ని 'హిమానీనద సంరక్షణ' ఇతివృత్తంతో నేడు నిర్వహించుకుంటున్నాం. 1993 నుంచి ఐక్యరాజ్యసమితి ఏటా మార్చి 22వ తేదీన ప్రపంచ నీటి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నది.

పది శాతానికి పైగా ప్రపంచ భూభాగాన్ని కప్పి ఉంచిన హిమానీనదాలు, మానవాళి మనుగడకు అత్యంత ఆవశ్యకమైన మంచినీటిని అందించే ప్రధాన వనరులు. నిరంతరం కురిసే మంచు కాలక్రమేణా మందపాటి మంచుపలకంగా మారి, తన బరువు కారణంగా కిందకు జారుతూ, పారే నదులుగా మారుతాయి. ఆస్ట్రేలియాలో మినహా, అన్ని భూఖండాలలో వున్న హిమానీనదాలు వాతావరణ మార్పులకు గురై, కుంచించుకుపోతూ, ప్రాణుల మనుగడకు సవాలు విసురుతున్నాయి.

పది శాతానికి పైగా ప్రపంచ భూభాగాన్ని కప్పి ఉంచిన హిమానీనదాలు, మానవాళి మనుగడకు అత్యంత ఆవశ్యకమైన మంచినీటిని అందించే ప్రధాన వనరులు. ఆస్ట్రేలియాలో మినహా, అన్ని భూఖండాలలో వున్న హిమానీనదాలు వాతావరణ మార్పులకు గురై, కుంచించుకుపోతూ, ప్రాణుల మనుగడకు సవాలు విసురుతున్నాయి.



విలుప్తమైన వాటిని కూడా పరిగణిస్తే, ప్రపంచంలో రమారమి రెండు లక్షల చిన్న, పెద్ద హిమానీనదాలు వున్నాయి. వీటిలో సింహభాగం భూగోళానికి ఉత్తర, దక్షిణ ధ్రువాలలోని ఆర్కిటిక్, అంటార్కిటికా ఖండాలలో 130–170 చదరపు కిలో మీటర్లలో విస్తరించిన ఖండాంతర హిమానీనదాలు వున్నాయి. మిగిలినవి దాదాపు లక్ష చదరపు కిలోమీటర్లలో విస్తరించి హిందూకుష్ హిమాలయ ప్రాంతంలో వున్నాయి. ధృవ ప్రాంతాలకు వెలుపల ఎక్కువ మొత్తంలో మంచు, మంచు పలకలూ ఉన్నందున ఈ ప్రాంతం మూడో ధ్రువంగా గుర్తింపు పొందింది.

మూడో ధ్రువంలో భాగమైన ఆఫ్ఘానిస్తాన్, పాకిస్థాన్, తజకిస్తాన్ దేశాల పరిధిలోని హిందూకుష్ పర్వతాలలో, భూటాన్, చైనా, భారత్, నేపాల్, పాకిస్థాన్, ఆఫ్ఘానిస్తాన్ దేశాలలోని హిమాలయ పర్వత ప్రాంతాలలో కలిపి దాదాపు 46 వేల హిమానీనదాలు వున్నాయి. ఎనిమిది వేల మీటర్లకు పైగా వున్న 14 శిఖరాలలోని హిమానీనదాలు సింధు, గంగ, బ్రహ్మపుత్ర వంటి పది ప్రధాన నదులకు జీవం పోస్తూ అత్యధిక జనాభా గల దేశాలలో పర్యావరణానికి ఊతమిస్తున్నాయి. ధ్రువ ప్రాంతాలకు వెలుపల, అధికంగా ఏడు వేల హిమానీనదాలు కలిగివున్న దేశంగా పాకిస్థాన్ నిలుస్తోంది.

భారత్ విషయానికి వస్తే, ధ్రువ ప్రాంతాలకు ఆవల 78 కి.మీ. పొడవున్న సియాచిన్ రెండో అతిపెద్ద హిమానీనదం. ఇది కాకుండా, గంగ నది జన్మస్థానం గంగోత్రి, మిలన్, జెము, పిండారీ వంటి ప్రముఖ హిమానీనదాలు దేశంలో వున్నాయి. వాతావరణ మార్పులతో, హిందూకుష్ హిమాలయ ప్రాంతంలోని హిమానీనదాలు ద్విగుణీకృత వేగంతో కరుగుతున్నాయి.

పదేళ్ల క్రితం, లద్దాఖ్‌లోని లేహ్ జిల్లాలో కులుం గ్రామం ఇల్లూ వాకిలి వదిలి సమీపంలోని లేహ్–మనాలి జాతీయ రహదారి మీద ఉప్షి గ్రామంలో ఉపాధికి వలస వెళ్ళింది. తమ గ్రామం యావత్తూ ఆధారపడిన హిమానీనది కరిగిపోవడం, ఏడాదికేడాది తగ్గుముఖం పట్టిన మంచు మొత్తం ఇరవై కుటుంబాలకు తాగునీరు, సాగునీరు లేకుండా చేయడమే దీనికి కారణం. మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరిగిన ఉష్ణోగ్రతలు పర్వత ప్రాంతాలలో శరదృతువు మంచును వసంత ఋతువులో నీటిగా వాడుకునే పరిస్థితిని క్రమంగా మారుస్తున్నాయి. లద్దాఖ్‌లో పద్మశ్రీ చెవ్వాన్గ్ నోర్ఫెల్ పర్వతపువాలులో చేపట్టిన కృత్రిమ హిమానీనదాల నిర్మాణం, లేదా రామన్ మెగసెసే అవార్డు గ్రహీత, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఏటా శీతాకాలంలో నిర్మిస్తున్న హిమాస్థూపాలు అక్కడ చేజారుతున్న పరిస్థితిని అవగతం చేస్తున్నాయి. ఇది కేవలం కులుం గ్రామ కథ కాదు, హిమాలయ సానువుల్లో వున్న ప్రతి గ్రామం ఎదుర్కొంటున్న సవాలే. హిమాలయాల పర్యావరణాన్ని కాపాడే ఉద్యమంలో భాగంగా సోనమ్ వాంగ్‌చుక్ గత నెలలో ఖర్దుంగ్ లా పాస్ దగ్గర కరుగుతున్న హిమానీనద భాగాన్ని (ట్రావెలింగ్ గ్లేసియర్) ఐక్యరాజ్య సమితి ముఖ్య కార్యాలయంలో పర్యావరణ కార్యక్రమ అధికారి జమీల్ అహ్మద్‌కి అందజేసి హిమాలయ ప్రాంత ప్రజలు ఎదుర్కోనున్న మనుగడ సమస్యను, హిమానీనద సంరక్షణ ఆవశ్యకతను నొక్కి చెప్పారు.

భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) 1984–2023 మధ్య హిమాలయ నదీ పరీవాహక ప్రాంతాలలో సేకరించిన వివరాల విశ్లేషణలో, పది హెక్టార్ల విస్తీర్ణం పైబడిన 2431 హిమానదీయ సరస్సులలో 676 సరస్సుల విస్తీర్ణం రెట్టింపయింది. ఇందులో 130 భారత్ పరిధిలోనివే. దీనర్థం, మంచు కరిగి నదుల ద్వారా సముద్రాలలో కలిసి, సముద్రాల మట్టం పెంచడం, తద్వారా తీర ప్రాంతాలను ముంచడం. ఇది దీర్ఘకాల ప్రమాదమైతే, హిమానదీయ సరస్సులు కట్టలు తెగి (గ్లేషియల్ లేక్ అవుట్ బరస్ట్ ఫ్లడ్స్) 2013 కేదార్‌నాథ్ వరదల వంటి ప్రమాదాలూ పొంచి ఉన్నాయి. క్రమరీతిలో నీటి లభ్యత లేకపోతే, గంగ వంటి జీవనదులు కాస్తా కాలానుగుణ నదులుగా మారే ప్రమాదం వున్నది. జాతీయ ధ్రువ, మహాసముద్ర పరిశోధన కేంద్రం (ఎన్‌సిపిఓఆర్) హిమాచల్‌ప్రదేశ్‌లోని లాహోల్ స్పితీలోని చంద్రబేసిన్‌లో జరిపిన పరిశోధనలో 2013–2021 మధ్య హిమ ప్రాంతానికి ఆరుశాతం మేరకు నష్టం వాటిల్లినట్టు తెలిసింది.

గంగ, బ్రహ్మపుత్ర నదీ వ్యవస్థలకు దాదాపు సగం నీరు హిమానీనదాలు కరిగిన నీటి ద్వారానే లభ్యమవుతుంది. అయితే, క్రమంగా తగ్గుతున్న హిమానీనదాలు, నేరుగా ఆయా పరీవాహక ప్రాంతాలలోని వ్యవసాయం, పరిశ్రమలు, గృహ అవసరాల నీటి లభ్యతను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. విలుప్తమవుతున్న హిమానీనదాలు, హిమాలయాల్లోని కులుం వంటి గ్రామాలను ఇప్పటికే ప్రమాదంలో పడేశాయి. హిమాలయాలను ప్రభావితం చేసే అన్ని అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి తక్షణమే దిద్దుబాటు చర్యలను తీసుకుంటేనే దశాబ్దాల నిర్లక్ష్యం వల్ల జరిగిన నష్టాన్ని ప్రస్తుతానికి అరికట్టగలం. హిమాలయాలకు అయిన గాయం మానడానికి అవి ఏర్పడడానికి పట్టినంత సమయం పడుతుంది. ఇది ఒక ప్రభుత్వమో, దేశమో చేయగల కార్యం కాదు. సమష్టిగా మానవాళి తమ మనుగడ కోసం, తమ జీవన శైలిని మార్చుకోవాల్సిన అవసరాన్ని గుర్తించాలి. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా హిమానీనద సంరక్షణ కోసం ప్రతిజ్ఞ చేయాలి.

• రమేశ్‌చంద్ర రావులపల్లి (ఐ.ఐ.ఎస్)

(నేడు ప్రపంచ నీటి దినోత్సవం)

కెవిఆర్ లేఖలు ఆవిష్కరణ

కెవిఆర్‌గా ప్రసిద్ధుడైన కె.వి.రమణా రెడ్డి తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రభావశీలమైన వ్యక్తి. కావలి జవహర్ భారతిలో అధ్యాపకులుగా పని చేస్తూనే రచనా వ్యాసంగాన్ని కొనసాగించినవారు. సాహిత్య రచనలో భిన్నప్రక్రియలలో కెవిఆర్ కృషి ఉంది. జీవితాంతం ప్రగతిశీల ఉద్యమాలలో భాగమైనవాడు. 1970లో ఏర్పడిన విప్లవ రచయితల సంఘానికి కార్యదర్శి. ఎరుపు, అరుణతారకు సంపాదక బాధ్యతలు నిర్వహించాడు. 1975 జూన్‌లో అత్యవసర స్థితిలో 21 నెలలు జైలు జీవితాన్ని అనుభవించారు. తెలుగు సమాజపు సృజనాత్మక ఆవరణకు కెవిఆర్ సాక్షి. గురజాడ సాహిత్య కల్పనను మహోదయం పేరిట పరిచయం చేశారు. రవీంద్రుని కథలను తెలుగు చేసారు. చివరిశ్వాస వరకు విప్లవ రచయితల సంఘం బాధ్యతలలో ఉన్నారు. 1998 జనవరిలో కెవిఆర్, 2009లో అయన సహచరి శారదాంబ మరణించారు. కుటుంబ సభ్యులు కెవిఆర్–శారదాంబ కమిటీని ఏర్పాటు చేసి పుస్తకాలను ప్రచురించి, ప్రతి ఏటా కెవిఆర్ పుట్టిన తేదీ మార్చి 23న స్మారక ప్రసంగాలను నిర్వహిస్తున్నారు. ఈ ఆదివారం విజయవాడలోని స్వర్ణాప్యాలెస్ సమావేశ మందిరం (చల్లపల్లి బంగళా)లో ఉదయం 10గం.లకు కెవిఆర్ లేఖలు ఆవిష్కరణ జరుగుతుంది. 'సంస్కృతి, భావజాలం, కెవిఆర్ దృక్పథం' అనే అంశంపై ప్రొఫెసర్ కాశీం, 'జీఎస్.సాయిబాబ అమరత్వం'పై వసంత ప్రసంగాలు ఉంటాయి.

– అరసవిల్లి కృష్ణ
కెవిఆర్–శారదాంబ స్మారక కమిటీ



భారీ విమాన రాకపోకలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం వేదికగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భారీ విమానాల సంఖ్య పెరగడంతో అందుకు తగ్గట్టుగానే ఆక్యుపెన్సీ నిష్పత్తి కూడా వృద్ధి చెందింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో విస్తరించిన రన్‌వే కారణంగా ప్రస్తుతం భారీ విమానాల రాకపోకలకు మార్గం ఏర్పడింది.

జామ్‌జామ్‌గా జంబో..!

విజయవాడ విమానాశ్రయం నుంచి భారీ విమానాల రాకపోకలు

ఎనిమిది నెలల్లో ఎనిమిది భారీ విమానాలు

రోజూ ఎయిర్‌బస్ 5, బోయింగ్ 3.. పెరిగిన ఆక్యుపెన్సీ

- ఢిల్లీ, ముంబయి ప్రయాణికులకు ఉపయుక్తంగా..
- బెంగళూరు, హైదరాబాద్, వైజాగ్‌కు బోయింగ్
- విమానాలకు అనుకూలంగా మారిన కొత్త రన్‌వే



విజయవాడ విమానాశ్రయంలో భారీ విమానం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి భారీ విమానాలు ఎక్కువ సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. ఎయిర్‌బస్, బోయింగ్ విమానాలు పోటీలు పడుతూ తిరుగుతున్నాయి. గతంలో ఒకటి, రెండు మాత్రమే ఉండగా, ప్రస్తుతం ఎనిమిది భారీ విమానాలు నడుస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 37 నుంచి 50కు విమానాల సంఖ్య పెరిగింది. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు విమాన సర్వీసులు గణనీయంగా పెరిగాయి. ఈ కారణంగా భారీ విమానాల సంఖ్య కూడా పెరిగింది.

భారీ విమానాలు ఇవే..

విజయవాడ విమానాశ్రయం నుంచి రోజూ 8 భారీ విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిలో ఐదు ఎయిర్‌బస్, మూడు బోయింగ్ విమానాలు ఉన్నాయి. ఎయిర్‌బస్‌లలో ఏ321, ఏ330, ఏ380 రకాలు ఉంటాయి. ఇవన్నీ విమానాశ్రయంలో ల్యాండ్ కావటానికి అవకాశం ఉంది. ఎయిర్‌బస్ ఏ321లో 150 నుంచి 180 మంది ప్రయాణించవచ్చు. ఏ330లో 250 నుంచి 300 వరకు ప్రయాణించవచ్చు. ఎయిర్‌బస్ ఏ380లో 500 నుంచి 850 మంది ప్రయాణించవచ్చు. వీటిలో ఎయిర్‌బస్ ఏ321 విమానాలు ప్రస్తుతం మన దగ్గర రాకపోకలు సాగిస్తున్నాయి. ఎయిరిండియా సంస్థ ఢిల్లీకి మూడు విమానాలు నడుపుతోంది. ఇండిగో సంస్థ ఆధ్వర్యంలో ముంబయికి రెండు నడుస్తున్నాయి. ఎయిర్‌బస్‌లతో పోల్చుకుంటే పరిమాణం రీత్యా బోయింగ్ విమానాలు పెద్దగా ఉంటాయి. ఈ విమానాల్లో బీ737, బీ777, బీ787 విమానాలు ఉంటాయి. బోయింగ్ 737లో 130 నుంచి 220 మంది ప్రయాణించవచ్చు. బోయింగ్ 777లో 300 నుంచి 400 మంది ప్రయాణించవచ్చు. బోయింగ్ 787లో 240 నుంచి 330 మంది ప్రయాణించవచ్చు. ఈ బోయింగ్ శ్రేణి విమానాలన్నీ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యేలా రన్‌వేను సిద్ధం చేశారు. ప్రస్తుతం మన దగ్గర బోయింగ్ 737 విమానాలు నడుస్తున్నాయి. ఈ విమానాలు బెంగళూరుకు 1, హైదరాబాద్‌కు 1, విశాఖపట్నానికి 1 చొప్పున నడుస్తున్నాయి. వీటిని ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ నడుపుతోంది.

రన్‌వేను విస్తరించడం వల్లే..

విజయవాడ విమానాశ్రయం భారీ విమానాలు ల్యాండింగ్ కావటానికి వీలుగా రన్‌వే పటిష్ఠతతో పాటు విస్తరణ పనులు కూడా గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగాయి. 2017లో అప్పటికి ఉన్న 1,685 మీటర్ల రన్‌వేను భారీ విమానాలు దిగేందుకు వీలుగా అభివృద్ధిపరచటంతో పాటు అదనంగా 600 మీటర్ల మేర రన్‌వేను విస్తరించారు. ఫలితంగా మొత్తం 2,285 మీటర్ల పొడవున రన్‌వే విస్తరించింది. దీనివల్ల ఎయిర్‌బస్-321 అనే పెద్ద విమానాలు ల్యాండింగ్ అయ్యే స్థాయికి విమానాశ్రయం చేరుకుంది. ఆ తర్వాత భూ సేకరణ జరిపి మిగతా 6లో..

మరో షాక్..!

వెస్ట్ బైపాస్ పనుల్లో మరో వివాదం



అంబాపురం వద్ద వెస్ట్ బైపాస్ రోడ్డు

- 25 రోజులు విద్యుత్ సరఫరా ఆపాలని రాధా సంస్థకు ఎన్‌హెచ్ లేఖ
- అసలు సంబంధం లేని సంస్థకు లేఖ రాయడంపై విమర్శలు
- ఒప్పందం జరిగింది ల్యాంకోతో.. చెల్లింపులు మాత్రం రాధాకు..
- ఆ సంస్థతో సంబంధం లేదని ల్యాంకో లిక్విడేటర్ లేఖ
- అయినా సదరు సంస్థతోనే ఎన్‌హెచ్ అధికారుల మంతనాలు
- ఫలితంగా రూ.250 కోట్ల వరకు నష్టం జరిగే అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వెస్ట్ బైపాస్ రోడ్డు నిర్మాణంలో చిత్ర విచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. ల్యాంకో లైన్ తమదని, రాధా సంస్థకు సంబంధం లేదని ఓవైపు ల్యాంకో లిక్విడేటర్ స్పష్టంగా చెబుతుండగా, ఆ వివాదం తేలకుండానే ఎన్‌హెచ్ అధికారులు మరో వివాదానికి తెరలేపారు. ఫలితంగా కేంద్రానికి రూ.250 కోట్ల నష్టం ఏర్పడేలా చేశారు.

జరిగింది ఇదీ..

ల్యాంకో పవర్ ప్లాంట్ ఆస్తులను విక్రయానికి పెట్టిన లిక్విడేటర్.. ఎన్‌హెచ్ విజయవాడ డివిజన్ పీడీకి జనవరి 18న ఓ లేఖ రాశారు. రాధా గ్రూప్ సంస్థకు, ల్యాంకో ట్రాన్స్‌మిషన్ 400 కేవీ లైన్‌కు ఎలాంటి సంబంధం లేదని, దానిని తాము ఎంసీఎం పసిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు విక్రయించామని, తమకూ ఆ సంస్థకు చెల్లింపుల వివాదం నడుస్తోందని లేఖలో పేర్కొన్నారు. రాధా సంస్థతో ఎన్‌హెచ్ జరిపే ఏ విధమైన ఆర్థిక లావాదేవీలకు, తమకు సంబంధం లేదని, లైన్ మార్పులకు తాము ఏ విధమైన అనుమతులు ఇవ్వలేదని లేఖలో తెలిపారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాల్సిన ఎన్‌హెచ్ అధికారులు ఈనెల 11న రాధా గ్రూప్ సంస్థకు లేఖ రాశారు. 25 రోజుల పాటు విద్యుత్ నిలుపుదల చేయటానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. ఓపక్క మూలనపడిన పవర్ ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి అన్నమాటే లేదు. ఆ లైన్‌లోకి విద్యుత్తే రానప్పుడు 25 రోజులు నిలుపుదల చేయాల్సిందిగా ఎన్‌హెచ్ అధికారులు లేఖ రాయటం విమర్శలకు తావిస్తోంది. ఇదంతా ఓ ఎత్తయితే.. మిగతా 6లో..

ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తికి మహోన్నత సేవా పతకం

విజయవాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ డీసీపీ ఎం.కృష్ణమూర్తినాయుడు మహోన్నత సేవా పతకానికి ఎంపికయ్యారు. ఉగాదిని పురస్కరించుకుని ప్రభుత్వం పురస్కారాలను ప్రకటించింది. ఐటీ కోర్ టీం మహిళా ఎస్ఐ కేవీడీ మల్లేశ్వరి ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు. స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ కె.రామకృష్ణంరాజు, సీసీఎస్ ఎస్ఐ కె.నాగేశ్వరరావు, ఏఆర్ఎస్ఐ ఎస్.శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ వైఎస్ మహంకాళి, సైబర్ క్రైం ఏఎస్ఐ వి.వెంకటేశ్వరరావు, నున్న హెచ్‌సీ డి.దుర్గాప్రసాద్ వరంరాజు, పీసీఆర్ హెచ్‌సీ బి.నాగేంద్రసింగ్, స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన బి.సత్యనారాయణ, గవర్నరుపేట హెచ్‌సీ సోమయ్య, స్పెషల్ బ్రాంచ్ హెచ్‌సీ వై.రమేశ్, సిటీ సెక్యూరిటీ వింగ్ హెచ్‌సీ వి.బాలరామమూర్తి, స్పెషల్ బ్రాంచ్ హెచ్‌సీ ఎం.రాజు, పటమట హెచ్‌సీ ఎం.వీరయ్య సేవా పతకాలకు ఎంపికయ్యారు.

చెల్లు చీటీ..!

- వైద్యుల సూచనలు లేకుండా మందుల విక్రయం
- ఆపరేషన్ గరుడతో వెలుగులోకి వచ్చిన వ్యవహారాలు 6లో
- అవనిగడ్డలో 'భార్గవ్'పై కేసు నమోదు

స్వయం కృతాపరాధాలు

స్వయం సహాయక సంఘాల్లో అవినీతి బాగోతాలు



- ఆర్పీ, సీఎల్ఆర్పీ, సీవో, ఎస్‌డబ్ల్యూల అక్రమాలు
- పొదుపు సంఘాల్లో రుణాలిప్పించినందుకు కమీషన్లు
- రూ.5 వేల నుంచి రూ.75 వేల వరకు వసూళ్లు
- ఒక సభ్యురాలికి రెండు, మూడు గ్రూపుల్లో సభ్యత్వాలు
- తద్వారా రుణాలు పొంది ఎవరికి వారు వాటాలు
- జక్కంపూడి బాధితులు రోడ్డెక్కడంతో వెలుగులోకి..

స్వయం సహాయక సంఘాల్లో నకిలీ లీలలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. నిబంధనలను ఉల్లంఘించి రిసోర్స్ పర్సన్లు, క్లస్టర్ లెవెల్ రిసోర్స్ పర్సన్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీవో), సోషల్ వర్కర్లు చక్కబెడుతున్న అవినీతి వ్యవహారాలతో గ్రూపుల్లో వివాదాలు జరుగుతున్నాయి. నకిలీ సభ్యులను గ్రూపుల్లోకి తీసుకొచ్చి, తద్వారా వచ్చిన రుణాలను కాజేస్తున్నారు. కొన్నేళ్లుగా జరుగుతున్న ఈ వ్యవహారాలుపై కొంతమంది సభ్యులు రోడ్డెక్కడంతో ఒక్కసారిగా బయటపడ్డాయి.

(కార్పొరేషన్, ఆంధ్రజ్యోతి) : నగరంలో మొత్తం 15 వేల స్వయం సహాయక సంఘాలున్నాయి. ఇవన్నీ కార్పొరేషన్‌లో ఉండే అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగ పరిధిలో ఉంటాయి. స్వయం సహాయ సంఘాలను ఏర్పాటు చేయడం, వాటికి బ్యాంకు రుణాలు ఇప్పించడం, అందులో ఉండే సభ్యులకు సంక్షేమ పథకాలు అమలు చేయించడం వంటి బాధ్యతలను రిసోర్స్ పర్సన్లు, సీఎల్ఆర్పీలు చూస్తారు. ప్రతి 50 సంఘాలకు ఒక రిసోర్స్ పర్సన్ ఉంటారు. ఈ ఆర్పీల పైన డివిజన్ స్థాయిలో క్లస్టర్ లెవెల్ రిసోర్స్ పర్సన్లు ఉంటారు. వారిపైన కమ్యూనిటీ ఆర్గనైజర్లు, సోషల్ వర్కర్లు ఉంటారు.

కమీషన్లు ఇవ్వకపోతే అంతే..

సోషల్ వర్కర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, క్లస్టర్ లెవెల్ రిసోర్స్ పర్సన్లు, డివిజన్లలో పనిచేసే రిసోర్స్ పర్సన్లు హద్దులు దాటి వ్యవహరిస్తున్నారు. వారు అడిగిన కమీషన్లు ఇచ్చిన వారి రుణాలను ప్రోత్సహిస్తున్నారు. కమీషన్లు ఇవ్వబోమని చెప్పిన సంఘాలకు చుక్కలు చూపిస్తున్నారు. ముఖ్యంగా రిసోర్స్ పర్సన్, సీఎల్ఆర్పీలు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు చేస్తున్న బాగోతాలు శ్రుతిమించుతున్నాయి. బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. వారు కూడా సదరు సిబ్బందిని వెనకేసుకు రావడంతో డ్వాక్రా గ్రూపుల పర్యవేక్షణ బాధ్యత నిర్వహించే నాలుగు స్థాయిల సిబ్బంది విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారు.

డ్వాక్రా సంఘాల నుంచి కమీషన్లు

మెప్మా నిబంధనల ప్రకారం ఒక స్వయం సహాయక సంఘం ఏర్పడ్డాక ఆరు నెలల పాటు బ్యాంకులో పొదుపు ఖాతాను నిర్వహించాలి. ఆ తర్వాత ఆ పొదుపును బట్టి బ్యాంకు రుణం మంజూరు చేస్తుంది. సభ్యులను బ్యాంకులకు తీసుకెళ్లి రుణాలు ఇప్పించే బాధ్యతను రిసోర్స్‌పర్సన్, సీఎల్ఆర్పీలు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు నిర్వహిస్తారు. ఈ విధంగా కొన్ని గ్రూపులు రూ.లక్ష, కొన్ని గ్రూపులు రూ.5 లక్షలు, కొన్ని గ్రూపులు రూ.10 లక్షలు, రూ.20 లక్షల రుణాలను తీసుకుంటాయి. లక్ష రూపాయల రుణం తీసుకున్న గ్రూపు నుంచి రిసోర్స్ పర్సన్, సీఎల్ఆర్పీ, సీవోలు రూ.5 వేల నుంచి రూ.10 వేల కమీషన్‌ను వసూలు చేస్తున్నారు. రుణ మొత్తం పెరిగేకొద్దీ కమీషన్ కూడా పెరుగుతుంది. రూ.20 లక్షల రుణాలు తీసుకునే మిగతా 6లో..

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 06-18 (శనివారం సాయంత్రం)

సహర్ : 04-57 (ఆదివారం ఉదయం)

విజ్ఞాన లోకం

- అంతరిక్ష అద్భుతాలతో గోరా టెక్నో హబ్ 8లో
- ఆకట్టుకుంటున్న రోబో గైడ్, అంతరిక్షశాల, చంద్రయాన్-3, ఆర్యభట్ శాటిలైట్, సర్వే డ్రోన్ నమూనాలు

ఇఫ్తార్ విందు



టీడీపీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా ఆధ్వర్యంలో గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని. చిత్రంలో నాయకులు నెట్టెం రఘురాం, గద్దె రామ్మోహన్, వసంత కృష్ణప్రసాద్, నాగుల్‌మీరా, బుద్దా వెంకన్న తదితరులు ఉన్నారు. 6లో

సమగ్రాభివృద్ధికి సవాల్

విజయవాడ పార్లమెంట్‌ను అభివృద్ధి చేసి చూపిస్తా..

- నగర సుందరీకరణ, అభివృద్ధికి ప్రణాళికలు
- మెట్రోరైల్ అడుగులు ముందుకు.. సర్వే మొదలు
- ఐజీఎంసీ స్టేడియం అభివృద్ధి.. త్వరలో మరిన్ని స్టేడియాలు
- ఆటోనగర్‌లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట
- నగరంలో డిఫెన్స్ ఇండస్ట్రీస్ ఏర్పాటుకు చర్యలు
- మీడియా మీట్‌లో ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడి 8లో



విజయవాడ రైల్వేస్టేషన్, గూడ్స్ బోగీల్లో సరుకు లోడింగ్

స్థూల ఆదాయంలో విజయవాడ రైల్వే రికార్డు



రైల్వే స్టేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రైల్వే డివిజన్ సరుకు రవాణాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.5,638 కోట్ల రికార్డు ఆదాయంతో అత్యుత్తమ పనితీరును కనబరిచింది. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 11 రోజులు ఉండగానే ఈ రికార్డు నెలకొల్పింది. సరుకు రవాణాలో రూ.4,098.21కోట్ల ఆదాయం ఆర్జించింది. 2023లో రూ.5,625 కోట్లు, 2024లో రూ.4,062 కోట్లు సాధించింది. ముఖ్యంగా డివిజన్ ఆదాయంలో 72.6 శాతం సరుకు రవాణా ద్వారా, 23.8 శాతం ప్రయాణికుల ద్వారా సమకూరింది. సరుకు రవాణాలో రూ.4,098 కోట్లు, ప్రయాణికుల ద్వారా రూ.1,342 కోట్లు, తనిఖీల ద్వారా రూ.109 కోట్లు, ఇతరత్రా ఆదాయాల ద్వారా రూ.89 కోట్లు సాధించింది. కృష్ణపట్నం ఓడరేవు రూ.2,078 కోట్లు, కాకినాడ పోర్టు రూ.1,110 కోట్లు సాధించాయి. విజయవాడ డీఆర్‌ఎం నరేంద్ర ఎ పాటిల్, సీనియర్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబులు మాట్లాడుతూ, ఈ రికార్డు ఆదాయం డివిజన్ సామర్థ్యాన్ని తెలియజేస్తుందని తెలిపారు. ఇది ఎంతో గర్వంగా ఉందని తెలిపారు. మరోవైపు కొత్త రైల్వే లైన్లను ప్రారంభించటంతో మరిన్ని విజయాలు సాధించేందుకు దోహదం చేస్తుందని తెలిపారు.



ఎన్టీటీపీఎస్ సందర్శనలో సంగ్రా, ఇతర అధికారులు

ఎన్టీటీపీఎస్‌ను సందర్శించిన డిఫెన్స్ అధికారులు

ఇబ్రహీంపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీటీపీఎస్‌ను నేషనల్ డిఫెన్స్ అధికారులు, రిటైర్డ్ ఆర్మీ మేజర్ జనరల్ సీపీ సంగ్రా తన బృందంతో కలిసి శుక్రవారం సందర్శించారు. ప్లాంట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి భద్రతలో తీసుకుంటున్న జాగ్రత్తలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్లాంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మిలటరీ అధికారులు మంజీత్‌సింగ్, రాజపుత్, మమతా వర్మ, సందీప్‌కుమార్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని అనుమతులు తీసుకున్నాం..

- తిరుపతమ్మ తిరునాళ్లలో అపశ్రుతిపై ఈవో వివరణ

జగ్గయ్యపేటరూరల్ 21 (ఆంధ్రజ్యోతి) : పెనుగంచిప్రోలు తిరుపతమ్మ తిరునాళ్లలో ఎగ్జిబిషన్ నిర్వహణలో అపశ్రుతిపై ఆలయ అధికారులు వివరణ ఇచ్చారు. శుక్రవారం ఆలయ ఈవో మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం లాగానే ఆర్డీవో సమక్షంలో సమీక్ష జరిపిన మేరకు ఎగ్జిబిషన్‌కు అనుమతి ఇచ్చామని చెప్పారు. దేవదాయ, విద్యుత్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ శాఖలు అనుమతి ఇచ్చాయని, ఫిట్‌నెస్ పరిశీలించాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు అందుబాటులోకి రాలేదని చెప్పారు. ఆలస్యం అవుతున్నందున జరిగే ప్రతి పరిణామానికి పాటదారుడిపై బాధ్యత పెట్టి అనుమతి ఇచ్చామని, ఘటనపై ఆలయానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. ఘటన జరిగిన వెంటనే పాటదారుడైన కాకాని శేషగిరిరావుపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఎస్సీ గురుకుల ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

- ఏప్రిల్ 13న నిర్వహణ

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షను వాయిదా వేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి నిర్వహించనున్న ప్రవేశపరీక్ష అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్టు ఏపీ ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి ప్రసన్న వెంకటేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 6న జరగాల్సిన ప్రవేశపరీక్షను ఏప్రిల్ 13న నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ మార్పును విద్యార్థులు గమనించాలని కోరారు.

ఏప్రిల్ 2న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు: ఫ్యాప్టో

ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, కొత్త పీఆర్సీ సాధన కోసం ఏప్రిల్ 2న అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్టు ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్, ఎస్.చిరంజీవి ఓ ప్రకటనలో తెలిపారు. అప్పటికీ సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రస్థాయి పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దుచేసి, పాత పెన్షన్ విధానం అమలుచేయాలని కోరారు. 11వ పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు, సరెండర్ లీవు బకాయిలు వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలల్లో ఇంగ్లిష్‌తో పాటు తెలుగు మీడియంను కూడా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

జూన్ 16 నుంచి లెక్చరర్ పోస్టులకు పరీక్షలు

గత ప్రభుత్వంలో జారీ చేసిన నాలుగు నోటిఫికేషన్లకు రాత పరీక్షల తేదీలను ఏపీపీఎస్సీ ప్రకటించింది. జూన్ 16 నుంచి 26 వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపింది. పాలిటెక్నిక్ కాలేజీల్లో లెక్చరర్ పోస్టులు, జూనియర్ కాలేజీల్లో జూనియర్ లెక్చరర్ పోస్టులు, డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్ల పోస్టులను ఈ నోటిఫికేషన్లలో భర్తీ చేయనున్నారు. టీడీడీ డిగ్రీ కాలేజీలు, ఓరియెంటల్ కాలేజీల్లో లెక్చరర్ పోస్టుల భర్తీకి గతంలో టీటీడీ జారీచేసిన లెక్చరర్ పోస్టులకు కూడా రాత పరీక్షలు నిర్వహించనుంది.

గ్రూప్-1 మెయిన్స్ ప్రాధాన్యాలకు అవకాశం

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు ఎంపికైన అభ్యర్థులు ప్రాధాన్యాలను ఎంపిక చేసుకునేందుకు ఏపీపీఎస్సీ అవకాశం కల్పించింది. గతంలో ప్రాధాన్యాలను ఎంపిక చేసుకోని అభ్యర్థులు ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ఎంపిక చేసుకోవచ్చని ఓ ప్రకటనలో తెలిపింది. పరీక్ష మీడియం, పోస్టు ప్రాధాన్యత, జోనల్ ప్రాధాన్యత, పరీక్షా కేంద్రం అంశాల్లో అభ్యర్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలని సూచించింది.

25 నుంచి ఆందోళనలు: కౌలు రైతుల సంఘం

నూతన కౌలు రైతుల చట్టాన్ని వెంటనే తీసుకురావాలని కోరుతూ ఈ నెల 25 నుంచి 31 వరకు రైతు సేవా కేంద్రాల వద్ద ఆందోళనలు నిర్వహించనున్నట్టు రాష్ట్ర కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య శుక్రవారం తెలిపారు. కూటమి అధికారంలోకి రాగానే భూ యజమాని ప్రమేయం లేకుండా కౌలు రైతులను నేరుగా గుర్తించి, సులభంగా కౌలు గుర్తింపు కార్డులు జారీ చేసేలా నూతన కౌలుదారు చట్టం తెస్తామని గత ఎన్నికల సమయంలో కూటమి నేతలు చెప్పారని గుర్తు చేశారు. కానీ ఇంతవరకు నూతన కౌలుదారు చట్టం చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తున్నందున రైతుసేవా కేంద్రాల అధికారుల ద్వారా వ్యవసాయశాఖ మంత్రికి వినతి పత్రాలు పంపనున్నట్టు ఆయన తెలిపారు.

చెల్లు చీటీ!

- వైద్యుల సూచనలు లేకుండా మందుల విక్రయం
- అవకాశంగా మార్చుకుంటున్న 'కిక్కర్స్'
- ఆపరేషన్ గరుడతో వెలుగులోకి తెరచాటు వ్యవహారాలు
- అవనిగడ్డలో 'భార్గవ్'పై కేసు నమోదు
- డ్రగ్ లెక్కల్లో వ్యత్యాసాలను గుర్తించిన తనిఖీ బృందాలు



గుణదల సెంటర్‌లోని మెడికల్ షాపులో ఈగల్ బృందం తనిఖీలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) కనీస ధరకు సమానంగా లాభం వచ్చే వ్యాపారం ఏదైనా ఉందంటే చాలా మంది మందుల షాపు పేరు చెబుతారు.. అలా వస్తున్న ఆదాయంతో సంతృప్తి చెందడానికి వ్యాపారులు ఇష్టపడడం లేదు. అదనంగా ఇంకా ఆర్జించడానికి అడ్డదారులు తొక్కుతున్నారు. ఇప్పుడు విజయవాడ కేంద్రంగా మెడికల్ మాఫియా నడుస్తోంది. వైద్యుల రాసిచ్చిన మందులను మాత్రమే విక్రయించాలని స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ వాటికి తిలోదకాలు ఇచ్చేస్తున్నారు. మత్తును కలిగించే మందులను వైద్యులురాసే చీటీలతో సంబంధం లేకుండా యువతకు విక్రయిస్తున్నారు. ఈగల్ విభాగ ఐజీ రవికృష్ణ ఆధ్వర్యంలో ఔషధ నియంత్రణ మండలి, విజిలెన్స్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఉమ్మడి కృష్ణా జిల్లాలో మందుల షాపుల్లో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో తొమ్మిది షాపులు, కృష్ణాజిల్లాలో ఒక షాపులో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో షాపుల నిర్వహణలో అనేక లొసుగులు ఉన్నట్టు గుర్తించారు. అవనిగడ్డలో ఉన్న భార్గవ్ మెడికల్ షాపు యజమానిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. మానసిక పరిస్థితి బాగోని రోగులకు నిద్ర పట్టడం కోసం ఇచ్చే ఎన్ఆర్ఎక్స్ మందులు లెక్కకు మించి ఉన్నట్టు గమనించారు. షాపులో ఉన్న సరుకుల నిల్వలను తెలియజేసే పుస్తకాల్లో ఉన్న వివరాలను బట్టి ఒక్కో రకం మందు సంఖ్యను లెక్కించారు. ఇందులో ఎన్ఆర్ఎక్స్ మందులు పుస్తకంలో ఉన్న సంఖ్య కంటే అదనంగా ఉన్నట్టు గుర్తించారు. దీనితో భార్గవ్ మందుల షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. విజయవాడ గుణదలలో నిర్వహించిన తనిఖీలో ఈగల్ టీం ఐజీ కె.రవికృష్ణ పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి..

వన్‌టౌన్, గవర్నరుపేటలో మందుల హోల్‌సేల్ షాపులు, డీలర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాల్లో ఉన్న మందుల షాపులకు విజయవాడ నుంచే సరఫరా జరుగుతోంది. మందుల్లో సుమారుగా 41 రకాల సైకోట్రోఫిక్ మందులు ఉన్నాయి. వాటిలో అల్బెండాజోల్, ట్రమడాల్, అల్‌ప్రాజోల్ మందులను యువతకు రహస్యంగా విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తనిఖీ బృందాలు ఇదే విషయాన్ని వెల్లడించాయి. వైసీపీ ఐదేళ్ల కాలంలో జిల్లాను గంజాయి గడగడలాడించింది. ఎక్కడ చూసినా ఒక నిత్యావసర వస్తువులా గంజాయి లభించేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గంజాయి వాసన తగ్గింది. మన్యం నుంచి మాయ'దారి'లో తీసుకువచ్చిన గంజాయిని నగరంలోకి ప్రవేశించడానికి ముందే పట్టుకుంటున్నారు. దీనితో ఒకప్పుడు చాలా చౌకగా లభించిన గంజాయి ధర ఘాటెక్కింది. మరోపక్క పోలీసులు గంజాయి చరిత్ర ఉన్న వాళ్లందరిని కటకటాల వెనక్కి పంపుతున్నారు. ఈ పరిస్థితుల్లో మత్తుకు బానిసలైన యువత సైకోట్రోఫిక్ మందులు రహస్యంగా కొనుగోలు చేసి ఉపయోగిస్తున్నట్టు ఈగల్‌కు సమాచారం అందింది. దీనితో దాడులకు దిగింది. విజయవాడ కేంద్రంగా ఉన్న డీలర్లు కొంతమంది ఎలాంటి పన్నులు చెల్లించకుండా ఇతర రాష్ట్రాలనుంచి ఈ మందులను రప్పిస్తున్నట్టు తెలిసింది. మరికొంతమంది డీలర్లు ఇక్కడి నుంచే తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు సైకోట్రోఫిక్ మందులను పంపుతున్నారు. తమిళనాడు ఔషధ నియంత్రణ మండలి అధికారులు కొద్దినెలల క్రితం గవర్నరుపేటలో ఉన్న హోల్‌సేల్ షాపులో సోదాలు నిర్వహించడమే దీనికి నిదర్శనం. విజయవాడ గొల్లపూడిలో ఉన్న గోపాల కృష్ణ మెడికల్‌షాపులో వైద్యుల చీటీలతో సంబంధం లేకుండా మందులను విక్రయించినట్టు గుర్తించారు. షాపుయజమాని ఇంట్లోనూ సోదాలు చేశారని తెలిసింది.

ఉసురు తీసిన ఈత సరదా!

- నీట మునిగి విద్యార్థి మృతి



ఇబ్రహీంపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జి.కొండూరు మండలం కవులూరు గ్రామానికి చెందిన బలుసుపాటి కుమార్ (14) కవులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. స్నేహితుడు చావల రేవంత్‌తో కలిసి శుక్రవారం బుడమేరు డైవర్షన్ ఛానెల్ వద్ద ఈతకు దిగాడు. గుంత లోతుగా ఉండటంతో దానిలో మునిగిపోయాడు. స్నేహితుడు కేకలు వేయడంతో స్థానికులు బాలుడిని రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేదు. అప్పటికే చనిపోవడంతో గుంతలో చిక్కుకుపోయిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాలుడి మృతి గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బుడమేరు డైవర్షన్ ఛానెల్‌లో ఇటీవల గండి పడిన చోట ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారి ప్రాణాలు హరిస్తున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- ఈగల్ టీమ్ ఐజీ రవికృష్ణ



గుణదల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : డీజీపీ ఆదేశాల మేరకు ఈగల్ టీమ్ శుక్రవారం 'ఆపరేషన్ గరుడ' పేరుతో మెడికల్ షాపులు, ఏజన్సీలలో ఆకస్మిక దాడులు నిర్వహించినట్టు ఐజీ రవికృష్ణ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 100 ఈగల్ బృందాలు ఏకకాలంలో ఆకస్మిక దాడులు చేయడం జరిగిందని, దానిలో భాగంగా గుణదల సెంటర్ మెడికల్ షాపులో ఆకస్మిక తనిఖీ చేసినట్టు చెప్పారు. ఔషధాల దుర్వినియోగంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. యువత మత్తుకు బానిసలవుతున్నారని, గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై జీవితాలను బుగ్గి చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని అరికట్టేందుకుగాను మెడికల్ షాపుల్లో నిషేధిత మందుల విక్రయాలు, డాక్టర్ రాసిచ్చిన స్లిప్ లేకుండా మందుల విక్రయాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా అధికారులు షాపులో మందులను క్షుణ్ణంగా పరిశీలించారు. అల్ప్రాజోలం అధిక మొత్తంలో స్టాకు పెట్టినా చర్యలు తప్పవన్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రగ్‌కంట్రోల్, ఈగల్‌టీమ్, పోలీసుశాఖ సంయుక్తంగా దాడులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ ఎంబీఆర్ ప్రసాద్, ఏడీ అనిల్‌కుమార్ స్పెషల్ ఫోర్స్ పోలీసులు దాడుల్లో పాల్గొన్నారు.

పంట కుంటల ప్రాధాన్యాన్ని వివరించండి

- వర్షాకాలం నాటికి నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలి : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



వీడియో కాన్ఫరెన్స్‌లోమాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా పొలాల్లో సమీకృత నీటికుంటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి వర్షాకాలం నాటికి కుంటలు ఏర్పాటు చేసుకొనేలా ప్రోత్సహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఉపాధి పథకం అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. సమావేశానికి కలెక్టరేట్ నుంచి లక్ష్మీశ, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఉపాధి హామీ పథకాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. వేసవిలో ఉపాధి హామీ వేతనదారులకు తాగునీరు, ఇతర సౌకర్యాలపై సూచనలు చేశారు. రోజువారీ వేతనం రూ.300 వచ్చేలా చూడటంతో పాటు ఉపాధి పథకం అనుసంధానంతో చేపడుతున్న సమీకృత పంటకుంటలు, వివిధ పనులపైనా మార్గనిర్దేశనం చేశారు. అనంతరం కలెక్టర్ జిల్లా నీటి యాజమాన్యసంస్థ, పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడుతూ, నీటికుంటల ఏర్పాటుతో పంటకు కావాల్సిన నీటికి ఇబ్బందిలేకుండా ఉండటంతో పాటు నేల కోతకు గురికాకుండా, భూగర్భ జలాలు పెరిగేందుకు దోహదం చేస్తాయన్నారు. పంటకుంటల్లో చేపలు పెంపకం, గట్లపై కూరగాయల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని రైతులకు వివరించాలన్నారు. జిల్లాలో 289 గ్రామ పంచాయతీల పరిధిలో 2,713 కుంటలు మంజూరయ్యాయని యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించి పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ ఎ.రాము, డీపీవో పి.లావణ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఉగాది పచ్చడి పంపండి

- వలంటీర్లకు గోవిందరాజులు పిలుపు

గాంధీనగర్ : ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీఎం చంద్రబాబుకు ఉగాది పచ్చడి పంపించాలని వలంటీర్ల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి లంకా గోవిందరాజులు వలంటీర్లకు పిలుపునిచ్చారు. పచ్చడి తిని గతంలో ఆయన ఇచ్చిన హామీని తీపి కబురుగా మార్చి తెలియజేయాలని కోరారు. స్థానిక దాసరిభవన్‌లో వలంటీర్ సంఘం సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్డీఏ కూటమి అధికారం చేపడితే వలంటీర్లకు తీపికబురు చెబుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తానని గత ఎన్నికల సందర్భంగా చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గంటా మమత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో షైనీ, నరేష్, కల్యాణ్, శివపార్వతీ, స్వప్న, దమ్ము రమేష్ తదితర నేతలు పాల్గొన్నారు.

కౌలు రైతులను మోసం చేసిన ప్రభుత్వం

- ఏపీ కౌలు రైతు సంఘం

గవర్నర్‌పేట : పాత కౌలు చట్టాన్ని రద్దు చేస్తామని, కౌలు రైతులకు మేలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి గద్దెనెక్కిన కూటమి పార్టీలు పాత చట్టం రద్దు చేయకుండా, కొత్త చట్టం తీసుకురాకుండా నమ్మించి మోసం చేశాయని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబులు శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కొత్త చట్టం తీసుకువస్తామని కౌలు రైతులను రాష్ట్ర ప్రభుత్వ నమ్మించిందని, బడ్జెట్ సమావేశాలు ముగిసినా చట్టం మాత్రం రాలేదని అన్నారు. నూతన కౌలు చట్టం సాధించుకునేందుకు కౌలు రైతులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కూడా కాలయాపన మాని కౌలు రైతుల కోసం చట్టం తీసుకురావడం వ్యవసాయ రంగం అభివృద్ధికి చాలా అవసరమని పేర్కొన్నారు.

విజయవాడలో అత్యాధునిక హజ్ హౌస్

- ఇఫ్తార్ విందులో ఎంపీ కేశినేని శివనాథ్ హామీ



ఇఫ్తార్ విందులో ఎంపీ కేశినేని శివనాథ్, నెట్టెం, వసంత, నాగుల్‌మీరా, ఎంఎస్ బేగ్ తదితులు

వన్‌టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో అత్యాధునిక హజ్ హౌస్ నిర్మిస్తామని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) హామీ ఇచ్చారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం గురునానక్‌కాలనీలోని పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం జరిగింది. ముస్లిం మత పెద్దలతో కలిసి ఎంపీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు, ముస్లిం సోదరులతో కలిసి అల్పాహారం ఆరగించారు. అనంతరం విందు కార్యక్రమంలో పాల్గొని వడ్డించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, టీడీపీ ముస్లిం సమాజానికి అండగా ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా ఇమామ్, మౌజనులకు రూ.10వేలు, రూ.5వేలు గౌరవవేతనం అందిస్తున్నారన్నారు.అల్లా దయ వల్ల దేశం, రాష్ట్రం బాగుందన్నారు. విజయవాడ నగర అభివృద్ధిలో ముస్లింల పాత్ర చాలా ఉందని పేర్కొన్నారు. వారికి ఏ సమస్య వచ్చినా అండగా ఉండి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నప్పుడు హైదరాబాద్‌లో హజ్ హౌస్ నిర్మాణం జరిగిందని, అంతకంటే అత్యాధునిక హజ్‌హౌస్‌ను నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో ఉర్దూ కాలేజీ టీడీపీ ప్రభుత్వంలోనే ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. ఆయన ముస్లిం సోదరులకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), తంగిరాల సౌమ్య, వసంత కృష్ణప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, అధికార ప్రతినిధి నాగుల్ మీరా, కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

జామ్‌జామ్‌గా జంబో..!

(5వ పేజీ తరువాయి)

750 ఎకరాలను ఏఏఐకు ఇవ్వటంతో అదనంగా రన్‌వేను విస్తరించటానికి అవకాశం ఏర్పడింది. భూములను స్వాధీనం చేసుకున్న తర్వాత ఏఏఐ అధికారులు మరో 1,075 మీటర్ల మేర రన్‌వేను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. 2018 మధ్యకాలంలో నూతన రన్‌వే పనులు శరవేగంగా జరిగాయి. ఫలితంగా మొత్తంగా 3,360 మీటర్ల రన్‌వే ఏర్పడింది. అంటే 11,023.62 చదరపు గజాల మేర విస్తరణ జరిగింది. రాష్ట్రంలోనే అతిపెద్ద రన్‌వే కలిగిన విమానాశ్రయంగా విజయవాడ నిలిచింది. ఈక్రమంలో బోయింగ్-747, బోయింగ్-777, బోయింగ్-787 విమానాలు కూడా ల్యాండ్ కావటానికి వీలు కలిగింది.

రోజూ 8 భారీ విమానాల రాకపోకలు

విమానాశ్రయంలో ఒకేసారి 15 విమానాలను పార్కింగ్ చేసేలా పార్కింగ్ బేలను సిద్ధం చేశారు. ప్రస్తుతం శాశ్వత అవసరాల ప్రాతిపదికన దేశీయ, అంతర్జాతీయ నూతన టెర్మినల్ బిల్డింగ్ (ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్)ను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. దీని పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ టెర్మినల్‌కు అనుసంధానంగా ఆప్రాన్ నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. ఈ ఆప్రాన్‌లో ఒకేసారి ఆరు భారీ విమానాలను నిలిపే అవకాశం ఉంది. దీనిని ఇంకా వినియోగంలోకి తీసుకురాలేదు. భారీ విమానాల సంఖ్య పెరిగినా ఇబ్బంది లేకుండా ఈ నూతన ఆప్రాన్‌ను సిద్ధం చేస్తున్నారు.

స్వయం కృతాపరాధాలు

(5వ పేజీ తరువాయి)

గ్రూపుల నుంచి రూ.50 వేల నుంచి రూ.75 వేలు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వాటాలు అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగంలో రిసోర్స్ పర్సన్ల దగ్గర నుంచి పైస్థాయి వరకు వెళ్తున్నట్టు సంఘాల సభ్యులు బహిరంగంగానే చెబుతున్నారు.

సభ్యులు తగ్గితే పండగే..

స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు మెప్మా కొన్ని నిబంధనలు రూపొందించింది. ఒక గ్రూపులో 10 మంది మహిళలే సభ్యులుగా ఉండాలి. అందులో నుంచి సంఘానికి అధ్యక్షురాలిని, కార్యదర్శిని ఎన్నుకుంటారు. దీనికి సంబంధించి సమావేశాలు నిర్వహించుకుని ఎప్పటికప్పుడు తీర్మానాలను ఓ పుస్తకంలో రాసుకోవాలి. సమావేశాలు రిసోర్స్ పర్సన్, సీఎల్ఆర్పీలు, సీవోల సమక్షంలో జరుగుతాయి. ఒక గ్రూపులో సభ్యురాలిగా ఉన్న మహిళ మరో గ్రూపులో సభ్యురాలిగా చేరకూడదు. కానీ, రిసోర్స్ పర్సన్లు, సీఎల్ఆర్పీలు, సీవోలు, ఎస్‌డబ్ల్యూ ఈ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ముఖ్యంగా ఒక గ్రూపుల్లో ఉన్న మహిళలకు వేరే గ్రూపుల్లో సభ్యత్వాలు ఇప్పిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. సభ్యులెవరైనా వివాహం చేసుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయినా, చనిపోయినా, కుటుంబాలు వలస వెళ్లిపోయినా కొన్ని గ్రూపుల్లో సభ్యులు తగ్గుతారు. ఈ మూడింటినీ ఆర్పీలు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు, క్లస్టర్ పర్సన్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఖాళీ అయిన స్థానాల్లోకి వేరే గ్రూపుల్లో ఉన్న మహిళలను తీసుకొచ్చి పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక సంఘానికి వచ్చిన రుణాన్ని సభ్యులంతా సమానంగా పంచుకుంటారు. ఇందులో రిసోర్స్ పర్సన్ చేర్చిన సభ్యులకు వచ్చిన రుణ వాటాను ఆ రిసోర్స్ పర్సన్లే తీసుకుంటున్నారు. నాలుగు భాగాలుగా చేసుకుని పంచుకుంటున్నారు. జక్కంపూడి కాలనీకి చెందిన ఓ మహిళను.. గ్రూపు రిసోర్స్‌పర్సన్, సీవో సుమారు మూడు నాలుగు గ్రూపుల్లో సభ్యురాలుగా చేర్పించింది. ఆమెను వివిధ బ్యాంకులకు తీసుకెళ్లి రుణాలు ఇప్పించింది. ఈ రుణాలను రిసోర్స్ పర్సన్, సీవోనే తీసుకున్నారు. ఇందుకు సభ్యురాలికి రూ.10 వేలు ఇచ్చినట్టు ప్రాజెక్టు అధికారికి ఫిర్యాదు అందింది. అయితే, గ్రూపుల్లో ఇటువంటివి సాధారణమేనని ప్రాజెక్టు అధికారులు కూడా పట్టించుకోవట్లేదు. ఇప్పటివరకు ఆ రిసోర్స్ పర్సన్, సీవోలను విచారణ చేయలేదు. దీంతో బాధితురాలు మరికొంతమందితో కలిసి ఆందోళన చేసింది. ఈ తరహా చిత్రాలు నగరంలోని అన్ని డివిజన్లలో జరుగుతుండగా, జక్కంపూడి కాలనీ బాధితులు పోలీసులను ఆశ్రయించారని సమాచారం.

మరో షాక్..!

(5వ పేజీ తరువాయి)

అక్టోబరు వరకు తాము ఎలాంటి అనుమతులు ఇవ్వడం కుదరదని రాధా గ్రూప్ సంస్థ.. ఎన్‌హెచ్‌కు బదులివ్వడం కొసమెరుపు. అసలు విద్యుత్ ఉత్పత్తే చేయని రాధా గ్రూప్.. తమది కాని లైన్‌కు అక్టోబరు వరకు కుదరదని చెప్పడం విడ్డూరం. కొసమెరుపు ఏమిటంటే.. విద్యుదుత్పత్తి ఆపాలంటూ తమపై రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఒత్తిడి తెస్తున్నారంటూ రాధా గ్రూప్ న్యాయస్థానం మెట్లెక్కడం.

కేంద్ర ప్రభుత్వంపై రూ.250 కోట్ల భారం

ఎన్‌హెచ్ అధికారుల లేఖ వల్ల భవిష్యత్తులో రూ.250 కోట్ల ప్రజాధనాన్ని చెల్లించే పరిస్థితి ఏర్పడింది. ఈ భారం కేంద్ర ప్రభుత్వంపై పడే అవకాశం ఉంది. జక్కంపూడి వీయూపీ వద్ద ల్యాంకో లైన్ అలైన్‌మెంట్ మార్పునకు 25 రోజుల పాటు విద్యుత్ అంతరాయానికి గడువు కోరడమంటే.. అన్ని రోజులకు రూ.250 కోట్లు చెల్లించాలి. ల్యాంకో పవర్ ప్రాజెక్టు పనిచేస్తున్న దశలో 2022, జూలై 9న ఎన్‌హెచ్ కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 32 గంటలకు జీఎస్టీతో కలిపి రూ.13 కోట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. దీని ప్రకారం గంటకు రూ.43 లక్షలు చెల్లించాలి. 24 గంటలకు రూ.10.50 కోట్లు చెల్లించాలి. అంటే.. 25 రోజులకు రూ.250 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది.

ఒప్పందం ల్యాంకోతో.. చెల్లింపులు రాధాతో..

ల్యాంకో పవర్ ప్రాజెక్టు పనిచేస్తున్నపుడు ఆ సంస్థతో ఎన్‌హెచ్ అధికారులు విద్యుత్ అంతరాయ చార్జీలు (డెమరేజెస్ చార్జీలు) చెల్లిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇప్పుడు ల్యాంకో సంస్థ మూతపడింది. విద్యుదుత్పత్తే జరగట్లేదు. పైగా ఈ లైన్‌ను ఆక్షన్‌కు పెట్టారు. ఇలాంటపుడు ఈ లైన్ అలైన్‌మెంట్ మార్చాల్సిన అవసరం ఏంటో అర్థంకాని పరిస్థితి. పైగా డబ్బు చెల్లిస్తామని ఒప్పందం చేసుకోవడం, ల్యాంకోలోని ఓ యూనిట్‌ను స్క్రాప్ కింద కొన్న రాధా సంస్థకు చెల్లింపులు చేసేలా లేఖ రాయటంపై అనుమానాలు కలుగుతున్నాయి.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110,119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

దుర్గమ్మకు నృత్య కళార్చన

ఇంద్రకీలాద్రి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి మహా మండపంలోని కళావేదికపై శుక్రవారం విజయవాడకు చెందిన కళాబృందం అమ్మవారికి నృత్య కళార్చన నిర్వహించారు. గురువు భాగవతుల సౌమ్య ఆధ్వర్యంలో కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. వైష్ణవి భార్గవి, అఖిలాండేశ్వరి, శివస్తుతి, కట్టెదుర వైకుంఠం, తందనాన, రామాయణ శబ్దం, ఇంకా పలు కీర్తనలకు 25 మంది కళాకారులు లయబద్ధంగా కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం అధికారులు కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లను అందజేశారు.

కరెన్సీనగర్ సమస్యలపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు పరిధి 3వ డివిజన్‌లోని కరెన్సీ నగర్‌లోని ప్రధాన సమస్యలన్నింటిని పరిష్కరించి సుందరమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శుక్రవారం కరెన్సీ నగర్ కాలనీలో పర్యటించారు. ఈ పర్యటనలో ఆయన స్థానికులతో మాట్లాడి ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.31లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులకు గద్దె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3వ డివిజన్‌లో అభివృద్ధి చెందాల్సిన ప్రాంతాలు చాలా



కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఉన్నాయన్నారు. అందువల్ల తాను ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెప్పి ఈ డివిజన్‌ను దత్తత తీసుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, టీడీపీ నాయకులు బాయన బాబ్జీ, తాడి బాబూరావు, గద్దె రమేష్, ధనేకుల యలమందరావు, బండి కోమలి, బొప్పన మోహనరావు, పి.పిచ్చిరెడ్డి, కృష్ణప్రసాద్, కార్పొరేషన్ ఈఈ సామ్రాజ్యం, ఏఈ దీక్షిత్ పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు గద్దె పరామర్శ

పటమట: తూర్పు పరిధి 14వ డివిజన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని, బాధితుల ఇళ్లనుఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పరిశీలించారు. బాధితురాలు ప్రశాంతికి రూ.10 వేలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. నర్రా కిషోర్, ముమ్మనేని ప్రసాద్, గరికపాటి బద్రీ, ఎల్లబాబు పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి

పోటీతత్వం అలవర్చుకోవాలి

ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి

గుణదల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): యువత పోటీతత్వం అలవర్చుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. నగరంలోని నలంద కళాశాలలో ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించిన ఎలక్ట్రో 2కే 25 ఈవెంట్‌లో పాల్గొన్న తమ కళాశాల విద్యార్థినీ,విద్యార్థులు 7 విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించే కార్యక్రమం శుక్రవారం కళాశాలలో నిర్వహించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారిని కోరారు.

ఆలిండియా సీనియర్ టెన్నిస్ టోర్నీలో రైల్వే అధికారుల విజయం



రైల్వేస్టేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): భీమవరంలో గురువారం జరిగిన ఆలిండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో గుంటూరు అడిషనల్ రిజిస్ట్రార్, రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్, అమరావతి బెంచ్ కె.రాజేంద్ర ప్రసాద్, విజయవాడ ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ టెక్నీషియన్ సవంత్ కుమార్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. 45 ప్లస్ డబుల్స్ విభాగంలో జరిగిన ఫైనల్‌లో ఖమ్మంనుంచి గంజి వెంకటేశ్వర్లు, పాల్వంచ నుంచి భాస్కరరావు రన్నరప్‌గా నిలిచారు.

డీమార్టులో ఫైర్ సేఫ్టీపై అవగాహన

గాంధీనగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సాంబమూర్తి రోడ్డులోని డీ మార్టులో అగ్నిప్రమాద నిరోధక అవగాహన కార్యక్రమాన్ని వీఎంసీ ఫైర్ అధికారులు శుక్రవారం నిర్వహించారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు సంభవిం చినప్పుడు మంటలను ఏ విధంగా ఆర్పాలి, దీనికి ఎటువంటి పరికరాలు ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్ ఎక్కడెక్కడ అమర్చాలి తదితర వాటిపై అవగాహన కల్పించారు. జిల్లా ఫైర్ అధికారి మాల్యాద్రి, రీజనల్ ఫైర్ అధికారి వెంకటేశ్వరరావు, స్టేషన్ ఫైర్ అధికారి రాజా పాల్గొన్నారు.

సజావుగా పదో తరగతి పరీక్షలు

కర్నాటి రామ్మోహనరావు మున్సిపల్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగుతున్నాయని, పొరపాట్లకు తావులేకుండా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ సూర్యారావుపేటలోని కర్నాటి రామ్మోహనరావు మున్సిపల్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యార్థులు పరీక్ష రాసేందుకు పాఠశాలలో చేసిన



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఏర్పాట్లను పరిశీలించారు. తాగునీటికి, ఇతర వసతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. విద్యుత్ సరఫరాలోనూ ఎలాంటి సమస్యలు లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని, ప్రాథమిక చికిత్సకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ప్రభుత్వ మార్గ దర్శకాలను తప్పకుండా పాటించాలని, భద్రతతో పాటు చెక్‌లిస్టు ప్రకారం అన్ని విషయాల్లోనూ జాగ్రత్తగా వుండాలని అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

లబ్బీపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి 10.30 వరకు స్క్యూబ్రిడ్జి సెక్షన్, స్క్యూబ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ 10ఎంజీడీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. ఫకీరుగూడెం, ప్రగతినగర్, చంద్రమౌళిపురం, టిక్కిల్ రోడ్డు, శ్రీరామ్‌నగర్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, పోస్టాఫీసు రోడ్డు, మెహదీన్ ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

భారతీనగర్: రింగ్‌రోడ్డు సెక్షన్‌పరిధిలో శనివారం ఉదయం 8.00గంటల నుంచి 10.00 గంటల వరకు విద్యుత్ నిలిపివేయుచున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ, సుబ్బారావు కాలనీ, భారతీనగర్ సర్వీస్ రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఆటోనగర్: ఆటోనగర్ సెక్షన్ పరిధిలో శనివారం ఉదయం 9.30 నుంచి 12.30 వరకు న్యూ పోస్టల్ కాలనీ, అచ్చమ్మ వీధి, భాగయ్యబజార్, మరీదు పుల్లారావు వీధి, ఫన్‌టైమ్ క్లబ్ రోడ్డు, పంటకాలవ రోడ్డు, వాసవీ కాలనీ, విజయ భాస్కర్ అపార్ట్‌మెంట్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆటోనగర్ ఏఈ ఏడుకొండలు తెలిపారు.

నిబంధనలు అతిక్రమించిన నాలుగు ఆటోలు సీజ్

నాల్గో ట్రాఫిక్ ఎస్ఐ ఆదినారాయణ

గుణదల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సరైన పత్రాలు లేని నిబంధనలు అతిక్రమించిన నాలుగు ఆటోలు సీజ్ చేసినట్లు నాల్గో ట్రాఫిక్ ఎస్ఐ ఆదినారాయణ తెలిపారు. ఆటోలపై శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు ఎస్ఐ ఆదినారాయణ చెప్పారు. ఆటో నడిపే వ్యక్తికి లైసెన్స్ తప్పనిసరి అని, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వంటి పత్రాలు తప్పని సరిగా ఉండాలన్నారు. తనిఖీ సమయం లో పత్రాలు చూపించకపోతే ఆటోను సీజ్ చేస్తామని తెలిపారు. ఆటోలో డ్రైవర్ సీటు పక్కన ప్యాసింజర్లను ఎక్కించుకున్నా, ఆటోలో సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రామవరప్పాడు వంతెన సెంటర్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నాలుగు ఆటోలు సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.



ఆటోలను సీజ్ చేసిన ట్రాఫిక్ ఎస్ఐ ఆదినారాయణ

కొట్టిరెడ్డి రోడ్డుకు మోక్షమెప్పుడో...?



భారతీనగర్ హైటెన్షన్ రోడ్డు సమీపంలోని విజయలక్ష్మి కాలనీ హోసన్నా గాస్పెల్ సెంటర్ కొట్టిరెడ్డి రోడ్డు రాళ్లు లేచి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈరోడ్డు నిర్మించి ఏళ్లు గడిచిపోవడంతో వాహనాల రాకపోకలకు రాళ్లు లేచి అధ్వానంగా మారాయి. చిన్న పాటి వర్షం కురిసినా రోడ్డుపై నీళ్లు నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం ఈ రోడ్లో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్య తీసుకోవాలని కోరుతున్నారు. - భారతీనగర్, ఆంధ్రజ్యోతి

రోగుల ప్రశంసలతోనే ఒత్తిడి దూరం

ఏపీ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుశీల

గన్నవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రోగులకు చిరునవ్వుతో సేవలందించినప్పుడే నర్సులు ఒత్తిడిని జయిస్తారని ఏపీ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుశీల అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ వృత్తిలో ప్రతి నర్సుకి ఉండే ఉద్యోగ బాధ్యతల్లో ఎదుర్కొనే ఒత్తిడి, దానిని తట్టుకునే పద్ధతులపై రాష్ట్ర స్థాయి నర్సింగ్ కాన్ఫరెన్స్ అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుశీల మాట్లాడుతూ ఆస్పత్రుల్లో నర్సులు ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని చెప్పారు. రోగులు ఆస్పత్రిలో చికిత్స పొంది ఆరోగ్యంగా వెళుతూ సేవలందించిన నర్సులపై ప్రశంశలు కురిపిస్తారని అప్పుడే ఒత్తిడి దూరం అవుతుందన్నారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏ పనిని అయిన ఇష్టపూర్వకంగా చేస్తుంటే ఒత్తిడి అనిపించదని తెలిపారు. తొలుత జ్యోతి వెలిగించి కార్యక్ర మాన్ని ప్రారంభించారు. నర్సింగ్ విద్యార్థినులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. రాష్ట్రం లోని 18 కళాశాలల నుంచి విద్యా ర్థులు, అధ్యాపకులు హాజరు కాగా అందరికి సర్టిఫికెట్లు అందజేశారు. రిసోర్స్ స్పీకర్స్‌గా సెయింట్ ఆన్స్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ఫ్లొరెన్స్, కోటేశ్వరమ్మ, సిద్ధార్థ నర్సింగ్ ప్రిన్సిపాల్ జె.వందన, డాక్టర్ రూబీ రాణి వ్యవహరించగా మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, నర్సింగ్ కళాశాల కన్వీనర్ వీరపనేని శశికళ, డాక్టర్ భీమేశ్వర్ పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న ఏపీ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుశీల

నేడు, రేపు నగరంలో ట్రావెల్ ఎగ్జిబిషన్

● ఐఐటీఈ సంస్థ డైరెక్టర్ అనురాగ్ గుప్తా



గవర్నర్‌పేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ పర్యాటకాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా నగరంలో రెండు రోజుల పాటు ట్రావెల్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఇండియన్ ఇంటర్నేషనల్ ట్రావెల్ ఎగ్జిబిషన్ (ఐఐటీఈ) సంస్థ డైరెక్టర్ అనురాగ్ గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22, 23 తేదీల్లో ఎంజీ రోడ్డులోని అమరావతి కన్వెన్షన్ హాలులో ఉదయం 11.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ట్రావెల్, టూరిజం, రైల్వేలు, హాస్పిటాలిటీ, వాటి అనుబంధ పరిశ్రమల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి ఐఐటీఈ ప్రదర్శిస్తుందని తెలిపారు. ప్రదర్శనలో దేశీయ, అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానాలు, హోటళ్లు, రిసార్ట్‌లు, అనుబంధ సేవలు, దేశ, విదేశీ టూర్ ఆపరేటర్ల వివరాలు అందిస్తుందన్నారు. ప్రయాణీకులు గమ్యస్థానాన్ని ఎంచుకోవడానికి వన్‌స్టాప్ షాపుగా ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. వేసవి సెలవులు, వారాంతపు విహారయాత్రలు, హనీమూన్‌లే కాకుండా ఏడాది పొడవునా సెలవుల్లో ప్రయాణాలు, పర్యాటకానికి అనుకూలమైన అవకాశాలు అందిస్తామన్నారు. ఈ ప్రదర్శన ప్రవేశం ఉచితమని, పర్యాటక ప్రియులే కాకుండా నగరవాసులంతా సందర్శించాలని విజ్ఞప్తి చేశారు.

27 నుంచి హజరత్ సయ్యద్ గాలిబ్ షహిద్ అవులియా ఉరుసు

విద్యాధరపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): భవానీపురంలోని హజరత్ సయ్యద్ గాలిబ్ షహిద్ అవులియా 437 ఉరుసు ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు గాలిబ్ షహిద్ దర్గా ముజావర్స్ కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 27 రాత్రి 11.45 గంటలకు ఎండీ సులేమాన్ ఇంటి నుంచి ఉరుసు బయలుదేరుతుందన్నారు. 28న రాత్రి 7 గంటలకు దీపారాధన, అన్నదాన కార్యక్రమాలతో పాటు ఖవ్వాలి, పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రెసిడెంట్ ఎండీ ముస్తాక్ అహ్మద్, వైస్ ప్రెసిడెంట్ ఎస్‌కే చాన్ బాషా తెలిపారు.

నగరాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా..

2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ముఖ్యాంశాలపై మేయర్ భాగ్యలక్ష్మి

కార్పొరేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల క్షేమం, నగరాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. ప్రధాన కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శుక్రవారం 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ముఖ్యాంశాలను వివరించారు. రూ.40.9 కోట్లతో సీసీ రోడ్లను, రూ.6.80కోట్లతో బీటీ రోడ్లు నిర్మించామన్నారు. 15 ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ.17కోట్లతో 24.91కిలోమీటర్లు గాలి నాణ్యతని మెరుగుపరచడం కోసం ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. కొండ ప్రాంతంలో మెట్లు, ల్యాండింగ్, ట్రాంప్‌లు రూ.2.95 కోట్లతో పూర్తి చేశామన్నారు. 40వ డివిజన్‌లో 1500 కేఎల్ కెపాసిటీతో రిజర్వాయర్‌ను రూ.3.30కోట్లతో పూర్తి చేశామన్నారు. 46వ డివిజన్‌లో 500కేఎల్ కెపాసిటీతో రిజర్వాయర్ పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. రూ.8.32కోట్లతో గద్దె వెంకట్రామయ్య నగర్ నుంచి నందమూరి



బడ్జెట్ వివరాలు తెలుపుతున్న మేయర్ భాగ్యలక్ష్మి

నగర్ వరకు 1500 కేఎల్ కెపాసిటీ రిజర్వాయర్లు నిర్మాణం చేపట్టామన్నారు. క్రీస్తురాజుపురం కొండ ప్రాంతంలో రూ.4 కోట్లతో 200 కెనాల్ కెపాసిటీ జీఎల్ఎస్ఆర్‌ను త్వరలో పూర్తి చేస్తామన్నారు. అమృత్‌లో రూ.83.74 కోట్లతో 18.64 కిమీ నీటి సరఫరా కోసం రెహమాన్ పార్క్‌లో, గుణదల కార్మెల్‌నగర్‌లో, మున్సిపల్ ఎంప్లాయీస్ లేఅవుట్‌లో 4రిజర్వాయర్‌లు నిర్మాణం చేపట్టామన్నారు. 30వ డివిజన్ దావు బుచ్చయ్య కాలనీలో రూ.1.5 కోట్లతో 4.5 కిలోమీటర్ల పైప్‌లైన్ వేశామన్నారు. రూ.3.29 కోట్లతో 3 కిలోమీటర్ల పైపులైన్ పనులు చేపట్టారన్నారు. రూ.14.16 కోట్లతో మూడు నియోజకవర్గాల్లో డ్రెయినేజీలను నిర్మించామన్నారు. రూ.6కోట్లతో విద్యాధరపురంలో ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నారన్నారు. రూ.17.4కోట్లతో 320 మీటర్ల పొడవుతో రైల్వే అండర్ బ్రిడ్జిని మధురానగర్‌లో ప్రారంభించి, అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అమృత్ 2.0 ఫైనాన్స్ కమిషన్‌లో రూ.74.36 కోట్లతో 25శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఆస్తి పన్నులు రూ.109.23 కోట్లు, ఖాళీ స్థలాల పన్నులు రూ.9.80కోట్లు, తదితర పన్నులు అన్ని కలిపి రూ.163.8కోట్లు రెవెన్యూ ఆదాయం వచ్చిందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైసీపీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలు

వన్‌టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు మనవడు, విద్య, ఐటీ శాఖ మంత్రి కుమారుడు నారా దేవాన్ష్ 10వ పుట్టిన రోజు వేడుకలు ఐటీడీపీ టీమ్ వర్తికూటి నితిన్ కుమార్ ఆధ్వర్యంలో గురునానక్ కాలనీలోని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ శివనాథ్, వర్తికూటి నితిన్ కుమార్ కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ దేవాన్ష్‌కు ఆశీస్సులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జిల్లా కరిముల్లా, వేదవ్యాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

ఎ.కొండూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో విధులకు డుమ్మా కొడుతున్న ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులకు డీఈవో షోకాజ్ నోటీసులు అందజేసినట్టు ఎ.కొండూరు ఎంఈవో-2 కేశవరావు తెలిపారు.

మండలకేంద్రమైన ఎ.కొండూరు చైతన్య నగర్‌తండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బి. గిరిబాబు తనకు బదులుగా రిటైర్డ్ అంగన్వాడీ టీచర్‌ను నియమించుకొని, హాజరు నమోదు చేసి, విధులకు డుమ్మాకొట్టడం, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నట్టుగా నమోదు చేశారు. రామచంద్రాపురం గ్రామ శివారు కోమటికుంట పాఠశాల ఉపాధ్యాయుడు ట్రైనింగ్‌కు వెళ్లగా, కేశ్యాతండా ఉపాధ్యాయుడు ఎస్‌కె సుభానిని డెప్యూటేషన్ పంపగా, ఆయన పాఠశాల తెరవకుండా విధులకు డుమ్మా కొట్టారు. ఎంఈవో పాఠశాలల తనిఖీ సందర్భంగా గుర్తించారు. ఈ ఘటనలపై పంపిన నివేదిక ప్రకారం ఇద్దరు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి నోటీసులు జారీ చేసినట్టు ఎంఈవో తెలిపారు.

విద్యార్థులు, యువతను ఆధునిక సైన్స్, టెక్నాలజీ వైపు నడిపిస్తోంది గోరా టెక్నో హబ్. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అంతరిక్షంలో సంభవిస్తున్న వివిధ రకాల పరిణామాల గురించి త్వరితగతిన తెలుసుకునేందుకు ఈ కేంద్రం ఎంతగానో దోహదపడుతోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన చంద్రయాన్-3, ఆర్యభట్ శాటిలైట్, సర్వే డ్రోన్ నమూనాలు ఆకట్టుకుంటున్నాయి. హోమ్ ఆటోమిషన్, రాకెట్ లాంచింగ్ వంటి ఎన్నో అంతరిక్ష అద్భుతాలు కనువిందు చేస్తున్నాయి.


రాకెట్ లాంచ్ నమూనా

విజ్ఞాన లోకం

- ఇగ్నైట్, ఇన్‌స్పైర్, ఇన్నోవేషన్ అనే నినాదంతో కేంద్రం స్థాపన

యువతలో సైన్స్, టెక్నాలజీ ప్రేరణకు గోరా టెక్నో హబ్ దోహదం

- ఆకట్టుకుంటున్న రోబో గైడ్, అంతరిక్షశాల
- అబ్బురపరుస్తున్న చంద్రయాన్-3, ఆర్యభట్ శాటిలైట్, సర్వే డ్రోన్ నమూనాలు
- హోమ్ ఆటోమిషన్, రాకెట్ లాంచింగ్ వంటి ఎన్నో అంతరిక్ష అద్భుతాలు

ఆంధ్రజ్యోతి-బెంజిసర్కిల్: యువతలో సైన్స్, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ కోర్సుల పట్ల ఆసక్తి పెంచి రాబోయే తరం వారిని యంగ్ సైంటిస్టులుగా తీర్చిదిద్దే ఉద్దేశ్యంతో విజయవాడ బెంజిసర్కిల్ నాస్తిక కేంద్రంలో గోరా టెక్నో హబ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ రెగ్యులర్‌గా వర్క్‌షాప్‌లు, సెమినార్‌లను నిపుణులైన సైంటిస్టులతో ఏర్పాటు చేసి విద్యార్థులను భాగస్వాములను చేస్తారు. ఆదివారం మినహా వారంలో మిగిలిన ఆరు రోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సందర్శకుల కోసం ఈ హబ్‌ను తెరిచి ఉంచుతారు.

రోబోనే గైడ్‌గా..

ఈ హబ్‌లో రోబోనే గైడ్‌గా వ్యవహరిస్తోంది. శాస్త్ర, సాంకేతిక అంశాలను సందర్శకులకు వివరించేందుకు మిలాన్ అనే పేరుతో ఒక రోబోను ఏర్పాటు చేశారు. ఇది అక్కడ పొందపరిచిన అంశాలను ఆంగ్లంలో కళ్లకు కట్టినట్లు వివరిస్తోంది. భారత్ మొదటి శాటిలైట్ అయిన ఆర్యభట్ నమూనా, సర్వే డ్రోన్, విద్యుత్ స్విచ్‌లతో పనిలేకుండా సెల్‌ఫోన్ ద్వారానే లైట్‌లు ఆఫ్, ఆన్‌కు ఉపయోగపడే హోమ్ ఆటోమేషన్ ఈటెక్నో హబ్‌లోని ప్రదర్శనలో దర్శనమిస్తాయి. చిన్నపాటి రాకెట్ నమూనా, 3డీ ప్రింటింగ్ ప్రొడెక్ట్ ఈ ప్రదర్శనలో ఉంచారు. ఒక వ్యక్తి ఏ గ్రహంపై ఎంత బరువు ఉంటాడో కూడా పొందు పరిచే టీవీ స్క్రీన్ కూడా ఇక్కడ ఉంది. ఒక మిషన్ కింద నిలబడితే వ్యక్తి సెంటీమీటర్లు, అడుగుల్లో ఎంత ఎత్తు ఉంటాడో తెలియజేసే నో యువర్ హైట్ మిషన్ కూడా ఏర్పాటు చేశారు.

అంతరిక్షశాలలో అద్భుతాలు

ఇక్కడ అంతరిక్షశాలలో అనేక అద్భుతాలు కనిపిస్తాయి. ఆకాశంలో నక్షత్రాలు రాత్రిపూట ఏవిధంగా ఉంటాయో ఇక్కడ చూడవచ్చు. చైనా మొదటి స్పేస్‌స్టేషన్ చిత్రాలు, చంద్రయాన్-3 నమూనా, జర్నీ ఆఫ్ స్పేస్, సర్క్యూట్స్ అభివృద్ధి, సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం చిత్రం, సోలార్ సిస్టం పనిచేసే విధానం తదితర అంశాలు కూడా ఈ హబ్‌లో పొందుపరిచారు.



ఆర్యభట్ట శాటిలైట్ నమూనా

నూతన ఆవిష్కరణలకు దోహదం



గోరా టెక్నో హబ్‌లో పొందుపరిచిన వివిధ నమూనాలు, అంశాలు నూతన ఆవిష్కరణలకు దోహదపడే విధంగా ఉన్నాయి. తెలియని ఎన్నో విషయాలను ఆ ప్రదర్శన ద్వారా తెలిసుకోగలిగాం. మిలాన్ పేరుతో ఏర్పాటు చేసిన రోబో సైన్స్, టెక్నాలజీకి సంబంధించిన పలు విషయాలను కళ్లకు కట్టినట్లు వివరిస్తోంది.

- నల్లా సాయిహర్షిత, విద్యార్థిని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ

శాస్త్ర, సాంకేతిక అంశాలపై ప్రేరణ



టెక్నో హబ్‌లోని ప్రదర్శనలో ఉంచిన వివిధ రకాల నమూనాలు శాస్త్ర, సాంకేతిక అంశాలపై ప్రేరణ కలిగించే విధంగా ఉన్నాయి. యువ శాస్త్రవేత్తలుగా తయారయ్యేందుకు ఇది మార్గదర్శకం అవుతోంది. తెలియని ఎన్నో విషయాలను తెలిసుకోగలిగా. ముఖ్యంగా అంతరిక్షశాలను కూడా ఇక్కడ చూడగలిగా. ఎంతో ఆనందంగా ఉంది.

- డి.రిహాల్, విద్యార్థి, పీబీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల

విద్యార్థులు, యువతను ప్రోత్సహించేందుకే..



విద్యార్థులు, యువతను రోబోటిక్ సైన్స్ టెక్నాలజీ రంగాల వైపు ప్రోత్సహించేందుకే గోరా టెక్నో హబ్‌ను స్థాపించారు. ఇది శాశ్వత ప్రాతిపదికన ఉంటుంది. ఈ హబ్‌లో అంతరిక్షశాలనే ఏర్పాటు చేశాం. ఇగ్నైట్, ఇన్‌స్పైర్, ఇన్నోవేషన్ అనే నినాదంతో యువతలో సైన్స్ పట్ల కుతూహలం, ఆసక్తి, పరిశోధన నూతన ఆవిష్కరణల వైపు దృష్టి పెట్టేందు ఇది దోహదపడుతుంది.

- డాక్టర్ జి. సమరం, గోరా టెక్నో హబ్ చైర్మన్



వంద మోటార్లలో కేబుల్ వైరు చోరీ


పాములలంకలో కేబుల్ వైరును చూపుతున్న రైతు వెంకటేశ్వరరావు

తోట్లవల్లూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పాములలంకలో వంద వ్యవసాయ సబ్‌మెర్సిబుల్ మోటార్ల వద్ద కేబుల్ వైర్లను గురువారం అర్ధరాత్రి దొంగలు కత్తిరించుకుపోయారు. రైతులు శుక్రవారం ఉదయం పొలాలకు నీరు పెట్టేందుకు బోర్ల వద్దకు రాగా, కేబుల్ వైర్లు కత్తిరించి ఉండటం చూసి షాక్ అయ్యారు. విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక పొలాల్లో, ఆంజనేయస్వామి విగ్రహం ఎదుట డొంక ఏరియాలో వంద మోటార్ల వద్ద కేబుల్ వైర్లను దొంగలు కత్తిరించుకుపోయారని రైతులు కర్రా నాగరాజు, శీలం వెంకటేశ్వరరావు తెలిపారు. పంటలకు నీరు పెట్టాలంటే మళ్లీ కేబుల్ వైర్లను కొనుగోలు చేసి మెకానిక్ చేత పని చేయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఒక్కో రైతుకు రూ.2 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికి 15 సార్లు కత్తిరించుకుపోయారు..

రాగివైరు కోసమే దొంగలు మోటార్ల కేబుల్ వైర్లను కత్తిరించుకుపోతున్నారు. మండలంలో ఇది 15వ ఘటనగా రైతులు చెబుతున్నారు. వివిధ గ్రామాల్లో 15 పర్యాయాలు కేబుల్ వైర్లు దొంగిలించినా ఇంత వరకు పోలీసులు ఒక్క దొంగను కూడా పట్టుకోలేకపోవటం తమకు శాపంగా మారిందని రైతులు విమర్శిస్తున్నారు. ఫిర్యాదులు చేసినా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టటం లేదని వాపోతున్నారు. కేబుల్ వైర్ల దొంగతనాలు ఒకరిద్దరు చేసే పనికాదని చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి ఈ దొంగల ముఠాను అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

24న 'ఎన్టీఆర్ వైద్య సేవ' సిబ్బంది ఆందోళన

బెంజిసర్కిల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఏపీ ఆరోగ్య మిత్ర కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 24వ తేదీన డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం సిబ్బంది ఆందోళన చేస్తారని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ గోవిందు, ప్రధాన కార్యదర్శి గురవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వి. బంగారుశ్రీ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ అన్ని జిల్లాల్లోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం జిల్లా కో-ఆర్డినేటర్(డీసీ)కార్యాలయాల వద్ద శాంతియుత వాతావరణంలో ఆందోళన జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే 27న మంగళగిరిలోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కార్యాలయం వద్ద గాంధీ మార్గంలో నిరసన తెలియజేస్తామని తెలిపారు.

నేడు పంట కుంటల తవ్వకం ప్రారంభం



కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో భాగంగా శనివారం ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా 1.55 లక్షల పంట కుంటల తవ్వకాలను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రారంభించనున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 3 వేల పంట కుంటలను లక్ష్యంగా పెటుకున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని మండలాల్లోను, అన్ని గ్రామ పంచాయితీల్లోనూ పంట కుంటల పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. పంట కుంటలతో పాటుగా వాటి గట్లపై కూరగాయలు మొక్కలు పెంచడం ద్వారా అదనపు ఆదాయం వస్తుందన్నారు. అలాగే పంట కుంటల్లో చేపలను పెంచడం ద్వారా రైతులకు ఆదాయం పెరుగుతుందని తెలిపారు.

త్వరలో సిమెంట్ రోడ్లు, గోకులాల ప్రారంభోత్సవం

ఉగాది నుంచి వారం రోజుల పాటు ప్రత్యేక వారోత్సవాలు ద్వారా పల్లె పండుగలో మంజూరై పూర్తి చేసిన సిమెంట్ రోడ్లు, గోకులాలను ప్రజాప్రతినిధులతో కలిపి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పూర్తి చేయాల్సిన సిమెంట్ రోడ్లను ఈ నెలాఖరుకు పూర్తిచేసి బిల్లులు అప్‌లోడ్ చేయవలసిందిగా పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ తెలియజేశారని కలెక్టర్ పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న సస్పెక్ట్ షీటర్‌పై కేసు

పాయకాపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఓ సస్పెక్ట్ షీటర్‌పై నున్న రూరల్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. శాంతినగర్ ప్రాంతానికి చెందిన కుందేటి గణేష్ అలియాస్ గనికి నున్న రూరల్ పోలీసు స్టేషన్‌లో క్రైమ్ సస్పెక్ట్ షీట్ ఉంది. గత కొంత కాలంగా స్టేషన్‌లో సంతకాలకు రాకుండా తిరుగుతున్న గని వాంబేకాలనీ వైఎస్సార్ పార్క్ ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించాడు. అతన్ని అదుపులోకి తీసుకుని సోదా చేయగా అతని వద్ద 21 కేజీల గంజాయి ఉండటాన్ని గుర్తించారు. దీంతో గనిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కాగా సస్పెక్ట్ షీటర్ గనిపై నగరంలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో 24 కేసులు ఉన్నాయి.

మ్యాన్‌హోల్‌తో ముప్పు!



పైలట్ ప్రాజెక్టు ద్వారా గ్రామాలకు మంచినీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైన్ మ్యాన్‌హోల్ మూత లేకుండా చెవిటికల్లు ఎస్సీ కాలనీలో ప్రమాదభరితంగా ఉంది. 12 అంగుళాల వెడల్పు, సుమారు ఎనిమిది అడుగుల లోతు ఉన్న మ్యాన్‌హోల్‌లో నీరు చేరింది. దీని పక్క నుంచే చిన్నారులు నిత్యం అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి వస్తుండటంతో వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మూతలేకుండా వదిలేసిన అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మూత ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

-ఆంధ్రజ్యోతి-కంచికచర్ల రూరల్

సమగ్రాభివృద్ధే లక్ష్యం..

- విజయవాడ బ్యూటిఫికేషన్.. అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాం
- మెట్రో రైల్ అడుగులు ముందుకు..
- ఐజీఎంసీ స్టేడియం అభివృద్ధి
- ఆటోనగర్ అభివృద్ధి.. మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట
- బెజవాడలో డిఫెన్స్ ఇండస్ట్రీస్ ఏర్పాటు
- మీడియాతో ఎంపీ కేశినేని శివనాథ్



వన్‌టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): 'విజయవాడ బ్యూటిఫికేషన్.. ఆటోనగర్ అభివృద్ధి .. మెట్రోరైల్ సాకారం, ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్లు, నిడమానూరు ఫ్లై ఓవర్లతో అద్భుతాలు చూపబోతున్నాం. విజయవాడలో డిఫెన్స్ ఇండస్ట్రీస్ తీసుకు రావటానికి ప్రయత్నిస్తున్నా. ఇందిరాగాంధీ స్టేడియం అభివృద్ధితో సహా అనేక క్రీడా స్టేడియాలను ఏర్పాటు చేయబోతున్నాం. గ్రామానికో పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దేలా అడుగులు వేస్తున్నాం. ఆరోగ్య కేంద్రాలను ఆధునీకరించ బోతున్నాం. గ్రామీణ వికాసానికి కృషి చేస్తున్నాం' అని విజయ వాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. శుక్రవారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గ్రామీణ వికాసంతో పాటు విజయవాడ అభివృద్ధి, అనేక ప్రాజెక్టుల గురించి ఆయన మాట్లాడారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు సవాల్‌గా తీసుకున్నానని, ఇందుకోసం 295 గ్రామాల్లో విలేజ్ చాంపియన్స్ వ్యవస్థ నడుస్తుందని చెప్పారు. కేశినేని ఫౌండేషన్ ద్వారా తన సొంత నిధులతో హైదరాబాద్‌లోని ఎన్.ఐ.ఆర్.డి.లో మొదటి విడతగా 50 మంది, రెండో విడతగా 50 మందికి శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో కేశినేని ఫౌండేషన్ ద్వారా 24 గ్రామాలను దత్తత తీసుకుని ఆ గ్రామాల్లో శిక్షణ ఇప్పించిన విలేజ్ చాంపియన్స్‌ను నియమించినట్లు తెలిపారు. త్వరలోనే 295 గ్రామాల్లో 295 మంది విలేజ్ చాంపియన్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ విలేజ్ చాంపియన్స్‌కి ఆరు నెలల పాటు ఒక్కొక్కరికి పదివేల రూపాయలు ఉపకారవేతనంగా ఇస్తున్నట్లు తెలిపారు. ఇంట్లో ఉండే మహిళలు కూడా ఆదాయాన్ని పెంచుకునేలా విప్లవాత్మక మార్పులు తెస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ప్రతి బ్యాచ్‌లోను 200 మంది ఉండేలా నెల రోజుల ప్రోగ్రామ్ రూపొందించామన్నారు. అవగాహన సదస్సులు తర్వాత ఆసక్తి గల ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు నెల రోజులపాటు శిక్షణ ఇచ్చి, ఆ తర్వాత లోన్స్ ఇప్పించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ ఆటోనగర్‌లోని ఆటోమొబైల్ ఇండస్ట్రీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విజయవాడలోని మెకానికల్ పరిశ్రమలు డిఫెన్స్ పరిశ్రమ రంగానికి దగ్గర ఉంటాయని, కాబట్టి ఏరోస్పేస్, డిఫెన్స్ ఇండస్ట్రీపై డి.ఆర్.డి.ఓ మాజీ చైర్మన్, రక్షణ రంగ శాస్త్రవేత్త డాక్టర్ జి.సతీష్ రెడ్డితో వీరికి సలహాలు సూచనలు ఇప్పించామన్నారు. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మెట్రో రైలు ఏర్పాటుకు వ్యవహారం చురుగ్గా సాగుతుందని వివరించారు.

ఏటా 30 క్రీడా స్టేడియాల అభివృద్ధి : కేశినేని

వన్‌టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని 175 నియోజకవర్గాల్లో ఏడాదికి 30 క్రీడా స్టేడియాల చొప్పున అభివృద్ధి చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. రాష్ట్రంలో ఏసీఏ చేపట్టిన, చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలు తెలియజేసేందుకు శుక్రవారం ఎంపీ కేశినేని శివనాథ్ గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి లోకేశ్ కారణంగా తాను ఏసీఏ అధ్యక్షుడు అయినట్లు తెలిపారు. వైజాగ్ క్రికెట్ స్టేడియం గత 30 ఏళ్లుగా కొనసాగుతున్న పేరును తొలగించలేదన్నారు. గతంలో వైజాగ్ స్టేడియంలో రెండు ఐపీఎల్ మ్యాచులు జరిగాయని, ఈసారి కూడా మ్యాచులు నిర్వహించాలని ఢిల్లీ కెప్టెన్స్‌ను అడిగామని, స్టేడియం నిర్వహణ, సదుపాయాలపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. అమరావతిలో కూడా స్పోర్ట్స్ సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు.

క్రీడా పోటీల విజయవంతంపై శాప్ చైర్మన్ కృతజ్ఞతలు


ఉద్యోగులతో మాట్లాడుతున్న రవి నాయుడు

విజయవాడ స్పోర్ట్స్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శాసన సభ్యులు, శాసన మండలి సభ్యుల క్రీడా పోటీలు విజయవంతంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు అన్నారు. శుక్రవారం శాప్ కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆదేశాలతో ఈ పోటీలు ఏర్పాటు చేయడం జరిగిందని, దీనికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, రామ్‌ప్రసాద్ రెడ్డి, దుర్గేష్, పయ్యావుల కేశవులు సహకారంతో నిర్వహించామని తెలిపారు.

పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందించాలి

రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, సీసీఎల్ఏ జి.జయలక్ష్మి



సదస్సులో పాల్గొన్న రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా, సీసీఎల్ఏ జి.జయలక్ష్మి తదితరులు

కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందించాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, సీసీఎల్ఏ జి.జయలక్ష్మి సూచించారు. గవర్నర్‌పేట, రైతు శిక్షణ కేంద్రం సమావేశ మందిరంలో శుక్రవారం భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయం ఆధ్వర్యంలో రెవెన్యూ సేవలపై అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలకు శిక్షణా సదస్సు జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, సీసీఎల్ఏ జి.జయలక్ష్మి పాల్గొని నాణ్యమైన రెవెన్యూ సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రెవెన్యూ సేవలు అందించడంతో పాటు ఏమైనా సమస్యలు ఎదురైతే వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, నిరంతర పర్యవేక్షణ, క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం తదితరాలపై మార్గనిర్దేశనం చేశారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి వచ్చే ఆరు నెలల సమయం చాలా కీలకంగా ఉన్న నేపథ్యంలో ఎక్కడా జాప్యం లేకుండా రోజువారీ కార్యకలాపాలు నిర్వహించేందుకు, డేటా నమోదులో కచ్చితత్వానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికా రులపై ఉందన్నారు. ల్యాండ్ ఎన్‌క్రోచ్‌మెంట్, ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ ఖచ్చితంగా అమలు చేసి కేసులు నమోదు చేయాలన్నారు.

అన్ని శాఖలకు మూలం

అన్ని శాఖలకు మూలం రెవెన్యూ శాఖ అని ఈ శాఖ ద్వారా నాణ్యమైన ఖచ్చితమైన సేవలు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పేపర్ లెస్, స్మార్ట్ గవర్నెన్స్ సేవలు అందేలా తీర్చిదిద్దాలని చెప్పారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ వినియోగించాలని సూచించారు. రీసర్వేపై సర్వే సెటిల్‌మెంట్, భూ రికార్డుల డైరెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి, ఈనాం, ఎస్టేట్, పీఓటీ చట్టాలపై విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ లక్ష్మీనరసింహం, రికార్డ్ ఆఫ్ రైట్స్, భూ ఆక్రమణలు, ల్యాండ్ గ్రాబింగ్‌పై విశ్రాంత ఐఏఎస్ అధికారి బి.రామయ్య శిక్షణ ఇవ్వగా, వెబ్‌ల్యాండ్ సంబంధిత అంశాలపై ఏపీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.రచన వివరించారు. మీ భూమి - మీ హక్కు నినాదంతో భూములకు రక్షణ కల్పించేలా వచ్చిన ల్యాండ్ గ్రాబింగ్ (ప్రొహిబిషన్) చట్టం-2024 గ్రామాలను భూ వివాద రహితంగా మార్చేందుకు ఈ శిక్షణ తరగతులు దోహదపడనున్నాయి.

25 నుంచి కౌలురైతు సంఘం ఆందోళనలు

బెంజిసర్కిల్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): నూతన కౌలు రైతుల చట్టం వెంటనే తీసుకురావాలని కోరుతూ ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు రైతు సేవా కేంద్రాల్లోని అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.కాటమయ్య, ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య పిలుపునిచ్చారు. అధికారంలోకి ఇచ్చిన వెంటనే కౌలురైతులకు భూయజమాని ప్రమేయం లేకుండా నేరుగా గుర్తింపు కార్డులు జారీచేస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు హామీ ఇచ్చారని తెలిపారు. భూమి లేని ప్రతి కౌలు రైతు కుటుంబానికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించాలని కోరారు. భూసారాన్ని పెంచడానికి సాయిల్ టెస్ట్ ఆధారంగా సూక్ష్మ పోషకాలను 90 శాతం సబ్సిడీపై కౌలురైతులకు అందించాలని డిమాండ్ చేశారు.

సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లో చోరీకి యత్నం

కూచిపూడి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. ఇందులో భాగంగా సీసీ కెమెరాలు ధ్వంసం చేసి తాళాలు పగులకొట్టి షట్టరు తెరిచేందుకు యత్నించి విఫలం చెందారు. గురువారం అర్ధరాత్రి సమయంలో ఈ సంఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం ఉదయం సమాచారం అందుకున్న పామర్రు సీఐ వి.శుభాకర్, కూచిపూడి ఎస్ఐ కె.ఎస్.విశ్వనాథ్ ఫింగర్ ప్రింట్, క్లూస్ టీమ్ బృందం సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారని, అయితే బ్యాంక్ లోపలికి ప్రవేశించలేదని, బ్యాంక్‌కు ఏలాంటి నష్టం వాటిల్లలేదని తెలిపారు. సంఘటనా స్థలం వద్ద వివరాలు సేకరించటంతో పాటు సీసీ పుటేజీని పరిశీలిస్తున్నట్లు ఎస్ఐ తెలియజేస్తూ ప్రజలు, దుకాణదారులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానితులపై పోలీసులకు తగు సమాచారం అందించాలన్నారు.

హజ్ యాత్రకు 1,630 మంది ఎంపిక

వన్‌టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి 1,630 మంది యాత్రికులను హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ఎంపిక చేసినట్లు ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎండీ గౌస్ పీర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యాత్రికులు తమ వ్యక్తిగత సూచనల మేరకు వివిధ విమానాశ్రయాల ద్వారా ప్రయాణం చేయుటకు, ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తు నమోదు చేసుకునేందుకు రెండు ఆప్షన్‌లు ఇవ్వటం జరిగిందని తెలిపారు. ఆ ఆప్షన్‌ల వారీగా వివిధ ఎంబార్కేషన్ పాయింట్ల నుంచి యాత్రికులు బయలుదేరుతారని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి 1,096 మంది, బెంగళూరు నుంచి 454 మంది, విజయవాడ నుంచి 71 మంది, ఇతర ఎంబార్కేషన్ పాయింట్‌ల నుంచి తొమ్మిది మంది బయలుదేరతారని తెలిపారు. విజయవాడ నుంచి బయలుదేరే 71 మంది విజయవాడ నుంచి కాక, హైదరాబాద్‌ను రెండవ ప్రాధాన్యతగా ఎంపిక చేసుకోవటం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల కొరకు హైదరాబాద్, బెంగళూరు, ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు.

పాత పెన్షన్ సాధించే వరకు ఉద్యమం

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకుడు నాగేంద్ర బాబు


డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్‌కు వినతి పత్రం అందచేస్తున్న నాయకులు

రైల్వే స్టేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన రైల్వే కార్మికులకు ఆసరాగా ఉండే పాత పెన్షన్‌ను సాధించేంత వరకు ఉద్యమిస్తామని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఎడ్ల నాగేంద్ర బాబు అన్నారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య ఇచ్చిన పిలుపు మేరకు ఆలిండియా ప్రొటెస్ట్ వీక్‌లో భాగంగా శుక్రవారం విజయవాడ డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో నాగేంద్ర బాబు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తే కంటి తుడుపు చర్యగా యూపీఎస్‌ను ప్రవేశ పెట్టి చేతులు దులుపుకుందని విమర్శించారు. ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు 12 గంటల రోస్టర్‌ను ఎదుర్కొంటున్నారని, వారికి 8 గంటల రోస్టర్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్‌కు వినతి పత్రం అందజేశారు.

ఆంధ్రజ్యోతి

నవ్య

కుటుంబ కదంబం



అంతరిక్షంలో సునీత భారతీయత

సునీతా విలియమ్స్... ప్రస్తుతం ప్రపంచమంతా మారుమోగుతున్న పేరు. భారతీయ మూలాలున్న సునీత... తొమ్మిది నెలలు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో పరిశోధనలు చేసి ఇటీవల భూమిపైకి వచ్చారు. అంతరిక్షంలో అతి ఎక్కువ రోజులు ఉన్న వ్యోమగామిగా చరిత్ర సృష్టించిన సునీతకు భారతీయ సంస్కృతి సంప్రదాయాలు అంటే చాలా ఇష్టం. తనకున్న ఈ ఇష్టాన్ని అంతరిక్ష కేంద్రంలో ఉన్నప్పుడు కూడా ప్రదర్శిస్తూనే వచ్చారు. ఆ సందర్భాలేమిటో చూద్దాం...

సమోసా

అంతరిక్షంలో నివసించే వ్యోమగాములు తమకు నచ్చిన ఆహారాన్ని అంతరిక్షంలోకి పట్టుకువెళ్లవచ్చు. సునీత భారతదేశ ఆహార సంస్కృతికి గుర్తుగా సమోసాను అంతరిక్షంలోకి తీసుకువెళ్లారు. సునీతకు చిన్నప్పటి నుంచి భారతీయ ఆహారమంటే చాలా ఇష్టం. ఈ విషయాన్ని ఆమె అనేకసార్లు ఇంటర్వ్యూలలో కూడా పేర్కొన్నారు. సమోసా కేవలం ఆమెకు ఒక చిరుతిండి మాత్రమే కాదు.. భారత దేశాన్ని ప్రతిరోజూ తలుచుకోవటానికి ఒక అవకాశం కూడా!

దీపావళి



సునీత తండ్రి భారత దేశం నుంచి అమెరికాకు వలస వెళ్లారు. అమెరికాలో కూడా భారతీయ పండుగలు జరుపుకుంటూ ఉండేవారు. అంతరిక్షంలో వ్యోమగాములు తమకు నచ్చిన పండుగ జరుపుకొనే అవకాశముంటుంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని సునీత అంతరిక్షంలో దీపావళి జరుపుకున్నారు. "దీపావళి జరుపుకుంటుంటే నాన్నగారు గుర్తుకువస్తున్నారు" అన్న ఆమె మాటలు ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అయ్యాయి.

భగవద్గీత



అంతరిక్షానికి సునీత తనతో పాటుగా భగవద్గీత, ఉపనిషత్‌లను తీసుకువెళ్లారు. "నాకు మార్గదర్శకత్వం కావాల్సి వచ్చినప్పుడు.. ఆత్మస్థైర్యం కావాల్సినప్పుడు ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయి. అందుకే వీటిని అంతరిక్షంలోకి తీసుకువెళ్తున్నాను" అని ఆమె పేర్కొన్నారు. ఈ పుస్తకాలను తనతో తీసుకువెళ్లటం- భారతీయ సంస్కృతి మూలాలపై ఆమెకు ఉన్న అభిమానాన్ని తెలియజేస్తోంది.

గణేశుడు కూడా...



సునీత తనతో పాటుగా గణేశ విగ్రహాన్ని అంతరిక్షంలోకి తీసుకువెళ్లారు. గతంలో ఇచ్చిన కొన్ని ఇంటర్వ్యూలలో ఆమె తన ఆధ్యాత్మిక జీవితంలో గణేశుడు ఒక ప్రముఖమైన పాత్ర పోషిస్తాడని పేర్కొన్నారు. అంతరిక్షంలోకి ఒక హిందూ దేవుడి విగ్రహాన్ని తీసుకువెళ్లిన వ్యోమగామి సునీతే కావటం విశేషం.

యువతకు స్ఫూర్తిగా...

సునీత చాలాకాలంగా భారతీయ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కృషి, పట్టుదల ఉంటే ఎంతటి ఎత్తుకైన ఎదగవచ్చనటానికి ఆమె ఒక ఉదాహరణ. ఈ విషయాన్నే ఆమె 2013లో భారత దేశానికి చెందిన కొద్దిమంది పిల్లలతో పంచుకున్నారు. "ఈ ప్రపంచం మీకు ఆహ్వానం పలుకుతోంది. నేనూ మీలాంటిదానినే" అని సునీత ఇచ్చిన సందేశం అనేక మందిలో స్ఫూర్తి రగిలించింది.

అల్లం... అద్భుత ఔషధం



అల్లానికి ఆయుర్వేదంలో ఒక ప్రత్యేక స్థానముంది. దుంపలలో ఎక్కువ రసం ఉన్నది అల్లమే కాబట్టి దీనిని సంస్కృతంలో ఆర్ద్రకం అని పిలుస్తారు. దీని నుంచే హిందీలో అదరక్ అనే పదం పుట్టింది. అల్లం మొక్కను చూస్తే అనేక కొమ్మలు కనిపిస్తాయి. దాని నుంచి వచ్చిన దుంప కాబట్టి అల్లాన్ని శృంగవేర అని పిలుస్తారు. ఇదే విధంగా గ్రీకు భాషలో జింజి అంటే కొమ్ము అని అర్థం. దీని దుంపలు కొమ్ముల ఆకారంలో ఉంటాయి కాబట్టి.. దీనికి జింజిబేర అని పేరు వచ్చింది. ఆ పదం నుంచి జింజర్ అనే పదం పుట్టింది. అల్లాన్ని భారతీయులు మాత్రమే కాకుండా చైనీయులు, కొరియన్లు ఎక్కువగా ఉపయోగిస్తారు. చైనీయులు అల్లాన్ని తురిమి దానిలో కరివేపాకు కలిపి బూందీలా వేయిస్తారు. దీనిని చావో అంటారు. ఇక కొరియన్లు బార్లీ పిండిని పులియబెట్టి దానిలో అల్లం వేసి తింటారు.

రకరకాలుగా...



అల్లం లేతగా.. తాజాగా ఉన్నప్పుడే రుచికరంగా ఉంటుంది. ఎండిన అల్లాన్ని శొంఠి అంటారు. అల్లమూ, శొంఠీ రెండూ వాతాన్ని, కఫాన్నీ తగ్గించే ప్రసిద్ధ ద్రవ్యాలు. శొంఠి కన్నా అల్లం వేడి చేసే స్వభావం ఉన్న ద్రవ్యం. విరేచనకారంతో పోలిస్తే వేడి చేసే విషయంలో అల్లమే నయం. అయితే అల్లాన్ని పరిమితంగా.. ఒక ఔషధంగా వాడుకోవాలి. ఆయుర్వేద శాస్త్రం ప్రకారం అల్లంకూడా బలాన్నిచ్చే టానిక్ లాంటిది. ఇది వ్యాధినిరోధక శక్తినిస్తుంది. రక్తదోషాల్ని పోగొడుతుంది. ఇది జఠరాగ్నిని పెంచుతుంది. అల్లాన్ని దంచి, ఒక వస్త్రంలో వేసి, గిన్నెలో గట్టిగా పిండితే రసం వస్తుంది. కొద్ది సేపటికి నీరు తేరుకుని అడుగున తెట్టు విరుగుల్తుంది. తేరిన రసాన్ని మాత్రమే తీసుకొని అడుగున మిగిలింది వదిలేయాలి. ఇదే అల్లం రసం. ఈ రసంలో బెల్లం కలిపి తాగితే వెంటనే జీర్ణశక్తి పెరుగుతుంది. ఇందులో తగినన్ని పాలు పోసి ఉడికించి తేనె కలిపి, టీలాగా తాగే అలవాటు చాలా దేశాల వారికి ఉంది.

లాభాలెన్నో!

అల్లంలో ఫాస్పరస్.. క్యాల్షియంతో పాటుగా ప్రొటీన్లు కూడా ఎక్కువగా ఉంటాయి. ఇందులో జింజిరోన్, షోయగోల్ అనే రసాయనాల వలన జ్వరాన్ని.. నొప్పులను తగ్గించే శక్తి ఉంటుంది. అల్లంలో ఉన్న పీచు పేగులను దృఢపరుస్తుంది. ఇది పేగులను వేగంగా కదిలించి, విరేచనం అయ్యేలా చేస్తుంది. అల్లం.. బెల్లం కలిపి నూరి, చిన్నచిన్న బిళ్లలు కట్టి ఆరనిచ్చి సీసాలో పోసుకొని, ఒక్కొక్క బిళ్ల చొప్పున రెండు లేక మూడుసార్లు చప్పరిస్తే అరచేతిలో చెమటపట్టటం, పొట్టు రాలటు తగ్గుతాయి. సొరియాసిస్ వ్యాధిలో ఇది మంచి ఉపాయం! దగ్గు, జలుబు, ఉబ్బసం, ఇతర ఎలర్జీ వ్యాధుల్లో అల్లం మంచిది. కీళ్లవాతం, సయాటికా, నడుంనొప్పి, మెడనొప్పి, ఇలా అనేక దీర్ఘవ్యాధులతో బాధపడేవారు- ఆహార పదార్థాల్లో కారానికి బదులుగా అల్లం వాడుకొంటే మంచిది. నిమ్మరసంలో అల్లం ముక్కల్ని నానబెట్టిన అల్లం మురబ్బా జీర్ణ శక్తిని పెంచుతుంది.

• గంగరాజు అరుణాదేవి

వంటిల్లు

వేసవి కాలం వచ్చేసింది. రోజు రోజుకీ ఎండ వేడి పెరుగుతోంది. మధ్యాహ్నం వేళ బాగా ఎండగా ఉన్నప్పుడు ఒక గ్లాసు చల్లటి మజ్జిగ తాగితే ప్రాణం లేచొచ్చినట్లు ఉంటుంది. అందుకే ఈ వేసవిలో మీ దాహార్తిని తీర్చేందుకు విభిన్న మజ్జిగ రుచులను అందిస్తున్నాం...

కమ్మని మజ్జిగతో... చల్ల చల్లగా...



స్వీట్ లస్సీ

కావాల్సిన పదార్థాలు

● పెరుగు- రెండు కప్పులు, పంచదార- అర కప్పు, యాలకుల పొడి- అర చెంచా, కుంకుమ పువ్వు- పావు చెంచా, గులాబీ నీళ్లు- ఒక చెంచా, చల్లటి నీళ్లు- అర గ్లాసు, ఐస్ క్యూబ్స్- ఆరు

తయారీ విధానం

● ఒక కప్పులో ఒక చెంచా నీళ్లు, కుంకుమ పువ్వు వేసి అయిదు నిమిషాలు నాననివ్వాలి.

● ఒక వెడల్పాటి గిన్నెలో పెరుగు, పంచదార వేసి బీటర్ సహాయంతో బాగా బీట్ చేయాలి. పంచదార మొత్తం కరిగాక ఇందులో యాలకుల పొడి, కుంకుమపువ్వు మిశ్రమం, గులాబీ నీళ్లు, చల్లటి నీళ్లు, ఐస్ క్యూబ్స్ వేసి మరోసారి బీట్ చేయాలి. తరవాత ఈ మిశ్రమాన్ని గాజు గ్లాసులో పోసి పైన కుంకుమ పువ్వు రేకులు, పిస్తా తరుగు చల్లితే స్వీట్ లస్సీ సిద్ధం అవుతుంది.

జాగ్రత్తలు

● కమ్మగా ఉండే గడ్డ పెరుగుని తీసుకుంటే లస్సీ రుచికరంగా తయారవుతుంది.
● ఇందులో ఒక చెంచా కోవా కలిపితే మరింత కమ్మగా ఉంటుంది.
● పంచదారకు బదులు బెల్లం పొడి లేదా తాటి బెల్లం కూడా వాడుకోవచ్చు.

మసాలా మజ్జిగ



కావాల్సిన పదార్థాలు

● అల్లం- ఒక చిన్న ముక్క, పచ్చి మిర్చి- ఒకటి, పుదీనా ఆకులు- అయిదు, కొత్తిమీర- రెండు రెమ్మలు, మిరియాల పొడి- పావు చెంచా, జీలకర్ర పొడి- పావు చెంచా, పెరుగు- ఒక గంటె, ఉప్పు- తగినంత, చల్లటి నీళ్లు- ఒక గ్లాసు, నిమ్మరసం- ఒక చెంచా

తయారీ విధానం

● పచ్చిమిర్చి, పుదీనా, అల్లం, కొత్తిమీరలను నీళ్లతో శుభ్రంగా కడగాలి. కొత్తిమీరను సన్నగా తరగాలి.

● మిక్సీ గిన్నెలో పెరుగు, అల్లం, పచ్చిమిర్చి, పుదీనా ఆకులు, కొత్తిమీర తరుగు, మిరియాల పొడి, జీలకర్ర పొడి, ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరవాత ఇందులో చల్లటి నీళ్లు పోసి మరోసారి గ్రైండ్ చేయాలి. ఇలా తయారైన మసాలా మజ్జిగను గాజు గ్లాసులో పోయాలి. ఇందులో నిమ్మరసం వేసి కలపాలి. దీనిపైన చిటికెడు జీలకర్ర పొడి, కొద్దిగా కొత్తిమీర తరుగు చల్లి సర్వ్ చేస్తే బాగుంటుంది.

జాగ్రత్తలు

● గ్రైండ్ చేసిన మసాలా మజ్జిగను కావాలనుకుంటే వడబోసుకోవచ్చు.
● ఈ మజ్జిగ ఘాటుగా ఉందనిపిస్తే అందులో కొన్ని చల్లటి నీళ్లు, కొద్దిగా ఉప్పు కలుపుకోవచ్చు.

షాహీ లస్సీ



కావాల్సిన పదార్థాలు

● ఖర్జూరాలు- తొమ్మిది, బాదం పప్పులు- పదమూడు, జీడిపప్పులు- పది, పిస్తా పప్పులు- పది, ఎండు ద్రాక్ష- ఆరు, యాలకుల పొడి- పావు చెంచా, కుంకుమ పువ్వు- పావు చెంచా, పెరుగు- ఒక గరిటెడు, నీళ్లు- ఒక గ్లాసు, గులాబీ రేకులు- అయిదు

తయారీ విధానం

● ముందుగా ఒక గిన్నెలో ఖర్జూరాలు, బాదం, జీడిపప్పు, పిస్తా, ఎండు ద్రాక్ష వేసి అవి మునిగేవరకూ నీళ్లు పోసి అరగంటసేపు నానబెట్టాలి. ఒక కప్పులో ఒక చెంచా నీళ్లు తీసుకుని అందులో కుంకుమపువ్వు వేసి ఉంచాలి.

● మిక్సీ గిన్నెలో పెరుగు, నానబెట్టిన డ్రై ఫ్రూట్స్, కుంకుమపువ్వు మిశ్రమం, యాలకుల పొడి వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరవాత ఇందులో నీళ్లు పోసి మరోసారి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని గాజు గ్లాసులో పోసి పైన పిస్తా తరుగు, గులాబీ రేకులు చల్లితే రుచికరమైన షాహీ లస్సీ తయారవుతుంది. చల్లగా తాగాలనుకుంటే ఫ్రిజ్‌లో అరగంటసేపు పెడితే చాలు.

జాగ్రత్తలు

● పుల్లగా కాకుండా తియ్యగా ఉండే పెరుగు తీసుకుంటే షాహీ లస్సీ రుచిగా ఉంటుంది.
● డ్రైఫ్రూట్స్‌ని రాత్రంతా నీళ్లలో నానబెడితే లస్సీ రుచి పెరుగుతుంది.

సంకల్పం

లోపం... శాపం కాకూడదని..!

మగపిల్లాడు కావాలనుకొంటే ఆడపిల్ల పుట్టింది. అదికూడా వినికిడి శక్తి లేని పిల్ల. ఇంట్లో వద్దు పొమ్మని కన్నతండ్రి చీదరించుకున్నాడు. అయినవాళ్లు, బంధువులు దూరం పెట్టారు. కానీ అమ్మ అండతో సామాజిక అసమానతలు దాటి... ఉన్నత చదువులు చదివింది. నాట్యం, సంగీతం... అన్నింటా అద్భుతాలు చేస్తోంది. తనలాంటివారికి ప్రేరణగా నిలుస్తూ రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును అందుకున్న 33 ఏళ్ల రచనా షా కథ ఇది.



"నాది భిన్నమైన కథ. కన్నవారు ఉన్నా అనాథలా ఇంటికి దూరంగా బతికాను. నాకోసం అమ్మ అన్నిటినీ వదిలేసి కట్టుబట్టలతో బయటకు వచ్చింది. అమ్మమ్మ... అమ్మను, నన్నూ చేరదీసింది. నేను ఇవాళ ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు వారిద్దరే కారణం. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో మధ్యతరగతి కుటుంబం మాది. అమ్మ, నాన్న ఇద్దరూ విద్యావంతులు. మా అమ్మ డాక్టర్ జ్ఞానేశ్వరీషా కెమికల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ చేసింది. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ప్లాస్టిక్ ఇంజనీరింగ్ విభాగం అధిపతిగా పని చేస్తోంది. నాన్న ఎలక్ట్రికల్ ఇంజనీర్. కానీ నేను పుట్టినప్పుడు మా ఇంట్లో సంబరాలు చేసుకోలేదు. అబ్బాయి కావాలని పూజలు చేస్తే అమ్మాయి పుట్టడం ఒక కారణమైతే, నేను పుట్టు బధిరురాలిని కావడం మరో కారణం.

'అలాంటి కూతురు నాకొద్దు...'

చావు పుట్టుకలు ఎవరి చేతుల్లోనూ ఉండవని తెలిసి కూడా నాన్న నన్ను చీదరించుకున్నారు. చెవిటిదాన్నని నా పట్ల వివక్ష చూపారు. నాన్నతో పాటు ఆయన తరుపు బంధువుల వరుస కూడా అదే. 'వైకల్యంతో పుట్టిన ఆడపిల్లకు ఇంట్లో స్థానం లేదు' అంటూ తేల్చేశారు. మరి ఎక్కడ ఉండాలి? 'ఏదో ఒక ఆశ్రమంలో పడేయండి'... ఇదీ సమాధానం. అమ్మ నా కోసం ఇంటిని, భర్తను వదిలేయడానికి సిద్ధపడింది. అప్పటికి వాళ్ల పెళ్లయ్యి ఏడాదిన్నరే. కానీ మరో ఆలోచన లేకుండా అమ్మ అన్నిటినీ త్యాగం చేసి, నన్ను తీసుకొని, బయటకు వచ్చేసింది. నాకున్న లోపం గురించి ఇకపై ఎవరూ నోరెత్తకుండా నన్ను ఉన్నతంగా పెంచాలని ఆ క్షణం దృఢంగా నిశ్చయించుకుంది.

కొత్త వెలుగు...

నిశిరాత్రి చీకట్లు చీల్చుకొంటూ ఉదయం కొత్త వెలుగుతో వస్తుంది. ఆ నమ్మకంతోనే నా జీవితాన్ని ప్రారంభించాను. నాపై నాకంటే మా అమ్మకు నమ్మకం ఎక్కువ. అందుకు అమ్మమ్మ మద్దతు దొరికింది. సామాజిక అసమానతలు, కట్టుబాట్లు తన కూతురి భవిష్యత్తును నిర్దేశించకూడదన్నది అమ్మ సంకల్పం. అందులో భాగంగా 1995లో తొలిసారి నాకు హియరింగ్ డివైజ్ కొని తెచ్చింది. అధునాతన సాంకేతికతో కూడిన మల్టీచానల్, డిజిటల్ డివైజ్‌లు మార్కెట్‌లోకి రాగానే అవి మా ఇంట్లో ఉండేవి. నా ఎదుగుదలలో వాటి పాత్ర అమూల్యం. అయితే నా వైకల్యం వల్ల చాలాచోట్ల అవహేళనలు ఎదుర్కొన్నా. వినికిడి శక్తిలేనివారు ఈ ప్రపంచంతో పోటీ పడలేరని ఎంతోమంది ముఖం మీదే అన్నారు. ఆ క్షణం బాధ కలిగినా, క్రమంగా నాకు నేను ధైర్యం చెప్పుకున్నా. నన్ను చులకన చేసినవారికి, నా సామర్థ్యాన్ని తక్కువ చేసి మాట్లాడినవారికి, నన్ను ఇంటి నుంచి గెంటేసిన కన్న తండ్రికి గట్టిగా సమాధానం చెప్పాలని నిర్ణయించుకున్నా.

ఒకటి కాదు... ఎన్నో...

నాకు మాటలు రావడమే కష్టమన్నారు. కానీ మాతృభాషతో పాటు హిందీ, ఇంగ్లీష్ కూడా నేర్చుకున్నా. వాటిల్లో అనర్గళంగా మాట్లాడగలుగుతున్నా. నాలాంటివారికి చదువే వంటబట్టదన్నారు. చదువుతో పాటు భరతనాట్యం చేర్చుకున్నా. అదీ ఐదేళ్ల కోర్సు మూడేళ్లలోనే పూర్తి చేశా. పలు ప్రదర్శనలు కూడా ఇచ్చాను. హిందుస్థానీ సంగీతం అభ్యసించాను. హార్మోనియం వాయిస్తాను. సంబంధిత పరీక్షలు కూడా పూర్తి చేశాను. నా ఈ తపన కేవలం బతకడానికే కాదు... విజయం వైపు అడుగులు వేయడానికి. నలుగురిలో నన్ను నేను ప్రత్యేకంగా నిలుపుకోవడానికి. నాలాంటివారికి నేనొక స్ఫూర్తిమంత్రం కావాలి. అన్నిటికీ మించి మా అమ్మ, అమ్మమ్మ నన్ను చూసి గర్వపడాలి.

వారిలో ధైర్యం నింపేందుకు...

చదువుకొనే రోజుల్లో నాకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తానంటే వద్దన్నాను. అది నా వైకల్యాన్ని గుర్తు చేస్తుంది. సాధారణ విద్యార్థులతో పోటీపడి చదివాను. 2014లో ఇంజనీరింగ్ పూర్తి చేశాను. సమాజంలో వివక్ష ఎదుర్కొంటున్న ఆడపిల్లలకు, వైకల్యం గల పిల్లలకు అండగా నిలబడాలన్న ఉద్దేశంతో ఖాళీ సమయాల్లో వారికి పాఠాలు చెబుతున్నాను. తమలోని లోపాలను చూసుకొని వెనకడుగు వేయకుండా, దాన్ని ఒక సవాలుగా తీసుకొని ప్రయత్నిస్తే ఎంతటి లక్ష్యమైనా దరి చేరుతుంది. ఈ విషయం మరింత అర్థమయ్యేలా వీధి నాటకాలు, నాట్య ప్రదర్శనలు ఇస్తున్నాను. ఎందుకంటే నేను ఎదిగితే సరిపోదు... నా చుట్టూ ఉన్నవారు కూడా అభివృద్ధి పథంలో పయనించాలి. అదే నా సంకల్పం."

'రోల్‌మోడల్...'

వినికిడిశక్తి లేని ఒక అమ్మాయిగా నాకు కొన్ని పరిమితులు ఉండవచ్చు. కానీ నా ప్రతిభ, సామర్థ్యాలతో వాటిని అధిగమించాను. ఇప్పుడు నేను డ్యాన్స్ చేయగలను. సంగీతం ఆలపించగలను. బొమ్మలు గీయగలను. ఇంకా ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్... అన్నిట్లో నైపుణ్యం సంపాదించాను. నా ప్రతిభ, సామాజిక స్పృహను గుర్తించి గుజరాత్ ప్రభుత్వం 'సర్వశిక్ష అభియాన్' ప్రచార కార్యక్రమాలకు నన్ను రోల్ మోడల్‌గా నియమించింది. అలాగే 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్', 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు దక్కింది. 'రోల్‌మోడల్ హియరింగ్ ఇంపెయిర్డ్ ఫిమేల్' అవార్డును నాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదగా అందుకోవడం నా జీవితంలోనే ఒక మధురమైన ఘట్టం. యూకేలోని 'వరల్డ్ రికార్డ్ యూనివర్సిటీ' గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది.



మేకప్

రాత్రి వేడుకల్లో వెలిగిపోయేలా...



పగటి వెలుగుకూ, రాత్రి వేళ లైట్ల వెలుగుకూ తేడా ఉంటుంది. కాబట్టి ఆ వెలుగుకు తగ్గట్టు మేకప్ వేసుకుంటే సహజసిద్ధ అందంతో మెరిసిపోవచ్చు. అందుకోసం...

● **లిప్‌స్టిక్:** పగటి వేళ న్యూడ్, బీజ్ లాంటి రంగులతో వీలైనంత తేలికపాటి మేకప్‌తో సరిపెట్టుకోవచ్చు. కానీ రాత్రి వేళ లేత రంగులు లైట్ల వెలుగుకు వెలాతెలా పోతాయి. కాబట్టి ముదురు ఎరుపు రంగు లిప్‌స్టిక్స్ మాత్రమే ఎంచుకోవాలి. ఎరుపు, ముదురు గోధుమ రంగు లిప్‌స్టిక్స్ బాగుంటాయి.

● **ఐ షాడో:** లైట్ల వెలుగుకు ఐషాడో ప్రతిఫలించేలా చూసుకోవాలి. అందుకోసం గ్లిట్టర్ వాడుకోవాలి. నీలం, పర్పుల్ గ్లిట్టర్స్ రాత్రి వేళ వేడుకలకు ఎంతో బాగా నప్పుతాయి. ఇవి ధరించే డ్రస్సుతో సరిపోయేలా చూసుకోవాలి.

● **చెక్కుచెదరకుండా:** మేకప్ చెక్కుచెదరకుండా ఉండడం కోసం మేకప్ సెట్టింగ్ స్ప్రే వాడుకోవాలి. లేదంటే, ఫౌండేషన్ మీద కాంపాక్ట్ పౌడర్ అద్దుకోవాలి. అలాగే బేస్ చెదిరిపోకుండా ఉండడం కోసం కొంత ఫౌండేషన్, బ్యూటీ బ్లెండర్ కలిపి వాడుకోవాలి.

● **ఐలైనర్:** మేకప్ (లుక్ అదిరిపోవాలంటే కనురెప్పలకు నియాన్ ఐలైనర్ వేయాలి.

● **చెక్కినట్టు:** ముక్కు, చుబుకం, కనుబొమలు స్పష్టంగా చెక్కినట్టు కనిపించడం కోసం బ్రాంజర్‌తో కాంటూర్ చేసుకోవాలి.

● **బ్లషర్:** సాధారణంగా బ్లషర్ కొన్ని గంటలకే చెదిరిపోతూ ఉంటుంది. కాబట్టి చెక్కిళ్లకు కూడా బ్లషర్ అప్లై చేయడం మర్చిపోకూడదు.

● **ఐ ల్యాషెస్:** కృత్రిమ కనురెప్పలు ఉపయోగించవచ్చు. ఇష్టం లేకపోతే డ్రమాటిక్ మస్కారా అప్లై చేయాలి.

● **హైలైటర్:** చెక్కిళ్లు, బ్రో బోన్ మీద అద్దుకోవాలి.

స్పోర్ట్స్
విజయవాడ ● శనివారం 22 మార్చి 2025

వేసవిలో మస్తు మజా!

నేటి నుంచే ఐపీఎల్

తొలి మ్యాచ్‌లో కేకేఆర్ X ఆర్‌సీబీ

రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



ధోనీకిదే ఆఖరా?

గత రెండేళ్లుగా ఐపీఎల్ ఆరంభమైనప్పుడల్లా సీఎస్‌కే మూలస్తంభం ఎంఎస్ ధోనీకిదే చివరిదా? అనే సందేహం పరిపాటిగా మారింది. 43 ఏళ్ల ఈ వెటరన్ అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమై ఐదేళ్లు కావస్తున్నా.. ఇప్పటికీ తన చరిష్మా ఏమాత్రం తగ్గలేదు. ఐపీఎల్‌లో మాత్రమే ఆడుతుండడంతో దేశంలోని ఏ స్టేడియానికి వెళ్లినా అతడి కోసం ప్రేక్షకులు భారీగా తరలివస్తున్నారు. జట్టులో ధోనీ ఉండడం అటు సీఎస్‌కేకు కూడా కొండంత బలంగా మారింది. క్రికెట్‌పై అతడికున్న అవగాహన, తిరుగులేని వ్యూహాలు, ఫీల్డింగ్ మార్పులు, మెరుపు ఆటతో మ్యాచ్‌ను ముగించే తీరు ధోనీని విలువైన ఆటగాడిగా మార్చాయి. ఇప్పటికీ అద్భుత ఫిట్‌నెస్‌తో కనిపిస్తున్న ఈ చెన్నై 'తలా' తాజా సీజన్‌తో ఐపీఎల్‌ను ముగించవచ్చని బలంగా విశ్వసిస్తున్నారు.

టీ20 బరిలోకి రో-కో



గతేడాది టీ20 ప్రపంచకప్ విజయంతో స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఈ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. ఆ తర్వాత మళ్లీ ధనాధన్ పోరు కోసం ఈ జోడీ బరిలోకి దిగనుండడం ఇదే మొదటిసారి. అందుకే అందరి దృష్టి వీరిపైనే ఉంది. 2024 సీజన్‌లో కోహ్లీ 741 రన్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అయితే రోహిత్ మాత్రం అంచనాలను అందుకోలేకపోయాడు. ఈసారి తన ట్రేడ్ మార్క్ షాట్లతో విరుచుకుపడి ముంబైకి అండగా నిలవాలనుకుంటున్నాడు. బహుశా హిట్‌మ్యాన్‌కు కూడా ఇదే చివరి ఐపీఎల్ కావచ్చనే భావనలో ఉన్నారు.

మారిన ఆటగాళ్లు, నిబంధనలు

ఈసారి కొత్త కొత్తగా..

ఐదు జట్లకు నూతన కెప్టెన్లు

మండు వేసవిలో భానుడి భగభగలతో అలసిపోయే అభిమానులు..ఆటగాళ్ల విన్యాసాలతో హాయిగా సేద తీరే సమయం వచ్చేసింది. టీమిండియా చాంపియన్స్ ట్రోఫీ విజయ సంబరాలు ఇంకా సద్దుమణగక ముందే.. క్రికెట్ ప్రేమికులకు మరింత హుషారునిస్తూ ఇండియన్ ప్రీమియర్ లీగ్ దూసుకొచ్చింది. ప్రపంచ క్రికెట్‌ను సమ్మోహితం చేసే ఈ మెగా లీగ్ నేడే మొదలవనుంది.

కొత్త కెప్టెన్లు, మారిన ఆటగాళ్లు, నిబంధనలు.. ఇలాంటి అంశాలతో ఈసారి లీగ్ సరికొత్తగా ముస్తాబై మన ముందుకొచ్చింది. భారీ వేలంలో స్టార్ ఆటగాళ్లు ఫ్రాంచైజీలను మార్చగా, కొందరు కెప్టెన్లు పాత జట్లకు వీడ్కోలు పలికారు. చాంపియన్స్ ట్రోఫీలో కలిసికట్టుగా కదం తొక్కిన మన క్రికెటర్లు, ఇప్పుడు విడివిడిగా పోటీ పడనున్నారు. అయితేనేం.. బ్యాటర్లు, బౌలర్లు, ఫీల్డర్ల మెరుపులతో ఆఖరి బంతి వరకు ఉత్కంఠగా సాగే ప్రతీ మ్యాచ్‌ను ఆస్వాదించేందుకు అభిమానులంతా సిద్ధం కండి!

కోల్‌కతా: ఏళ్లుగా వన్నె తరగని ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌కు నేడు తెర లేవనుంది. దాదాపు రెండు నెలలపాటు ఉర్రూతలూగించే ఈ లీగ్ మే 25న ఫైనల్‌తో ముగుస్తుంది. పది జట్లు మొత్తంగా 74 మ్యాచ్‌లు ఆడబోతున్నాయి. శనివారం నాటి ప్రారంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) జట్టుతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తలపడనుంది. గత సీజన్ల మాదిరిగా కాకుండా ఈసారి మాత్రం ఐపీఎల్ అభిమానులకు కాస్త విభిన్నంగా కనిపించనుంది. ఎందుకంటే.. కొన్నేళ్లుగా అలవాటు పడిన జట్లకు కాకుండా వేలం కారణంగా చాలా మంది ఇతర ఫ్రాంచైజీల తరఫున బరిలోకి దిగనున్నారు. అలాగే ఇప్పటికే కొనసాగుతున్న నిబంధనలకు తోడు మరికొన్నింటిని జత చేశారు. ముఖ్యంగా ఈ సీజన్ నుంచి బంతికి ఉమ్మి రాయడంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయడంతో పేసర్లు అత్యంత ప్రభావం చూపే అవకాశం ఉంది. మంచు ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అంపైర్ల అంగీకారంతో బంతిని మార్చే వెసులుబాటు కూడా ఉంది. అలాగే ఎత్తు వైడ్లు, ఆఫ్‌స్టంప్ ఆవల వైడ్లను తేల్చేందుకు డీఆర్ఎస్‌ను వినియోగించనున్నారు. ఈ మార్పులన్నీ కూడా మ్యాచ్‌లను రసవత్తరంగా మార్చేవే.

కెప్టెన్ల మార్పుతో రాత మారేనా?




ఎన్నడూ లేని విధంగా ఈసారి ఐపీఎల్‌లో తొమ్మిది జట్లకు స్వదేశీ ఆటగాళ్లే సారథులుగా ఉండబోతున్నారు. ఒక్క సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు మాత్రమే విదేశీ కెప్టెన్‌గా ప్యాట్ కమిన్స్ కొనసాగుతున్నాడు. మరోవైపు ఐదు జట్లను కొత్త కెప్టెన్లు నడిపించబోతున్నారు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఉన్నప్పటికీ ఆర్‌సీబీ రజత్ పటీదార్‌ను తమ నాయకుడిగా ఎంచుకుంది. తను ఇప్పటి వరకు భారత్ తరఫున ఈ ఫార్మాట్‌లో అరంగేట్రం చేయకపోవడం గమనార్హం. అలాగే రాహుల్ అనాసక్తితో ఢిల్లీ క్యాపిటల్స్ సారథ్య బాధ్యతలను స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ తీసుకున్నాడు. చివరి సీజన్‌లో కేకేఆర్‌ను విజేతగా నిలిపిన కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్.. ఈసారి తన జట్టు పంజాబ్ కింగ్స్ పవరేంటో చూపాలనుకుంటున్నాడు. మరోవైపు డిఫెండింగ్ చాంప్ కోల్‌కతా పగ్గాలు అనూహ్యంగా అజింక్యా రహానెకు దక్కాయి. ఢిల్లీకి దూరమైన రిషభ్ పంత్.. సారథిగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ రాత మార్చాలని పట్టుదలగా ఉన్నాడు. ఇక, తమ ఆరంభ మ్యాచ్‌ల్లో రాజస్థాన్ రాయల్స్‌కు రియాన్ పరాగ్, ముంబై ఇండియన్స్‌కు సూర్యకుమార్ నేతృత్వం వహిస్తుండడం విశేషం.



రజత్ పటీదార్

వరుణుడితో ఇబ్బందే..



అభిమానుల సందడి ఎలా ఉన్నా వారి ఉత్సాహంపై వరుణుడు నీళ్లుజల్లే అవకాశం ఉంది. వాతావరణ శాఖ కోల్‌కతా రీజియన్‌లో ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేయడమే ఇందుకు కారణం. దీంతో శనివారం కోల్‌కతా నైట్‌రైడర్స్-బెంగళూరు రాయల్ చాలెంజర్స్ ఆరంభ మ్యాచ్‌ను ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం ఇబ్బందిపెట్టే అవకాశం ఉంది. శుక్రవారం కూడా ఇరు జట్లు ప్రాక్టీస్ సెషన్‌ను పూర్తి చేయలేకపోయాయి. అలాగే టాస్‌కు ముందు జరిగే ఆరంభ వేడుకలపైనా వర్షం ప్రభావం చూపనుంది. ఇక లీగ్ దశలో మ్యాచ్‌లకు అదనంగా గంటపాటు సమయం కేటాయిస్తారు. దీంతో ఐదు ఓవర్ల మ్యాచ్ అర్ధరాత్రి 12 గంటల్లోపు ముగియాలి. ఒక వేళ వర్షంతో మ్యాచ్ రద్దయితే చెరో పాయింట్‌ను ఇస్తారు.

లఖ్‌నవూ తరఫున శార్దూల్!



వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలిన పేస్ ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ లఖ్‌నవూ తరఫున బరిలోకి దిగనున్నాడు. గాయపడిన పేసర్ మొహిసిన్ ఖాన్ స్థానంలో అతడిని తీసుకున్నారు. అయితే ఇప్పటికే జట్టు సన్నాహకాల్లో పాల్గొంటున్నప్పటికీ లఖ్‌నవూ జట్టు శార్దూల్ పేరును ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. గత వేలంలో చెన్నై జట్టు అతడిని రిటైన్ చేసుకోలేదు. అయితే దేశవాళీల్లో శార్దూల్ తన ఆల్‌రౌండ్ ప్రతిభతో అదరగొట్టిన విషయం తెలిసిందే.

కేన్ కొత్త అవతారం

ఐపీఎల్ కామెంటేటర్‌గా విలియమ్సన్

44 మందితో జాబితా విడుదల



న్యూఢిల్లీ: ఈసారి ఐపీఎల్ వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలిన న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ కొత్త అవతారంలో కనిపించనున్నాడు. గత సీజన్‌లో గుజరాత్ టైటాన్స్‌కు ఆడిన కేన్‌ను ఆ ఫ్రాంచైజీ రిటైన్ చేసుకోలేదు. దాంతో మెగా వేలం బరిలో నిలిచిన 34 ఏళ్ల విలియమ్సన్‌ను ఏ జట్టూ కొనుగోలు చేయలేదు. ఈనేపథ్యంలో వ్యాఖ్యాతగా మారాలని అతడు నిశ్చయించుకున్నాడు. శనివారం మొదలయ్యే ఐపీఎల్‌కు ఇంగ్లీష్, హిందీ భాషల వ్యాఖ్యాతల జాబితాను స్టార్ స్పోర్ట్స్ విడుదల జేసింది. ఇందులో కేన్ విలియమ్సన్ కామెంటేటర్‌గా మెగా లీగ్‌లో కొత్త ఇన్నింగ్స్ మొదలుపెట్టనున్నాడు. అలాగే సుదీర్ఘకాలం ఐసీసీ ప్యానెల్ అంపైర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన 60 ఏళ్ల అనిల్ చౌధరి ఇటీవల రిటైర్ అయ్యాడు. అతడు హిందీ వ్యాఖ్యాతగా కెరీర్ ప్రారంభించనున్నాడు. ఇంగ్లీష్‌లో 27 మంది, హిందీలో 17 మంది మాజీలు తమ కామెంట్రీతో అలరించనున్నారు. గవాస్కర్, రవిశాస్త్రి, సంజయ్ మంజ్రేకర్, దీప్‌దాస్ గుప్తా రెండు భాషల్లోనూ వ్యాఖ్యానం చేస్తారు.

ప్రారంభోత్సవానికి అదిరే ఏర్పాట్లు: ఐపీఎల్ ప్రారంభ కార్యక్రమానికి బీసీసీఐ విస్తృత ఏర్పాట్లు చేసింది. టాస్ వేయడానికి గంట ముందు.. అంటే సాయంత్రం 6 గంటలకు ఈడెన్ గార్డెన్స్‌లో ఆరంభోత్సవాన్ని నిర్వహించనున్నట్టు బెంగాల్ క్రికెట్ సంఘం చీఫ్ స్నేహాశీష్ గంగూలీ వెల్లడించాడు. 35 నిమిషాల పాటు సాగే వేడుకల్లో ప్రఖ్యాత గాయని శ్రేయా ఘోషల్, పంజాబ్ గాయకుడు కరణ్ అహూజా తమ పాటలతో ఉర్రూతలూగించనున్నారు. బాలీవుడ్ అందాల భామ దిశా పటాని తన నృత్యంతో ప్రేక్షకులను సమ్మోహితులను చేయనుంది.

షెడ్యూల్

తేదీ	ప్రత్యర్థులు	వేదిక	సమయం
మార్చి 22	కోల్‌కతాXబెంగళూరు	కోల్‌కతా	రా.7.30
మార్చి 23	హైదరాబాద్Xరాజస్థాన్	హైదరాబాద్	మ.3.30
మార్చి 23	చెన్నైXముంబై	చెన్నై	రా.7.30
మార్చి 24	ఢిల్లీXలఖ్‌నవూ	విశాఖపట్నం	రా.7.30
మార్చి 25	గుజరాత్Xపంజాబ్	అహ్మదాబాద్	రా.7.30
మార్చి 26	రాజస్థాన్Xకోల్‌కతా	గువాహటి	రా.7.30
మార్చి 27	హైదరాబాద్Xలఖ్‌నవూ	హైదరాబాద్	రా.7.30
మార్చి 28	చెన్నైXబెంగళూరు	చెన్నై	రా.7.30
మార్చి 29	గుజరాత్Xముంబై	అహ్మదాబాద్	రా.7.30
మార్చి 30	ఢిల్లీXహైదరాబాద్	విశాఖపట్నం	మ.3.30
మార్చి 30	రాజస్థాన్Xచెన్నై	గువాహటి	రా.7.30
మార్చి 31	ముంబైXకోల్‌కతా	ముంబై	రా.7.30
ఏప్రిల్ 1	లఖ్‌నవూXపంజాబ్	లఖ్‌నవూ	రా.7.30
ఏప్రిల్ 2	బెంగళూరుXగుజరాత్	బెంగళూరు	రా.7.30
ఏప్రిల్ 3	కోల్‌కతాXహైదరాబాద్	కోల్‌కతా	రా.7.30
ఏప్రిల్ 4	లఖ్‌నవూXముంబై	లఖ్‌నవూ	రా.7.30
ఏప్రిల్ 5	చెన్నైXఢిల్లీ	చెన్నై	మ.3.30
ఏప్రిల్ 5	పంజాబ్Xరాజస్థాన్	చండీగఢ్	రా.7.30
ఏప్రిల్ 6	కోల్‌కతాXలఖ్‌నవూ	గువాహటి	మ.3.30
ఏప్రిల్ 6	హైదరాబాద్Xగుజరాత్	హైదరాబాద్	రా.7.30
ఏప్రిల్ 7	ముంబైXబెంగళూరు	ముంబై	రా.7.30
ఏప్రిల్ 8	పంజాబ్Xచెన్నై	చండీగఢ్	రా.7.30
ఏప్రిల్ 9	గుజరాత్Xరాజస్థాన్	అహ్మదాబాద్	రా.7.30
ఏప్రిల్ 10	బెంగళూరుXఢిల్లీ	బెంగళూరు	రా.7.30
ఏప్రిల్ 11	చెన్నైXకోల్‌కతా	చెన్నై	రా.7.30
ఏప్రిల్ 12	లఖ్‌నవూXగుజరాత్	లఖ్‌నవూ	మ.3.30
ఏప్రిల్ 12	హైదరాబాద్Xపంజాబ్	హైదరాబాద్	రా.7.30
ఏప్రిల్ 13	రాజస్థాన్Xబెంగళూరు	జైపూర్	మ.3.30
ఏప్రిల్ 13	ఢిల్లీXముంబై	ఢిల్లీ	రా.7.30
ఏప్రిల్ 14	లఖ్‌నవూXచెన్నై	లఖ్‌నవూ	రా.7.30
ఏప్రిల్ 15	పంజాబ్Xకోల్‌కతా	చండీగఢ్	రా.7.30
ఏప్రిల్ 16	ఢిల్లీXరాజస్థాన్	ఢిల్లీ	రా.7.30
ఏప్రిల్ 17	ముంబైXహైదరాబాద్	ముంబై	రా.7.30
ఏప్రిల్ 18	బెంగళూరుXపంజాబ్	బెంగళూరు	రా.7.30
ఏప్రిల్ 19	గుజరాత్Xఢిల్లీ	అహ్మదాబాద్	మ.3.30
ఏప్రిల్ 19	రాజస్థాన్Xలఖ్‌నవూ	జైపూర్	రా.7.30
ఏప్రిల్ 20	పంజాబ్Xబెంగళూరు	చండీగఢ్	మ.3.30
ఏప్రిల్ 20	ముంబైXచెన్నై	ముంబై	రా.7.30
ఏప్రిల్ 21	కోల్‌కతాXగుజరాత్	కోల్‌కతా	రా.7.30
ఏప్రిల్ 22	లఖ్‌నవూXఢిల్లీ	లఖ్‌నవూ	రా.7.30
ఏప్రిల్ 23	హైదరాబాద్Xముంబై	హైదరాబాద్	రా.7.30
ఏప్రిల్ 24	బెంగళూరుXరాజస్థాన్	బెంగళూరు	రా.7.30
ఏప్రిల్ 25	చెన్నైXహైదరాబాద్	చెన్నై	రా.7.30
ఏప్రిల్ 26	కోల్‌కతాXపంజాబ్	కోల్‌కతా	రా.7.30
ఏప్రిల్ 27	ముంబైXలఖ్‌నవూ	ముంబై	మ.3.30
ఏప్రిల్ 27	ఢిల్లీXబెంగళూరు	ఢిల్లీ	రా.7.30
ఏప్రిల్ 28	రాజస్థాన్Xగుజరాత్	జైపూర్	రా.7.30
ఏప్రిల్ 29	ఢిల్లీXకోల్‌కతా	ఢిల్లీ	రా.7.30
ఏప్రిల్ 30	చెన్నైXపంజాబ్	చెన్నై	రా.7.30
మే 1	రాజస్థాన్Xముంబై	జైపూర్	రా.7.30
మే 2	గుజరాత్Xహైదరాబాద్	అహ్మదాబాద్	రా.7.30
మే 3	బెంగళూరుXచెన్నై	బెంగళూరు	రా.7.30
మే 4	కోల్‌కతాXరాజస్థాన్	కోల్‌కతా	మ.3.30
మే 4	పంజాబ్Xలఖ్‌నవూ	ధర్మశాల	రా.7.30
మే 5	హైదరాబాద్Xఢిల్లీ	హైదరాబాద్	రా.7.30
మే 6	ముంబైXగుజరాత్	ముంబై	రా.7.30
మే 7	కోల్‌కతాXచెన్నై	కోల్‌కతా	రా.7.30
మే 8	పంజాబ్Xఢిల్లీ	ధర్మశాల	రా.7.30
మే 9	లఖ్‌నవూXబెంగళూరు	లఖ్‌నవూ	రా.7.30
మే 10	హైదరాబాద్Xకోల్‌కతా	హైదరాబాద్	రా.7.30
మే 11	పంజాబ్Xముంబై	ధర్మశాల	మ.3.30
మే 11	ఢిల్లీXగుజరాత్	ఢిల్లీ	రా.7.30
మే 12	చెన్నైXరాజస్థాన్	చెన్నై	రా.7.30
మే 13	బెంగళూరుXహైదరాబాద్	బెంగళూరు	రా.7.30
మే 14	గుజరాత్Xలఖ్‌నవూ	అహ్మదాబాద్	రా.7.30
మే 15	ముంబైXఢిల్లీ	ముంబై	రా.7.30
మే 16	రాజస్థాన్Xపంజాబ్	జైపూర్	రా.7.30
మే 17	బెంగళూరుXకోల్‌కతా	బెంగళూరు	రా.7.30
మే 18	గుజరాత్Xచెన్నై	అహ్మదాబాద్	మ.3.30
మే 18	లఖ్‌నవూXహైదరాబాద్	లఖ్‌నవూ	రా.7.30
మే 20	క్వాలిఫయర్-1	హైదరాబాద్	రా.7.30
మే 21	ఎలిమినేటర్	హైదరాబాద్	రా.7.30
మే 23	క్వాలిఫయర్-2	కోల్‌కతా	రా.7.30
మే 25	ఫైనల్	కోల్‌కతా	రా.7.30

సెమీస్‌కు గాయత్రి జోడీ

రెండో ర్యాంకర్‌కు శంకర్ షాక్ ● స్విస్ ఓపెన్



బాసెల్ (స్విట్జర్లాండ్): డబుల్స్ స్టార్ జోడీ పుల్లెల గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ స్విస్ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తోంది. ఈ ఏస్ జంట మహిళల డబుల్స్‌లో సెమీఫైనల్ చేరింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో 4వ సీడ్ గాయత్రి/ట్రీసా ద్వయం 21-18, 21-14తో హాంకాంగ్ జంట యంగ్ గా టింగ్/యంగ్ పూ లామ్‌పై గెలిచింది. ఫైనల్లో చోటుకోసం చైనాకు చెందిన టాప్‌సీడ్ ద్వయం లూ షెంగ్ షు/టాన్ నింగ్‌తో గాయత్రి జోడీ తలపడనుంది. ఇక, పురుషుల సింగిల్స్‌లో భారత యువ షట్లర్ శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ తన కెరీర్‌లోనే తొలిసారిగా సంచలనాత్మక ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. తమిళనాడుకు చెందిన 21 ఏళ్ల శంకర్ 18-21, 21-12, 21-5తో మూడుసార్లు ప్రపంచ చాంపియన్‌షిప్ పతక విజేత, అంటోన్సెన్ (డెన్మార్క్)ను కంగుతినిపించి క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లాడు. గంటకుపైగా సాగిన హోరాహోరీ పోరులో ఆరంభ గేమ్‌ను కోల్పోయిన శంకర్.. అద్భుతంగా పుంజుకొని తర్వాతి రెండు గేముల్లో ప్రత్యర్థిని చిత్తుగా ఓడించాడు. సెమీఫైనల్ బెర్త్ కోసం ఫ్రాన్స్‌కు చెందిన 31వ ర్యాంకర్ క్రిస్టో పోపోవ్‌తో శంకర్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. ఇక, మిక్స్‌డ్ డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో భారత జోడీ ఆద్య/సతీశ్14-21, 16-21తో చైనీస్ తైపీ జంట లూ కువాంగ్ హెంగ్/జెంగ్ యూ చీ చేతిలో ఓటమిపాలై ఇంటిబాట పట్టింది.

చాలెంజర్ ట్రోఫీకి ఏడుగురు తెలుగోళ్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): బీసీసీఐ సీనియర్ మహిళల చాలెంజర్ ట్రోఫీకి ఏడుగురు తెలుగు క్రికెటర్లు ఎంపికయ్యారు. ఈనెల 25 నుంచి వచ్చేనెల 8 వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే ఈ టోర్నీలో పోటీపడే నాలుగు జట్లను బీసీసీఐ ప్రకటించింది. ఆంధ్ర నుంచి శరణ్య (టీమ్-డి), ఎండీ షబ్నం (టీమ్-సి), శ్రీచరణి (టీమ్-బి), హెన్రీటా, పావని (టీమ్-ఎ), తెలంగాణ నుంచి జి.త్రిష (టీమ్-డి), మమత (టీమ్-బి)కు చోటు దక్కింది.

ఖేలో ఇండియాలో ఆంధ్ర పాంచ్ పటాకా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా పారా క్రీడల్లో తొలిరోజు ఆంధ్ర అథ్లెట్లు 5 పతకాలు కొల్లగొట్టగా, తెలంగాణకు ఒక పతకం లభించింది. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఈ పోటీల్లో రవి (అనకాపల్లి) షాట్‌పుట్‌లో, రవణి (విశాఖపట్నం) 100 మీటర్ల రేసులో చెరో స్వర్ణం.. భవాని (నెల్లూరు) 100 పరుగులో, స్వరాజ్ (శ్రీకాకుళం) 100 మీటర్ల రేసులో చెరో రజతం.. బాబు (అనంతపురం) వీల్‌చైర్ షాట్‌పుట్‌లో రజతం సాధించారు. తెలంగాణ అథ్లెట్ శిరీష 100 మీటర్లలో రజతం నెగ్గింది.

హసన్ రికార్డు సెంచరీ

మూడో టీ20లో పాక్ గెలుపు



ఆక్లాండ్: తొలి రెండు టీ20లలో చిత్తుగా ఓడిన పాకిస్థాన్ కీలకమైన మూడో మ్యాచ్‌లో దుమ్మురేపింది. ఓపెనర్ హసన్ నవాజ్ (45 బంతుల్లో 10 ఫోర్లు, 7 సిక్స్‌లతో 105 నాటౌట్) రికార్డు సెంచరీతో కదం తొక్కడంతో..శుక్రవారం జరిగిన మూడో టీ20లో పాకిస్థాన్ తొమ్మిది వికెట్లతో నెగ్గింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆశలను సజీవంగా ఉంచుకుంది. తొలుత న్యూజిలాండ్ 19.5 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌటైంది. చాప్‌మన్ (94), బ్రేస్‌వెల్ (31) సత్తా చాటారు. రౌఫ్ మూడు, అబ్బాస్ అఫ్రీది, షహీన్ షా అఫ్రీది, అబ్రార్ అహ్మద్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో హసన్‌తోపాటు కెప్టెన్ సల్మాన్ ఆఘా (51 నాటౌట్), మరో ఓపెనర్ మహ్మద్ హారిస్ (41) చెలరేగడంతో పాకిస్థాన్ 16 ఓవర్లలోనే 207/1 స్కోరు చేసి ఘన విజయాన్నందుకుంది. హసన్ 44 బంతుల్లో మూడంకెల మార్క్ చేరడం ద్వారా పొట్టి ఫార్మాట్ వేగవంతమైన సెంచరీ చేసిన పాకిస్థాన్ బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు.

31లోపు రేషన్ కార్డుదారుల ఈకేవైసీ లేదంటే భవిష్యత్తులో ఇబ్బందులు

- పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాలు

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రేషన్ లబ్ధిదారుల ఈకేవైసీ ప్రక్రియను ఈనెల 31వ తేదీలోపు పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్ జిల్లాల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లాల కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులకు సర్క్యులర్ జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు, సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఈకేవైసీ ప్రక్రియను నూటికి నూరు శాతం పూర్తి చేయాల్సి ఉంది. రేషన్ డీలర్లు, తాహసీల్దార్లు, డీఎస్‌వోలు, కలెక్టర్ల (సివిల్ సప్లయిస్) లాగిన్‌లలో ఈకేవైసీ యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. గ్రామ, వార్డు సచివాలయాల మొబైల్ యాప్, రేషన్ షాపులోని ఈ-పోస్ పరికరాల ద్వారా ఈకేవైసీని అప్‌డేట్ చేసుకునే సౌకర్యం ఉంది. 5 సంవత్సరాల లోపు పిల్లలు మినహా మిగిలిన లబ్ధిదారులందరి ఈకేవైసీపీ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి. లేకపోతే రేషన్‌కార్డుదారులకు భవిషత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది' అని పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్చరికలు జారీ చేశారు.

3న మంత్రిమండలి సమావేశం

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఏప్రిల్ 3న జరగనుంది. రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. కేబినెట్ సమావేశానికి ఏప్రిల్ 1లోపు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు.

మళ్లీ ఆ కంపెనీలే..!

- ఆరోగ్య శాఖ శానిటేషన్, సెక్యూరిటీ టెండర్లలో ఇష్టారాజ్యం
- పాత కంపెనీలపై తీవ్ర ఆరోపణలు.. కోర్టు కేసులు
- అయినా మరోసారి టెండర్ల ప్రక్రియలో అర్హత

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వాసుపత్రుల్లో శానిటేషన్, సెక్యూరిటీ టెండర్ల ప్రక్రియ వివాదాస్పదంగా మారింది. ప్రస్తుతం సేవలు అందిస్తున్న కంపెనీలే మళ్లీ అర్హత సాధించేలా ఇష్టారాజ్యంగా నిబంధనలు పెట్టారనే ఆరోపణలు వస్తున్నాయి. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, సెకండరీ హెల్త్ డైరెక్టరేట్ పరిధిలో ఉన్న ఆస్పత్రుల్లో శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ నిర్వహణకు మొత్తం 18 ప్యాకేజీలకు టెండర్లు ఆహ్వానించారు. నాలుగైదు నెలలుగా ఈ ప్రక్రియ నడుస్తోంది. ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా జరుగుతున్న టెండర్ల ప్రక్రియలో అనేక గందరగోళాలు, కోర్టు కేసులు, ఫిర్యాదుల మధ్య అధికారులు దాదాపు 14 కంపెనీలకు సంబంధించిన ఫైనాన్సియల్ బిడ్ ఓపెన్ చేశారు. వచ్చే వారం ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు నేతృత్వంలో బిడ్ ఫైనలైజ్ కమిటీ ప్యాకేజీల వారీగా నిర్వహణ సంస్థలను ఎంపిక చేయనుంది. వివిధ స్థాయిల నుంచి ఒత్తిళ్లతో కొన్ని కంపెనీలకు, అధికారులకు నచ్చిన మరికొన్ని కంపెనీలకు అర్హత కలిగేలా టెండర్ల నిబంధనలు ఖరారు చేసుకున్నారు. ప్రస్తుతం డీఎంఈ పరిధిలోని ప్రభుత్వాసుపత్రుల్లో సేవలు అందిస్తున్న మూడు కంపెనీలు టెండర్లలో అర్హత సాధించాయి. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ జోన్లలో సేవలు అందిస్తున్న వీటిపై అనేక ఆరోపణలు, ఫిర్యాదులు ఉన్నాయి. ఈ కంపెనీలు టెండర్లలో పాల్గొనేందుకు అర్హత లేదని కొంతమంది కోర్టును ఆశ్రయించారు. దీంతో కౌంటర్ దాఖలు చేయాలని ఆరోగ్య శాఖను కోర్టు ఆదేశించింది.

ఇదీ కంపెనీల బాగోతం...

ఉత్తరాంధ్ర కంపెనీ గతంలో టెండర్లలో పాల్గొనే సమయంలో బోగస్ సర్టిఫికెట్లు పొందుపరిచినట్టు ఆరోపణలున్నాయి. ఓ ప్రముఖ మెడికల్ కాలేజీలో శానిటేషన్ సేవలందించినట్లు చూపించి టెండర్ దక్కించుకుంది. ఆ కంపెనీ తమ కాలేజీలో శానిటేషన్ పనులు నిర్వహించలేదని యాజమాన్యం స్పష్టం చేసింది. సదరు కంపెనీ నాలుగేళ్ల పాటు కోట్ల రూపాయలు బిల్లుల రూపంలో తీసుకుంది. అలాగే కోస్తాంధ్రకు చెందిన కంపెనీది మరో తీరు. టెండర్ నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, ప్రిన్సిపల్స్‌తో అగ్రిమెంట్లు చేసుకుంది. నిబంధనల ప్రకారం ప్రతి బోధనాసుపత్రిలో 294 మంది శానిటేషన్ వర్కర్లను నియమించుకోవాలి. కానీ 240 మందిని నియమించుకుంటే సరిపోతుందన్నట్టుగా అగ్రిమెంట్ చేసుకుంది. ఉద్యోగులను తగ్గించేసి పనులు చేయకుండా రూ.కోట్లు లాగేసింది. ఈ కంపెనీకి ఏపీఎంఎస్ఐడీసీలో టెండర్ ప్రక్రియ పర్యవేక్షించే అధికారి అండదండలు అందిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ కంపెనీపై కొంతమంది కోర్టును ఆశ్రయించారు. ఇక రాయలసీమలో శానిటేషన్ పనులు చేస్తున్న కంపెనీ ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వకుండా, పీఎఫ్, ఈఎస్ఐలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేసింది. కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని తిరుపతి కలెక్టర్.. ఎస్పీకి లేఖ రాశారు. అయినా ఆ కంపెనీ నుంచి స్పందన లేదు. దీంతో డీఎంఈ అధికారులు దాన్ని బ్లాక్‌లిస్ట్ చేశారు. దీనిపై సదరు కంపెనీ కోర్టులో స్టే తెచ్చుకుంది. 2016-19 మధ్యలో కూడా ఈ కంపెనీ వన్ సర్వీసెస్ పేరుతో శానిటేషన్ సేవలు అందించింది. అప్పుడు కూడా బ్లాక్‌లిస్ట్‌కు గురైంది. ఆ తర్వాత కంపెనీ పేరు మార్చుకుని మళ్లీ రాయలసీమ ప్రాంతం టెండర్లు దక్కించుకుంది.

పట్టించుకోని అధికారులు

అధికారులు బ్లాక్‌లిస్ట్ చేయడం వరకే తమ బాధ్యత, ఆ తర్వాత సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. బ్లాక్‌లిస్ట్‌పై స్టే తెచ్చుకున్నప్పుడు స్టే వెకేట్ చేయించి, టెండర్లలో అర్హత లేకుండా చేయాలి. కానీ ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం తమకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ అంశం కోర్టు పరిధిలో ఉంది. ఆరోగ్య శాఖ నుంచి కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. ఇప్పుడే టెండర్లు ఓపెన్ చేయవద్దని కోర్టు స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తోంది. అధికారులు మాత్రం ఫైనాన్సియల్ బిడ్ ఓపెన్ చేసేసి బీఎఫ్‌సీలో పెట్టేందుకు సిద్ధమయ్యారు. అధికారుల నిర్ణయంపై మళ్లీ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. కోర్టు తీర్పు వెలువరించాల్సి ఉంది.

పెట్రోలియం వర్సిటీ పనుల్లో జాప్యం

- పార్లమెంటరీ కమిటీ అసంతృప్తి
- ఐఐపీఈ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయండి
- కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు

న్యూఢిల్లీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ (ఐఐపీఈ) విశ్వవిద్యాలయం ఏర్పాటులో జరుగుతున్న జాప్యంపై పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖకు చెందిన పార్లమెంటరీ కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. వర్సిటీ భవనాల నిర్మాణానికి అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం వంగలి గ్రామంలో స్థలం కేటాయించినా.. నిర్మాణంలో జాప్యం జరుగుండటంతో 2016 నుంచీ ఈ సంస్థ క్యాంపస్.. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీలోనే తాత్కాలికంగా నడుస్తోందని ఈ కమిటీ పేర్కొంది. ఐఐపీఈ సంస్థ నిర్మాణానికి అవసరమైన 201.80 ఎకరాలను న్యాయవివాదం తర్వాత ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు మార్చి 2023లోనే అప్పగించారని, కేవలం 46 శాతం నిర్మాణ పనులే పూర్తయ్యాయని కమిటీ పేర్కొంది. ఈ సంస్థ నిర్మాణానికి డీపీఆర్‌ను రూపొందించే బాధ్యతను 2024 ఆగస్టులో ఈడీసీఐఎల్‌కు అప్పగించారని తెలిపింది. ప్రాజెక్టు నిర్మాణ పనులు అలస్యమవుతున్నందున ప్రభుత్వం 2025-26లో కేటాయింపులు చేయలేదని, 2024-25లో రూ.168 కోట్లు కేటాయించినా.. తర్వాత రూ.88 కోట్లకు తగ్గించారని కమిటీ దృష్టికి వచ్చింది. ఈ మొత్తాన్ని కూడా 2024-25లో ఉపయోగించలేదని తెలిపింది. భూసేకరణ ఆలస్యం వల్ల ఖర్చు పెరిగిందని, నిధులు కేటాయించి పనులు పూర్తయ్యేలా చూడాలని కమిటీ కేంద్రాన్ని కోరింది.

లగ్జరీ వాచీలకు భలే గిరాకీ


బ్రైట్లింగ్ ఇండియా ఎండీ ప్రదీప్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత్‌లో ఖరీదైన వాచీలకు రోజు రోజుకు డిమాండ్ పెరిగిపోతోందని స్విట్జర్లాండ్‌కు చెందిన వాచీల తయారీ సంస్థ బ్రైట్లింగ్ వెల్లడించింది. దేశీయంగా కొనుగోలు శక్తి పెరుగుతుండటం, నవతరం కొత్త, ఖరీదైన ఉత్పత్తులపై ఆసక్తి చూపిస్తుండటంతో ఈ మార్కెట్ ఏటా 15 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేస్తూ వస్తోందని బ్రైట్లింగ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ప్రదీప్ భానోట్ వెల్లడించారు. ప్రస్తుతం స్విట్జర్లాండ్ నుంచి ఏటా రూ.2,500 కోట్ల విలువైన లగ్జరీ వాచీలు దిగుమతి అవుతున్నాయన్నారు. లగ్జరీ వాచీల మార్కెట్లో బ్రైట్లింగ్‌తో పాటు మరో రెండు స్విస్ వాచీ కంపెనీలు కీలకంగా ఉన్నాయన్నారు. లగ్జరీ వాచీ మార్కెట్లో బ్రైట్లింగ్ మార్కెట్ వాటా 10 శాతానికి పైగా ఉందని ప్రదీప్ తెలిపారు. బ్రైట్లింగ్ వాచీల ధర రూ.3.15 లక్షల నుంచి ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు. కాగా 2023లో కంపెనీ దేశంలోనే తొలి ఔట్‌లెట్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించిందన్నారు. ఆ తర్వాత చెన్నై, పుణె, బెంగళూరుకు కార్యకలాపాలను విస్తరించినట్లు ఆయన వివరించారు. కాగా విస్తరణలో భాగంగా వచ్చే ఏడాదిన్నర కాలంలో మరో 6 ఔట్‌లెట్స్‌ను ప్రారంభించాలని నిర్ణయించినట్లు ప్రదీప్ తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ			
హైదరాబాద్	420	విజయవాడ	440
వరంగల్	422	గోదావరి	420
చిత్తూరు	470	విశాఖపట్నం	420
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	96	విజయవాడ	105
వరంగల్	96	గుంటూరు	103
కరీంనగర్	96	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	96	చిత్తూరు	82
కర్నూలు	96	నెల్లూరు	87
విశాఖపట్నం	99	అనంతపురం	87
గోదావరి	105		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	90,220 ▼	82,700 ▼	1,12,000 ▼
విజయవాడ	91,300 ▼	86,500 ▼	1,00,000 ▼
విశాఖపట్నం	88,610 ▼	81,230 ▼	98,740 ▼
రాజమండ్రి	90,220 ▼	82,700 ▼	1,00,700 ▼
ప్రొద్దుటూరు	90,200 ▼	83,530 ▼	1,00,200 ▼
ముంబై	88,169 ▼	80,763 ▼	97,620 ▼

బోగస్ ఫిన్ఇన్‌ఫ్లుయెన్సర్లపై సెబీ వేటు



70,000 సోషల్ మీడియా ఖాతాలు క్లోజ్

ముంబై: క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ.. అనధికారిక పెట్టుబడి సలహాదారుల (ఫిన్ఇన్‌ఫ్లుయెన్సర్స్) భరతం పడుతోంది. గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు ఇలాంటి 70,000 మంది ఫిన్ఇన్‌ఫ్లుయెన్సర్స్ సోషల్ మీడియా ఖాతాలను క్లోజ్ చేయించింది. సెబీ హోల్‌టైమ్ సభ్యుడు అనంత్ నారాయణ్ ఈ విషయం వెల్లడించారు. స్టాక్ మార్కెట్ గరిష్ఠ స్థాయికి చేరడంతో చాలా మంది సెబీ వద్ద నమోదు కాకుండానే పెట్టుబడి సలహాదారులు, రీసెర్చ్ అనలిస్టుల పేరుతో సోషల్ మీడియా ద్వారా పెట్టుబడి సలహాలు ఇస్తూ మదుపరులను తప్పుదారి పట్టిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో సెబీ గత ఏడాది అక్టోబరు నుంచి వీరిపై చర్యలు ప్రారభించింది. ఇలాంటి కేటుగాళ్ల ఆటలు కట్టించేందుకు సెబీ వద్ద నమోదైన ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు, అనలిస్టులు కూడా తమకు సహకరించాలని నారాయణ్ కోరారు.

ఎఫ్‌పీఐల పెట్టుబడులు

దేశీయ మార్కెట్లో విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) పెట్టుబడులపైనా నారాయణ్ మాట్లాడారు. ఎఫ్‌పీఐ సంస్థల అమ్మకాలపై మరీ అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇటీవల వీటి అమ్మకాలు ఎంత ఉధృతంగా ఉన్నా గత నెలాఖరు వరకు చూసినా, వీటి పెట్టుబడులు మన ఈక్విటీ మార్కెట్లో రూ.62 లక్షల కోట్లు, డెట్ మార్కెట్‌లో రూ.5.9 లక్షల కోట్ల వరకు ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. అయితే కీలకమైన ఎఫ్‌పీఐల పెట్టుబడులపై ఉదాసీన వైఖరి కూడా పనికిరాదన్నారు. స్థిరమైన ఆర్థిక అభివృద్ధి, పటిష్ఠమైన స్థూల ఆర్థిక పరిస్థితులు, చక్కటి నిర్వహణ ద్వారా ఈ పెట్టుబడులను ఆకర్షించవచ్చన్నారు.

జూలై 1 వరకు గడువు

లిస్టెడ్ కంపెనీలకు ఉద్దేశించిన సంబంధిత ఆర్థిక లావాదేవీల వివరాల వెల్లడిపై అభిప్రాయాల సేకరణ గడువును సెబీ ఏప్రిల్ 1 నుంచి జూలై 1 వరకు పొడిగించింది. లిస్టెడ్ కంపెనీలు తమ అనుబంధ కంపెనీలు, లేదా తమ ప్రమోటర్లు, బోర్డు సభ్యుల నిర్వహణలోని కంపెనీలతో జరిగే ఆర్థిక లావాదేవీల వివరాలను ఆయా కంపెనీల ఆడిట్ కమిటీలకు తెలియజేసేందుకు నిర్ణీత ప్రామాణికాలు రూపొందించాలని సెబీ తలపెట్టింది. దీనిపై ఏప్రిల్ 1లోగా తమ అభిప్రాయాలు తెలపాలని గత నెల పరిశ్రమ వర్గాలను కోరింది. అయితే ఫిక్కీ, సీఐఐ, అసోచామ్ ఇందుకు మరింత గడువు కోరడంతో ఈ గడువును ఈ ఏడాది జూలై 1 వరకు పొడిగిస్తున్నట్టు తెలిపింది.

బ్రోకర్లకు ఊరట

గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీ-ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ (గిఫ్ట్-ఐఎఫ్ఎస్‌సీ)లో సొంత యూనిట్లు లేదా జాయింట్ వెంచర్లు ఏర్పాటు చేయాలనుకునే బ్రోకర్లకు ప్రత్యేక వెసులుబాటు కల్పించాలని సెబీ భావిస్తోంది. ఇందుకు తన నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) లేకుండానే వారిని అనుమతించాలని యోచిస్తోంది. అయితే గిఫ్ట్ సిటీలో ఏర్పాటు చేసే బ్రోకరేజీ సంస్థల అనుబంధ లేదా జాయింట్ వెంచర్ కంపెనీలు ప్రధాన కంపెనీతో ఎలాంటి సంబంధం లేకుండా పూర్తి స్వతంత్రగా, గిఫ్ట్ సిటీ నిబంధలకు లోబడి పని చేయాలని ప్రతిపాదించింది.

ప్రకటనలపైనా నియంత్రణ

మదుపరుల ప్రయోజనాల పరిరక్షణ కోసం సెబీ మరో కీలక చర్య తీసుకుంది. తన వద్ద నమోదైన సంస్థలు.. గూగుల్, మెటా, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో ఇచ్చే ప్రకటనలను మరింత కట్టుదిట్టం చేసింది. ఇక ఈ ప్రకటనలు ఇచ్చే సంస్థలు తమ ప్రచార ప్రకటనలతో పాటు సెబీ వద్ద నమోదు చేసిన తమ ఈ-మెయిల్, మొబైల్ నంబర్లను కూడా ఆ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌కు ఇవ్వాలని స్పష్టం చేసింది. దీంతో ఈ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ఈ సంస్థలు నిజమైనవా? కావా? అని నిర్ధారించుకుని వారి ప్రకటనలను తమ ప్లాట్‌ఫామ్స్‌లో పోస్టు చేస్తాయి. తమ వద్ద నమోదైన సంస్థలు, వ్యక్తులు వచ్చే నెలాఖరులోగా మారిన తమ ఈ-మెయిల్స్, మొబైల్ నంబర్లను 'సెబీ ఎస్ఐ' పోర్టల్‌లో అప్‌డేట్ చేసుకోవాలని సెబీ కోరింది.సెబీ వద్ద నమోదైన గుర్తింపు సంస్థల పేరుతో కొన్ని బోగస్ సంస్థలు, కేటుగాళ్లు మదుపరులకు టోపీ పెడుతున్నట్టు వార్తలు రావడంతో సెబీ ఈ చర్య తీసుకుంది.

మార్కెట్లో కొనసాగిన జోరు

- సెన్సెక్స్ 557 పాయింట్లు అప్
- 5 రోజుల్లో ఇన్వెస్టర్ల సంపద రూ.22 లక్షల కోట్లు అప్

ముంబై: స్టాక్ మార్కెట్లో ఉత్సాహం ఉప్పొంగుతోంది. ఈ వారంలో వరుసగా ఐదు ట్రేడింగ్ రోజులూ కీలక సూచీలు లాభాల్లోనే ముగిశాయి. ప్రధానంగా ఈ ఏడాది మరో రెండు విడతలు వడ్డీ రేట్ల కోత ఉంటుందన్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ సంకేతాలు ఇన్వెస్టర్ సెంటిమెంట్ పెరిగేందుకు దోహదపడ్డాయి. దీనికి తోడు డాలర్ ఇండెక్స్ బలహీనపడడంతో విదేశీ ఇన్వెస్టర్లు మరోసారి వర్ధమాన మార్కెట్లలో పెట్టుబడులను పెంచారు. దీంతో శుక్రవారం సెన్సెక్స్ 557.45 పాయింట్లు లాభపడి 76,905.51 వద్ద ముగియగా నిఫ్టీ 159.75 పాయింట్ల లాభంతో 23,350.40 వద్ద ముగిసింది. సర్వత్రా సానుకూల వాతావరణంలో వారం మొత్తం మీద సెన్సెక్స్ 3076 పాయింట్లు, నిఫ్టీ 953 పాయింట్లు లాభపడ్డాయి. స్టాక్ ఎక్స్ఛేంజీల వద్ద ఉన్న సమాచారం ప్రకారం విదేశీ ఇన్వెస్టర్లు గురువారం రూ.3,239.19 కోట్ల విలువ గల ఈక్విటీలు కొనుగోలు చేశారు. చమురు ధరలు అదుపులో ఉండడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను పెంచింది. శుక్రవారం బ్యారెల్ క్రూడాయిల్ 0.21 శాతం తగ్గి 71.85 డాలర్ల వద్ద ట్రేడయింది. కాగా ఐదు రోజుల ర్యాలీ ప్రభావంతో ఇన్వెస్టర్ల సంపద రూ.22,12,191.12 కోట్లు పెరిగి రూ.4,13,30,624.05 కోట్లకు (4.79 లక్షల కోట్ల డాలర్లు) చేరింది. అన్ని వర్గాల ఇన్వెస్టర్ల నుంచి కొనుగోళ్ల మద్దతు లభించటం కలిసివచ్చిందని విశ్లేషకులంటున్నారు.

బ్యాంకుల సమ్మె వాయిదా

న్యూఢిల్లీ: వచ్చే సోమ, మంగళవారాల్లో చేయతలపెట్టిన రెండు రోజుల సమ్మెను బ్యాంకు యూనియన్ల ఐక్య వేదిక (యూఎఫ్‌బీయూ) వాయిదా వేసింది. ఐదు రోజుల పని, అన్ని క్యాడర్లలోనూ తగినన్ని నియామకాలు చేపట్టాలన్న తమ డిమాండ్ల విషయంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) నుంచి సానుకూల హామీ లభించిన నేపథ్యంలో సమ్మె వాయిదా వేస్తున్నట్టు 9 బ్యాంకు యూనియన్ల ఐక్య వేదిక యూఎఫ్‌బీయూ ప్రకటించింది.

శ్రీసిటీలో ఓజేఐ ఇండియా ప్లాంట్ షురూ

శ్రీసిటీ (ఆంధ్రజ్యోతి): అగ్గిపెట్టెలు, ఇతర ప్యాకేజింగ్ వస్తువుల తయారీలో కీలకంగా ఉన్న ఓజేఐ గ్రూప్ అనుబంధ సంస్థ ఓజేఐ ఇండియా ప్యాకేజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ శ్రీసిటీలో కొత్త ప్లాంట్‌ను ప్రారంభించింది. శుక్రవారం నాడిక్కడ చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ మునియో తకహాషి, ఓజీ హోల్డింగ్స్ కార్ప్ ప్రెసిడెంట్, సీఈఓ మిరోయుకి ఇసోనో, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఈ ప్లాంట్‌ను ప్రారంభించారు. దేశంలో కంపెనీకిది ఐదో ప్లాంట్. దక్షిణ భారత ప్యాకేజింగ్ అవసరాలకు అనుగుణంగా ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు కంపెనీ తెలిపింది.

రిలయన్స్ క్యాపిటల్ దివాలా సుఖాంతం

న్యూఢిల్లీ: అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ క్యాపిటల్ కంపెనీ దివాలా పరిష్కార ప్రక్రియ సుఖాంతమైంది. హిందుజాల నేతృత్వంలోని ఇండస్ ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్ లిమిటెడ్ (ఐఐహెచ్ఎల్) రూ.10,000 కోట్లతో ఈ కంపెనీని దక్కించుకుంది. రుణదాతలు, రెగ్యులేటరీ సంస్థల ఆమోదాలూ పూర్తయ్యాయి. కంపెనీ డైరెక్టర్ల బోర్డునీ పునర్ వ్యవస్థీకరించారు. దీంతో ఈ నెల 19న రిలయన్స్ క్యాపిటల్ దివాలా పరిష్కార ప్రక్రియ పూర్తయిందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) తెలిపింది. ఈ ప్రక్రియ మొత్తానికి వై నాగేశ్వర రావు దివాలా పరిష్కార పరిష్కర్తగా వ్యవహరించారు. దేశంలో దివాలా పరిష్కార ప్రక్రియకు వచ్చిన తొలి ఎన్‌బీఎఫ్‌సీ కూడా రిలయన్స్ క్యాపిటలే.

శ్రీసిటీలో కోబెల్కో ఆర్ అండ్ డీ సెంటర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నిర్మాణ రంగ దిగ్గజం కోబెల్కో కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ ఇండియా కంపెనీ ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో పరిశోధన, అభివృద్ధి కేంద్రం (ఆర్ అండ్ డీ) ఏర్పాటు చేయనుంది. భారత్‌ను జపాన్‌లోని తమ మాతృసంస్థ కోబెల్కో కన్‌స్ట్రక్షన్ మెషినరీ కంపెనీకి కీలక తయారీ, ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చి దిద్దాలనుకుంటున్నట్టు ప్రకటించింది. ఈ కేంద్రం అడ్వాన్స్‌డ్ ఇంజనీరింగ్ సొల్యూషన్లు, విభిన్న మార్కెట్ అవసరాలకు దీటుగా కస్టమైజేషన్, కీలక తయారీ కేంద్రంగా భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేయడంపై కృషి చేస్తుందని కంపెనీ తెలిపింది. చెన్నైకి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీసిటీలోఈ కంపెనీ హైడ్రాలిక్ ఎస్కవేటర్ల తయారీ కేంద్రం నడుపుతోంది. శుక్రవారం ఈ కేంద్రం 20 వేల ఎస్కవేటర్ల తయారీ మైలురాయిని చేరింది. ఏడాదికి 3,000 ఎస్కవేటర్ల తయారీ సామర్థ్యం గల ఈ ఫ్యాక్టరీ ఉత్పత్తులను 16 దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

రెండేళ్లలో తెలంగాణలో రూ.1,000 కోట్ల టర్నోవర్

గోద్రెజ్ జెర్సీ సీఈఓ భూపేంద్ర సూరి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జెర్సీ బ్రాండ్‌తో పాలు, పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న గోద్రెజ్ జెర్సీ. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలో గట్టి పట్టును చేజిక్కించుకునేందుకు రెడీ అవుతోంది. ఇందులో భాగంగా బాదంపాలు, పన్నీర్, పెరుగు ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు గోద్రెజ్ జెర్సీ సీఈఓ భూపేంద్ర సూరి వెల్లడించారు. మార్కెట్ కార్యకలాపాల విస్తరణ, వ్యూహాత్మక పెట్టుబడులు, భాగస్వామ్యాల ద్వారా ఈ ఉత్పత్తుల అమ్మకాలను గణనీయంగా పెంచుకోవాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. గోద్రెజ్ జెర్సీ ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలో కీలకమైన బ్రాండ్‌గా ఉందన్నారు. ప్రస్తుతం తెలంగాణలో కంపెనీ టర్నోవర్ రూ.660 కోట్లుగా ఉందని 2026-27 నాటికి దీన్ని రూ.1,000 కోట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సూరి తెలిపారు. కాగా విలువ ఆధారిత ఉత్పత్తులపై మరింతగా దృష్టి పెట్టడం ద్వారా తెలుగు రాష్ట్రాల్లో మరో రూ.1,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం రూ.1,540 కోట్లుగా ఉండగా అందులో విలువ ఆధారిత ఉత్పత్తుల వాటా దాదాపు 40 శాతం వరకు ఉందన్నారు. కాగా బాదంపాల మార్కెట్లో మరింత పట్టును చేజిక్కించుకునే ఉద్దేశంతో టాలీవుడ్ నటుడు రానా దగ్గుబాటిని ప్రచారకర్తగా నియమించుకున్నట్లు సూరి వెల్లడించారు. ప్రస్తుతం ఏపీ, తెలంగాణ మార్కెట్లో కంపెనీ రోజుకు 2 లక్షల లీటర్ల వరకు పాలను సేకరిస్తోందని తెలిపారు.

చిత్రజ్యోతి
SINCE 1965

ఆసక్తికరమైన ప్రయాణం ఇది

\- కీరవాణి



మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం గురించి ఆ చిత్ర సంగీత దర్శకుడు కీరవాణి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటివరకూ తను పని చేసిన చిత్రాల్లో ఇది కష్టతరమైన ప్రాజెక్ట్ అని ఆయన పేర్కొన్నారు. 'ప్రతి సినిమాకూ సవాళ్లు పెరుగుతుంటాయి. దానికి తగ్గట్లు కొత్త సౌండ్స్ సృష్టించాలి. మహేశ్‌బాబు నటిస్తున్న తాజా చిత్రం లాంటిది ఇంతవరకూ రాలేదని అనుకుంటున్నా. అదొక అడ్వంచర్. అయినా ఆసక్తికరమైన ప్రయాణమే' అన్నారు కీరవాణి. 'నా టూర్ ఎం.ఎం.కె.' పేరుతో నిర్వహించే మ్యూజిక్ కాన్సర్ట్ ప్రమోషన్స్‌లో భాగంగా ఆయన ఈ విషయాలు వెల్లడించారు. ఇటీవల ఒడిశాలోని కోరాపుట్‌లో జరిగిన షూటింగ్‌తో మహేశ్‌బాబు చిత్రం రెండో షెడ్యూల్ పూర్తయిన విషయం విదితమే.

తొలి గీతం అప్పుడే



నాని, శ్రీనిధి శెట్టి జంటగా శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'హిట్: ద థర్డ్ కేస్'. ప్రశాంతి త్రిపిర్నేని నిర్మాత. మే 1న థియేటర్లలో విడుదల కానుంది. కాగా, ఈ సినిమా నుంచి తొలి గీతం 'ప్రేమ వెల్లువ'ను ఈనెల 24న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. మిక్కీ జె.మేయర్ సంగీతం అందించారు. విజయవంతమైన 'హిట్' ఫ్రాంచైజీలో మూడో భాగంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

రెండు భాగాలుగా విజయ్ సినిమా



విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'కింగ్‌డమ్'. సూర్యదేవర నాగ వంశీ నిర్మాత. మే 30 థియేటర్లలో విడుదల కానుంది. అయితే ఈ సినిమా గురించి ఆసక్తికర విషయం వెల్లడించారు నిర్మాత నాగ వంశీ. 'మ్యాడ్ స్క్వేర్' ప్రమోషన్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'కింగ్‌డమ్' సినిమా రెండు భాగాలుగా రాబోతోందని చెప్పారు. 'రెండు భాగాలు తీయాలనేది తొలుత మేము అనుకోలేదు. అయితే కథ డిమాండ్‌ను బట్టి ఈ నిర్ణయం తీసుకున్నాం' అని చెప్పారు.

వేసవిలో 'సింగిల్'



శ్రీ విష్ణు హీరోగా కార్తీక్ రాజు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సింగిల్'. కేతిక శర్మ, ఇవాన హీరోయిన్లు. అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు. ఇదివరకే ప్రకటించినట్లుగా మే 9న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల అవుతోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పోస్టర్ శ్రీ విష్ణు పాత్రను రెండు విభిన్నమైన షేడ్స్‌లో ప్రజెంట్ చేస్తోంది.

చెలియా చెలియా..



'పొలిమేర' చిత్రం విజయంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు డా.అనిల్ విశ్వనాథ్. ఆయన దర్శకత్వం వహించిన మొదటి సినిమా '28 డిగ్రీల సెల్సియస్'. నవీన్ చంద్ర, షాలినీ వడ్నికట్టి జంటగా నటించారు. ఈనెల 28న థియేటర్లలో విడుదలవుతోంది. వీరాంజనేయ బ్యానర్‌పై సాయి అభిషేక్ నిర్మించారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'చెలియా చెలియా' అనే ప్రేమ గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. కిట్టు విస్సాప్రగడ సాహిత్యానికి శ్రావణ్ భరద్వాజ్ సంగీతం అందించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మాట్లాడుతూ 'మనసును తాకే భావోద్వేగాలతో ఆద్యంతం సాగే అద్భుతమైన ప్రేమ కథా చిత్రమని' తెలిపారు.

స్టూడియోలు నిర్మించాలని కోరాం

● తెలుగు నిర్మాతల మండలి

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం కొత్త విధానం తీసుకురావాలని నిర్ణయించినందుకు తెలుగు నిర్మాతలమండలి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు లోకేశ్, దుర్గేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపింది. పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే సమర్పించామనీ, వైజాగ్, తిరుపతి, రాజమహేంద్రవరంలో స్టూడియోల నిర్మాణం కోసం మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని, నిర్మాతలు, నటీనటులు, దర్శకులు, సాంకేతిక నిపుణుల గృహనిర్మాణం కోసం భూమి కేటాయింపు వంటి ప్రతిపాదనలు పంపామని నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే నంది అవార్డులను పునరుద్ధరించాలనీ, పెండింగ్‌లో ఉన్న అవార్డులను కూడా ఇవ్వాలని అభ్యర్థించినట్లు ఆయన వెల్లడించారు. ఏపీలో తెలుగు చిత్ర పరిశ్రమ వేగవంతమైన అభివృద్ధి కోసం ప్రభుత్వానికి పూర్తి సహకారం, మద్దతు అందిస్తామని కూడా ప్రసన్నకుమార్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం ఈ విషయంలో త్వరిత చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



సీఎం చంద్రబాబుతో డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి భేటీ

» ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులపై చర్చ

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి కలిశారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ఈ భేటీలో ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులకు ఏఐ, మెడ్‌టెక్ ఏ విధంగా దోహదపడుతున్నాయనే అంశాలపై చర్చించినట్లు చంద్రబాబు 'ఎక్స్'లో చేసిన పోస్టులో పేర్కొన్నారు. ఏఐ, మెడ్‌టెక్ అలయన్స్ ఫౌండేషన్‌తో కలసి ఆరోగ్యరంగంలో మరింత మెరుగైన మార్పులకు కృషి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో ఏఐజీ డైరెక్టర్ డాక్టర్ రాకేశ్ కలపాల పాల్గొన్నారు.

ప్రీమియం రైళ్లలో 'యువర్ ప్లాట్‌ఫామ్' మేగజైన్

» చెన్నై తరువాత విశాఖలోనే ప్రారంభం

విశాఖపట్నం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు ప్రయాణికుల కోసం 'యువర్ ప్లాట్‌ఫామ్' పేరుతో మాసపత్రికను అందుబాటులోకి తీసుకువచ్చారు. దేశంలో ఇలాంటిది మొదట చెన్నైలో ప్రారంభించగా, ఆ తరువాత విశాఖలోనే తీసుకురావడం విశేషం. రైల్వేలో కీలకమైన అంశాలు, మరచిపోలేని ఘటనలు, పర్యాటక ప్రాంతాలు, సంస్కృతి, అభిరుచులు, అలవాట్లను వివరిస్తూ ఈ 'ఆంగ్ల మాస పత్రికను రూపొందించామని వాల్తేరు డీఆర్ఎం లలిత్ బొహ్రా తెలిపారు. వీటిని ఎంపికచేసిన ప్రీమియం రైళ్లు... విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్, గుంటూరు వెళ్లే డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్, అరకులోయ మార్గంలో ప్రయాణించే కిరండోల్ పాసింజర్ రైలులోని విస్టాడోమ్ కోచ్‌లలో ప్రయాణికులకు అందుబాటులో ఉంచుతారు. తొలి మాసపత్రికను 'నమస్కారం వైజాగ్' ముఖచిత్రంతో విడుదల చేశారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్-1 కె.సందీప్, మేనేజర్-2 పవన్ కుమార్, మాస పత్రిక సృష్టికర్తలు ప్రవీణ్, శంకర్, కృతిక్ పాల్గొన్నారు.

రుషికొండ బీచ్‌లో బ్లూ ఫ్లాగ్ బృందం



రుషికొండ బీచ్‌ను పరిశీలిస్తున్న బ్లూ ఫ్లాగ్ బృందం సభ్యులు

విశాఖపట్నం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విశాఖలోని రుషికొండ బీచ్‌ను శుక్రవారం బ్లూ ఫ్లాగ్ బృందం పరిశీలించింది. బీచ్‌లో కుక్కలు తిరుగుతున్నాయని, పార్కింగ్ సదుపాయాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, మౌలిక వసతులు కొరవడ్డాయని ఫొటోలతో సహా ఫిర్యాదులు వెళ్లడంతో బ్లూ ఫ్లాగ్ గుర్తింపును తాత్కాలికంగా ఉపసంహరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం బ్లూ ఫ్లాగ్ కమిటీకి లేఖరాసి పరిశీలనకు రావాలని, గుర్తింపును పునరుద్ధరించాలని కోరింది. దీంతో ఢిల్లీ నుంచి అజయ్ సక్సేనా, శ్రీజి కురూప్ విశాఖ వచ్చి శుక్రవారం బీచ్‌ను పరిశీలించారు. ఈ బృందం శనివారం కూడా బీచ్‌ను పరిశీలించి నివేదిక సమర్పిస్తుంది.

కర్ణాటకలో ప్రజాప్రతినిధుల వేతనాలు రెట్టింపు!

బెంగళూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యుల వేతనాలు 100 శాతం పెంపు ప్రతిపాదనకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ మేరకు కర్ణాటక మంత్రుల జీతాలు, అలవెన్సులు (సవరణ) బిల్లు 2025, కర్ణాటక శాసనసభ్యుల జీతాలు, పింఛన్లు, అలవెన్సులు (సవరణ) బిల్లు 2025ను శుక్రవారం తీవ్ర గందరగోళం మధ్య సభ ఆమోదించింది. ఈ సందర్భంగా హోంమంత్రి జి.పరమేశ్వర వేతనాల పెంపును సమర్థించుకున్నారు. దీని ప్రకారం ముఖ్యమంత్రి వేతనం నెలకు రూ.75 వేల నుంచి రూ.1.50 లక్షలకు, మంత్రుల వేతనాలు రూ.60 వేల నుంచి రూ.1.25 లక్షలకు పెరిగింది. ఎమ్మెల్యేలు, ప్రతిపక్షనాయకుడి వేతనం రూ.40 వేల నుంచి రూ.80 వేలకు పెరిగింది. శాసనసభ స్పీకర్, పరిషత్ సభాపతి వేతనం రూ.75 వేల నుంచి 1.25 లక్షలకు పెరిగింది. మరోవైపు.. ప్రజాప్రతినిధుల వేతనాల పెంపుపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. ఆర్థిక పరిస్థితి బాగోనప్పుడు ఈ నిర్ణయం ఎందుకు తీసుకోవలసి వచ్చిందని వారు ప్రశ్నిస్తున్నారు.

కూటమి పాలనపై పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం

కూటమి ప్రభుత్వం 9 నెలల పాలనలో సాధించిన అభివృద్ధిని, ప్రజలకు అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మన్నవ శారదాదేవి రాసిన 'కూటమి పాలనలో అభివృద్ధి- సంక్షేమం' పుస్తకాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వ విజయాలతో పాటు,ముందున్న సవాళ్లను తెలియజేస్తూ పుస్తకాన్ని రాయడం అభినందనీయమని సీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో మందడి వెంకట్రామయ్య, మందడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసీపీ నేత కబ్జాలో 2 కోట్ల భూమి

కడప జిల్లా ఒంటిమిట్ట మండలానికి చెందిన వైసీపీ నాయకుడు, కొత్త మాధవరం మాజీ సర్పంచి ఫేక్ డాక్యుమెంట్లతో రూ.2 కోట్ల విలువైన స్థలాన్ని ఆక్రమించారని, అక్కడ హోటల్ నిర్మాణం చేపడుతున్నారని గ్రామానికి చెందిన ఆలూరి నరసింహులు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. శుక్రవారం జరిగిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో ఏపీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రొడెక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ దేవదత్ అర్జీలు స్వీకరించారు.

అవినీతి న్యాయమూర్తిని తొలగించండి: ఐలూ

విజయవాడ లీగల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో భారీమొత్తంలో లెక్కల్లో చూపని నగదును రికవరీ చేశారన్న వార్త విస్మయానికి గురిచేసిందని అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలూ) జాతీయ అధ్యక్షుడు బికాస్ రంజన్ భట్టాచార్య, ప్రధాన కార్యదర్శి పీవీ సురేంద్రనాథ్ శుక్రవారం పేర్కొన్నారు. ఆయన్ను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయడం సమస్యకు పరిష్కారం కాదని అభిప్రాయపడ్డారు. అవినీతికి పాల్పడిన న్యాయమూర్తిపై తక్షణమే కేసు నమోదు చేసి, విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

అక్కడ పది పరీక్ష.. నల్లేరుపై నడక!

» మాస్ కాపీయింగ్‌కు ఇన్విజిలేటర్ల సహకారం

» విద్యార్థుల నుంచి రూ.30 వేల చొప్పున వసూలు

» 15 మంది టీచర్ల సస్పెన్షన్.. ఐదుగురు విద్యార్థులు డిబార్

శ్రీకాకుళం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుప్పిలి మోడల్ స్కూలు పరీక్ష కేంద్రంలో శుక్రవారం జరిగిన పరీక్షలో ఏకంగా ఇన్విజిలేటర్లే మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వడం చర్చనీయాంశమైంది. ఈ కేంద్రంపై అందిన ఫిర్యాదుల మేరకు నాలుగు బృందాలు శుక్రవారం క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. ఈ సందర్భంగా ఏకంగా ఇన్విజిలేటర్లే మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇచ్చినట్టు తేలింది. అక్కడే ప్రశ్నలకు జవాబులు రాస్తున్న ఒక ఇంగ్లిష్ టీచర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ క్లర్కు ఒక్కో విద్యార్థి నుంచి రూ.30 వేలు వసూలు చేసినట్లు తేలింది. ట్రిపుల్ ఐటీలో సీట్ల కోసమే మాస్ కాపీయింగ్‌కు తెరలేపినట్లు తెలిసింది. మాస్ కాపీయింగ్‌కు బాధ్యులైన 15 మంది ఉపాధ్యాయులను డీఈవో సస్పెండ్ చేశారు. ఐదుగురు విద్యార్థులను డిబార్ చేశారు. ఈ వ్యవహారం గత కొన్నేళ్లగా జరుగుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఏటా ఇదే కేంద్రం నుంచి పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థుల్లో ఎక్కువ మందికి ట్రిపుల్ ఐటీ సీట్లు రావడానికి ఇదే కారణమని చర్చించుకుంటున్నారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేయాలని ఎచ్చెర్ల పోలీసులకు విద్యాశాఖాధికారులు ఫిర్యాదు చేశారు.

'నైరుతి'లో సాధారణ వర్షపాతమే



» వాతావరణ నిపుణుల అంచనా

» రుతుపవనాలకు సానుకూల పరిస్థితులు

విశాఖపట్నం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): దేశంలో వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేవి నైరుతి రుతుపవనాలే. దేశంలో ఏడాదిలో కురిసే మొత్తంవర్షపాతంలో 70శాతం ఈ సీజన్ (జూన్ నుంచి సెప్టెంబరు వరకు) 4నెలల్లోనే కురుస్తోంది. అంతటి ప్రాధాన్యం కలిగిన నైరుతి సీజన్ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది ఎలా ఉంటుందోననే సమాచారం కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. దీనిపై తాజాగా వాతావరణ నిపుణులు స్పష్టత ఇచ్చారు. నైరుతికి సానుకూల పరిస్థితులు ఏర్పడనున్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది నైరుతి సీజన్ తొలి అర్థభాగంలో సాధారణ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నైరుతి సీజన్‌లో వర్షాలపై ప్రతి ఏడాదీ ఏప్రిల్‌లో భారత వాతావరణ శాఖ అధికారికంగా బులెటిన్ విడుదల చేస్తోంది. ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో సాధారణ వర్షాలు కురుస్తాయని, ఆగస్టు వరకూ ఆశాజనకంగా ఉండేందుకు అవకాశాలు కనిపిస్తు న్నాయని కొందరు నిపుణులు విశ్లేషించారు. ఇందుకు గల కారణాలను వారు విశ్లేషించారు.

పసిఫిక్‌పై వాతావరణం కీలకం

నైరుతి రుతుపవనాల సీజన్‌లో మంచి వర్షాలు కురవాలంటే పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు ప్రధాన భూమిక పోషిస్తాయి. గతేడాది డిసెంబరులో పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన బలహీనమైన లానినా ఈ నెలలో మరింత బలహీనపడుతుందని నిపుణులు పేర్కొన్నారు. ఏప్రిల్ నాటికి తటస్థ పరిస్థితులు నెలకొనే అవకాశం 60శాతం ఉందని భారత వాతావరణ శాఖ శాస్త్రవేత్తలు ఇప్పటికే వెల్లడించిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. తరువాత నైరుతి రుతుపవనాలు ప్రవేశించే సమయానికి బలహీనమైన ఎల్‌నినో వస్తుందని అంచనా వేశారు. ఆగస్టుకల్లా ఎల్‌నినో కొంచెం బలపడుతుందని, అయితే అది కొంతకాలమే ఉండి నవంబరు, డిసెంబరుకల్లా లానినా తిరిగి బలపడుతుందని అమెరికాకు చెందిన వాతావరణ అంచనా విభాగం (క్లైమేట్ ప్రిడిక్షన్ సెంటర్) అంచనా వేసింది. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు లానినా ఉన్నప్పుడు సగటు కంటే చల్లగా, ఎల్‌నినో కొనసాగితే వేడిగా ఉంటాయి. అదే తటస్థ పరిస్థితులు ఉన్నప్పుడు సాధారణంగా ఉంటాయి. వచ్చేనెల నుంచి పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదయ్యే అవకాశం ఉందని, నైరుతి ప్రవేశించే సమయానికి కొంచెం వేడెక్కుతాయని చెబుతున్నారు. పసిఫిక్ మహాసముద్రం నుంచి హిందూ మహాసముద్రం మీదుగా చల్లని గాలులు భారత్‌లోకి ప్రవేశించడంతో నైరుతి సీజన్‌లో వర్షాలు కురుస్తాయి. మంచి వర్షాలకు హిందూ మహాసముద్రంలో ఇండియన్ ఓషన్ డైపోల్ పాజిటివ్‌గా ఉండాలి. ప్రస్తుతం ఐవోడీ పాజిటివ్‌గా ఉంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని జూన్ నుంచి ఆగస్టు వరకు సాధారణ వర్షాలే కురుస్తాయని అంచనా వేస్తున్నారు.

పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళన



» చిత్తూరు జిల్లా నుంచి శ్రీకారం

» తాజాగా అన్నమయ్య జిల్లాలో..

» మొత్తం 364 మంది సిబ్బంది బదిలీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళన మొదలైంది. ఇటీవల చిత్తూరు జిల్లాలో ఇందుకు శ్రీకారం చుట్టగా, తాజాగా అన్నమయ్య జిల్లాపై దృష్టి పెట్టారు. చిత్తూరు జిల్లాలో ఒకేరోజు 264 మంది సిబ్బందిని బదిలీ చేసిన ఉన్నతాధికారులు... శుక్రవారం అన్నమయ్య జిల్లాలో ఏకంగా 364 మందికి స్థానచలనం కల్పించారు. ఇందులో 41 మంది ఏఎస్ఐలు, 123మంది హెడ్ కానిస్టేబుళ్లు, 200మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. క్షేత్రస్థాయిలో ఇంకా అక్కడక్కడ వైసీపీ నేతలకు పోలీసులు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పుంగనూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ కార్యకర్త రామకృష్ణ తన ప్రాణాలకు రక్షణ కల్పించాలంటూ వీడియో ద్వారా వేడుకున్నా పట్టించుకోలేదు. ఇటీవల ఆయన హత్యకు గురికావడంతో ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఇక ఉపేక్షిస్తే లాభం లేదని, పట్టపగలు చెప్పి మరీ హత్యలు చేస్తున్న శక్తుల్ని చట్టపరంగా శిక్షించాలని డీజీపీ గుప్తాకు సీఎం చంద్రబాబు గట్టిగా చెప్పారు. దీంతో అరాచక శక్తులను అణచివేయడంతో పాటు పోలీస్ శాఖలో ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటున్నారు. చిత్తూరు జిల్లా నుంచే డీజీపీ శ్రీకారం చుట్టారు. అరాచక శక్తుల్ని అదుపు చేయడంతో పాటు వారికి సహకరిస్తున్న పోలీసులను బదిలీ చేయించారు. మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పోలీసు స్టేషన్‌గా ముద్రపడ్డ ఒక పీఎస్‌లో మొత్తం సిబ్బంది(42మంది)ని తొలగించి గట్టిగా పనిచేసే వారిని నియమించారు. తాజాగా అన్నమయ్య జిల్లాలో పెద్దఎత్తున బదిలీలు చేశారు. అలాగే ఇతర జిల్లాల్లో ఇటువంటి సిబ్బందిని పక్కకు తప్పించేందుకు పోలీసు ఉన్నతాధికారులు జాబితా సిద్ధం చేస్తున్నారు. రాయలసీమతో పాటు పల్నాడు, గుంటూరు, విజయవాడ, కృష్ణా ఇతర సమస్యాత్మక జిల్లాల్లో గత ఐదేళ్లలో రెచ్చిపోయిన అరాచక శక్తుల వివరాలు సేకరిస్తున్నారు. వారిపై ఉన్న కేసులు, భూ కబ్జాలు, బెదిరింపులు, ఎక్స్‌ట్రాడిషన్, ఫ్యాక్షన్, రౌడీషీట్లు, అక్రమ ఆస్తులు, అక్రమ నిర్మాణాలు, కేసుల దర్యాప్తు స్థితి, ఏపీపీ అప్పీల్ తీరు, ప్రస్తుతం ఆయా నిందితుల కదలికలు తదితర వివరాలన్నీ టెక్నాలజీ ద్వారా సేకరిస్తున్నారు. అరాచక శక్తులను జైలుకు పంపి, వారికి సహకరించిన ఖాకీలను సంస్కరించే పనిలో నిమగ్నమయ్యారు.

ఐపీఎస్‌లపై వేటు

గత ప్రభుత్వంలో నిబంధనలు పక్కనబెట్టి అడ్డగోలుగా వ్యవహరించిన ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, పీవీ సునీల్ కుమార్, సంజయ్, కాంతి రాణా, విశాల్ గున్నీపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. గుంటూరు జిల్లాలో విజిలెన్స్ అధికారిగా ఉంటూ వ్యాపారిని బెదిరించిన ఐపీఎస్ అధికారి జాషువాపై ఏసీబీ కేసు నమోదు చేయనుంది. ఇదే క్రమంలో మరికొందరిపైనా చర్యలకు పోలీసు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నారు. బూతుల నేతలు, అవినీతి అధికారులు, అరాచక చర్యలకు ఉపక్రమిస్తున్నారు. పలు జిల్లాల్లో పది అంశాలకు సంబంధించిన సమాచారాన్ని డీజీపీ కార్యాలయం సేకరిస్తోంది. గతంలో పెద్దిరెడ్డి అనుచరులు అంగళ్లలో చంద్రబాబు పర్యటన సందర్భంగా వీరంగం సృష్టించిన ఘటన కేసులపైనా అధికారులు సమీక్షిస్తున్నట్టు తెలుస్తోంది.



పరీక్ష రాస్తున్న విద్యార్థిని సన్నక్కి చిన్నారి

'పది' పరీక్షకు హాజరైన చిన్నారి

కోసిగి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కోసిగి మండలం చింతకుంట గ్రామానికి చెందిన విద్యార్థిని సన్నక్కి చిన్నారి శుక్రవారం పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షకు హాజరయ్యింది. స్థానిక మౌంట్ కార్మెల్ పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసింది. చిన్నారి తన స్నేహితులను కలిసిన సమయంలో భావోద్వేగానికి గురైంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. డీఈవో శామ్యూల్ పాల్ పరీక్ష కేంద్రానికి చేరుకుని, పరీక్ష రాస్తున్న ఆ బాలికకు ధైర్యం చెప్పారు. పరీక్ష ముగిసిన తర్వాత విద్యార్థినితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆమె కష్టాలు తెలుసుకున్నారు. గైర్హాజరైన రెండు సబ్జెక్టులకు సప్లిమెంటరీ రాయిస్తామని, ఆందోళన వద్దని సూచించారు. పరీక్ష రాసేందుకు రానుపోను ఖర్చుల కోసం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. డీఈవో మాట్లాడుతూ 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం ఒక విద్యార్థిని జీవితాన్ని కాపాడిందని ప్రశంసించారు. మిరప కోత పనుల కోసం చిన్నారి తల్లిదండ్రులతో పాటు గుంటూరు వలస వెళ్లాల్సి వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ఈనెల 19న 'పరీక్ష హాలులో కాదు.. వలస వెళ్లి పొలంలో' శీర్షికన కథనం ఇచ్చింది. దీనిపై విద్యాశాఖ మంత్రి మంత్రి లోకేశ్ స్పందించి వెంటనే విద్యార్థిని పరీక్షలకు హాజరయ్యేలా అధికారులను ఆదేశించారు.

బకాయిల చెల్లింపులపై ఎన్జీవో నేతల హర్షం

» ముఖ్యమంత్రికి, అధికారులకు ధన్యవాదాలు

» గత ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులకు గురిచేసిందని వెల్లడి

విజయవాడ(వన్‌టౌన్), మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల బకాయిల చెల్లింపు ఆదేశాలపై ఎన్జీఓ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రూ.6,200 కోట్ల విడుదలకు ఉత్తర్వులు ఇవ్వటం, వెంటనే అమలు చేయటం పట్ల రాష్ట్ర ఎన్జీఓ అధ్యక్షుడు, కె.వి.శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.విద్యాసాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్‌కు, సంబంధిత ఉన్నతాధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇదే సమయంలో త్వరలోనే పీఆర్సీ చైర్మన్‌ను కూడా నియమిస్తారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు పడిన ఇబ్బందులను ప్రస్తావించారు. సుమారు రూ.25 వేల కోట్ల బకాయిలను చెల్లించకుండా గత ప్రభుత్వం కాలయాపన చేసి ఆర్థిక ఇబ్బందులకు గురిచేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బకాయిలు, ఇతర సమస్యలపై సీఎంకు వివరించగా, ఆయన సానుకూలంగా స్పందించి నిధులు విడుదల చేయటం హర్షణీయమని కృతజ్ఞతలు తెలిపారు.

అపరాల రైతులు లబోదిబో!

» దళారుల సిండికేట్ మాయాజాలంతో నష్టాలు

» పెసర, మినుము, శనగలకు దక్కని మద్దతు ధర

» పెసలుకు 8,682 ఉంటే 1,600 తక్కువ..

» మినుము, శనగ 500-1000 తక్కువకు కొనుగోలు

» కంది, పొద్దు తిరుగుడు ధరలదీ అదే దారి

» ప్రభుత్వ కొనుగోలు అవకాశం 15%-17% మాత్రమే

» కేంద్రం మద్దతు ధర ప్రకటించినా అమలు కాని వైనం

» కర్నూలు, ఆదోని మార్కెట్లలో మరీ దారుణం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



ఆరుగాలం శ్రమించినా అపరాల పంటలకు మద్దతు ధరలు దక్కక లబోదిబోమంటున్నారు. కేంద్రం మద్దతు ధర ప్రకటించినా, వ్యాపారుల సిండికేట్ మాయాజాలంతో గిట్టుబాటు ధర దక్కక రైతులు నష్టాలపాలవుతున్నారు. పంట ఉత్పత్తిలో ప్రభుత్వం కేవలం 15 నుంచి 17శాతం మాత్రం కొనుగోలుచేసే అవకావశం ఉండడంతో పూర్తి పంటను సరైన ధరలకు అమ్ముకోలేక రైతులు సతమతమవుతున్నారు. క్వింటా పెసలు రూ.8,682, మినుము రూ.7,400, శనగ(బెంగాళీగ్రామ్) రూ.5,440గా కేంద్రం మద్దతు ధరలు ప్రకటించింది. కానీ మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారి పెసలు, మినుములు, రూ.7వేలు, ఎర్రశనగలు రూ.5వేల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. తెల్ల శనగలు రూ.7వేలు పలుకుతున్నాయి. 2023-24లో తీవ్ర వర్షాభావం వల్ల అపరాల సాగు తగ్గి, పంట ఉత్పత్తుల ధరలు పెరిగాయి. దీంతో 2024-25లో ధరలు బాగుంటాయన్న ఆశతో రైతులు అపరాలను విరివిగా సాగు చేశారు. ఖరీఫ్‌లో తెగుళ్లతో దిగుబడులు తగ్గగా, రబీలో బెట్ట వాతావరణంతో ఉత్పత్తి తగ్గిందని రైతులు చెప్తున్నారు. పంట ఉత్పత్తులు మార్కెట్‌కు వచ్చే సమయంలో దళారులు, స్థానిక వ్యాపారులు సిండికేట్ అవుతున్నారు. దిగుబడులు తగ్గినా రైతులకు మద్దతు ధర కూడా దక్కడం లేదు. పెసలు క్వింటాకు రూ.1600దాకా తక్కువకు అడుగుతున్నారు. మినుము, శనగ క్వింటాకు రూ.500 నుంచి రూ.వెయ్యి దాకా తగ్గిస్తున్నారు. రబీలో శనగ 7.5, పెసర 1.37, మినుము 7లక్షల ఎకరాల్లో పండించారు. సగటున ఎకరానికి 5నుంచి8 క్వింటాళ్ల దిగుబడులు వచ్చే ఈ పంటలకు ఎకరానికి రూ.35-45వేల దాకా ఖర్చవుతుంది. కౌలు రైతులకు అదనంగా మరో రూ.15వేలదాకా పెట్టుబడి అవుతోంది. గతేడాది శనగలకు మంచి ధరరాక, రైతులు కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేశారు. శనగల దిగుమతులపై కేంద్రం ఫ్రీ ట్యాక్స్ నిర్ణయం తీసుకుని, దిగుమతి సుంకాన్ని 28% నుంచి జీరో చేసింది. ఈ నిర్ణయం ఈఏడాది అక్టోబరు వరకు అమలులో ఉండనున్నది. దీంతో దేశీయ శనగల ధర పతనమైంది. ఉత్పత్తిలో శనగలు17%, మినుము 15% మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసే అవకాశం ఉండగా, మిగిలిన ఉత్పత్తిని ప్రైవేట్ వ్యాపారులు అడిగిన ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. పైగా ఇటీవల పంట ఉత్పత్తుల సేకరణ కేంద్రాలు తెరుస్తున్నట్లు అధికారులు ప్రకటించినా ఇంకా కొనుగోళ్లు చేపట్టలేదు. దీంతో మద్దతు ధర కన్నా తక్కువకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్మితే నష్టాలే మిగులుతాయని రైతులు వాపోతున్నారు. కందుల పరిస్థితి ఇంతే ఉంది.

సన్‌ఫ్లవర్ సీడ్ పరిస్థితి ఇంతే!

కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీ, బిహార్, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో పొద్దు తిరుగుడు అధికంగా పండుతోంది. మార్కెట్‌లో సన్‌ఫ్లవర్ రిఫండ్ ఆయిల్ లీటర్ రూ.150దాకా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ సన్‌ఫ్లవర్ ఆయిల్‌కు డిమాండ్ ఉంది. పచ్చళ్ల తయారీ, వంట నూనెగా కూడా రాష్ట్రంలో సన్‌ఫ్లవర్ అధికంగానే వాడుతున్నారు. కానీ సన్‌ఫ్లవర్ సీడ్‌కు చాలాకాలంగా కనీస గిట్టుబాటు ధర రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కేంద్రప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినా అమలు కావడం లేదు. 2023-24లో క్వింటా రూ.6,760 మద్దతు ధర ఉండగా, 2024-25లో రూ.7,280గా కేంద్రం ప్రకటించింది. కానీ మార్కెట్‌లో రూ.6వేలు కూడా మించడం లేదు. గత నెలలో క్వింటా సన్‌ఫ్లవర్ సీడ్ రూ.రూ.5,273 ఉండగా, ప్రస్తుతం కర్నూలు మార్కెట్‌లో రూ.5,119 ఉండగా, ఆదోనిలో రూ.4,815 మాత్రమే పలికింది. వ్యాపారులు సిండికేట్‌గా మారి, మద్దతు ధర కన్నా.. క్వింటాకు రూ.2వేలుపైన తక్కువకు అడుగుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కనీసం నిరుటి మద్దతు ధర కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. రాష్ట్రంలో ఏటా ఖరీఫ్‌లో 5 వేలు, రబీలో 8వేల హెక్టార్లలో రైతులు పొద్దు తిరుగుడు పండిస్తున్నారు. ప్రధానంగా ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో ఈ పంట సాగవుతోంది. కానీ పంటకు గిట్టుబాటు ధర రాక, పెట్టుబడులు కూడా రాక సాగు తగ్గిస్తున్నారు.

3 నెలల్లో ఫిర్యాదులు పరిష్కరించాలి

» రీసర్వేలో తప్పులు రాకూడదు

» జేసీలు, ఆర్డీవోలకు రెవెన్యూ శాఖ ఆదేశాలు



జేసీలు, ఆర్డీవోల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్పీ సిసోడియా, సీసీఎల్ఏ జయలక్ష్మి

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వచ్చే 3నెలల్లో పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో ప్రజా సంతృప్తిని తీసుకురావాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఆర్.పి. సిసోడియా ఆదేశించారు. సమస్య పరిష్కారం కాలేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే అధికారులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. జిల్లాల జేసీలు, ఆర్డీవోల సమావేశం విజయవాడలోని ఇరిగేషన్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. రీసర్వేతో పాటు భూ సంబంధిత అంశాలపై ప్రత్యేక శిక్షణ, అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. సిసోడియా మాట్లాడుతూ రీసర్వే, భూముల సమస్యలపై రైతులు ఇచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయికి వెళ్లి విచారించి, పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదులను ఆషామాషీగా తీసుకొని ఏదో పరిష్కరించామని కేసులు క్లోజ్ చేస్తే కుదరదని, అలా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, రీసర్వేను జాగ్రత్తగా నిర్వహించాలని, తప్పులకు ఆస్కారం ఇస్తే కఠిన చర్యలు ఉంటాయని భూపరిపాలనా ప్రధాన కమిషనర్ జి.జయలక్ష్మి హెచ్చరించారు. ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో రైతుల సంతృప్తి ప్రధానమని, ఇదే లక్ష్యంగా అధికారుల పనితీరు ఉండాలని హితబోధ చేశారు.

త్వరలో గ్రామ రెవెన్యూ కోర్టులు

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామ రెవెన్యూ కోర్టులు నిర్వహిస్తామని అదనపు సీసీఎల్ఏ, సర్వే డైరెక్టర్ ఎన్. ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం ఏర్పాట్లు చేసుకోవాలని జేసీలకు సూచించారు. గ్రామ రెవెన్యూ కోర్టుకు తహశీల్దార్, ఆర్డీవో, ఇతర అధికారులు హాజరవుతారని, ప్రజల రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపే దిశగా ఈ విధానం ఉంటుందని వివరించారు.



పార్లమెంట్‌లో ఏపీ

2026కి పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి: పాటిల్

న్యూఢిల్లీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): 'పోలవరం సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉన్న అంశం. ప్రధాని మోదీ వచ్చాక ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి' అని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తెలిపారు. శుక్రవారం లోక్‌సభలో జలశక్తిశాఖ గ్రాంట్ల డిమాండ్లకు సంబంధించిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టుకు గత ప్రభుత్వాలు చేసింది శూన్యమని అన్నారు. '2015లో రూ.15 వేల కోట్లకు పైగా ప్రధాని మోదీ పోలవరానికి ఇచ్చి పనులు ప్రారంభించారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ రూ.12 వేల కోట్లకు పైగా నిధులు కేయించారు. ఈ ప్రాజెక్ట్ పూర్తియితే 2.91 లక్షల హెక్టార్ల పంట సాగవుతుంది. అలాగే విశాఖపట్నానికి తాగు నీరు, పరిశ్రమలకు నీళ్లు లభిస్తాయి. 540 గ్రామాలకు తాగునీరు లభిస్తుంది. 28.5 లక్షల మంది ప్రజలకు లాభం జరగనుంది. నిర్మాణానికి సంబంధించిన నిధులను కేంద్రం ఎప్పటికప్పుడు సమకూర్చుతుంది' అని మంత్రి పాటిల్ వివరించారు.

17.7% తగ్గిన టీబీ కేసులు: నడ్డా

'దేశంలో క్షయ కేసులు 2015 నుంచి 17.7% తగ్గాయి. మరణాల సంఖ్య 21.4% తగ్గింది' అని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా వెల్లడించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ టీబీ నివేదిక-2024 ప్రకారం ఈ తగ్గుదల నమోదైనట్లు తెలిపారు. శుక్రవారం లోక్‌సభలో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అడిగిన ఒక ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. 2025 నాటికి సంపూర్ణ టీబీ నిర్మూలన లక్ష్యాన్ని చేరుకోవడానికి దేశం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని నడ్డా స్పష్టం చేశారు.

ఎల్ఐసీ ఏజెంట్లకు భరోసా కల్పించాలి: పుట్టా మహేశ్

'ఎల్ఐసీ ఏజెంట్ల భద్రత, బీమా రంగ స్థిరత్వాన్ని కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే కమీషన్ మార్పులను రద్దు చేయాలి. ఏజెంట్ల ఆర్థిక భద్రతకు భరోసా కల్పించాలి' అని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్లమెంట్ సమావేశాల సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు శుక్రవారం నివేదిక సమర్పించారు. 'ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కేంద్రం చొరవ చూపాలి. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉన్న 14.4 లక్షల మంది ఏజెంట్లు రూ.44.31 లక్షల కోట్ల లైఫ్ ఫండ్, రూ.52.85 లక్షల కోట్ల జీవిత బీమా సంస్థ ఆస్తులకు విశేషంగా సహకరిస్తున్నారు' అని ఎంపీ వివరించారు.

మ్యాంగో బోర్డును ఏర్పాటు చేయండి: దగ్గుమళ్ల

ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్రంగా నష్టపోతున్న మామిడి రైతులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి టీడీపీ ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం లోక్‌సభలో ఆయన మాట్లాడారు. 'మామిడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మ్యాంగో బోర్డును ఏర్పాటు చేయాలి. ఇతర దేశాలకు ఎగుమతి చేసే మామిడి గుజ్జుపై సుంకాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. విదేశాలకు మామిడి గుజ్జును ఎగుమతి చేసే అవకాశాన్ని కల్పించాలి. ఏపీలో 3.7 లక్షల హెక్టార్లలో మామిడి పంట విస్తరించింది. కృష్ణా, చిత్తూరు, గోదావరి జిల్లాలు మామిడి పంటకు ప్రసిద్ధిగాంచినవి. ముఖ్యంగా చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో తోతాపురి ప్రధాన పంట. దీనిద్వారా ఉత్పత్తి అయ్యే గుజ్జు ఉక్రెయిన్‌కు ఎగుమతి అయ్యేది. అయితే రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా గుజ్జు ఎగుమతులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో కేంద్ర వ్యవసాయ శాఖ ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకొని ఎగుమతి అవకాశాలను పెంచేలా చర్యలు తీసుకోవాలి' అని ఎంపీ కోరారు. మామిడికి గిట్టుబాటు ధరను కల్పించి అన్నదాతలకు అండగా నిలవాలని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు దగ్గుమళ్ల విజ్ఞప్తి చేశారు.

టీఓఆర్ పునఃసమీక్ష అంటే ఏపీకి అన్యాయమే: పురందేశ్వరి

కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్(టీఓఆర్)ను పునఃసమీక్షించి, నీటి పంపకాల విషయంలో వెనక్కు వెళ్లడమంటే ఏపీకి అన్యాయం చేసినట్లే అని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. శుక్రవారం లోక్‌సభలో ఆమె మాట్లాడారు. 'కేంద్రం టీఓఆర్ పునఃసమీక్ష విషయంలో జోక్యం చేసుకోవాలి. కృష్ణాజలాల పంపిణీకి, కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర మధ్య జల వివాదాల పరిష్కారానికి 1969లో బచావత్ ట్రైబ్యునల్ ఏర్పాటయింది. ఏపీకి 811 టీఎంసీలు కేటాయించగా, విభజన తర్వాత ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయించారు. కమాండ్ ఏరియాతో పాటు వినియోగ యంత్రాంగాల ఆధారంగా ఈ కేటాయింపులు జరిగాయి' అని పురందేశ్వరి వివరించారు.

మైనర్ల జోలికొస్తే రౌడీషీట్

- పోలీసు ఉన్నతాధికారులతో హోంమంత్రి అనిత సమీక్ష



అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): 'మైనర్లపై ఎవరు నేరాలకు పాల్పడినా రౌడీషీట్ ఓపెన్ చేయండి. ఇటీవల గన్నవరంలో మైనర్‌పై రేప్ కేసులో 8మంది నిందితుల్లో ఐదుగురు రౌడీషీటర్లున్నారు. అటువంటి వారిపై ఉక్కుపాదం మోపండి' అని పోలీసులకు హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశాలిచ్చారు. రాష్ట్రంలో శాంతిభద్రతలపై డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఇతర పోలీసు ఉన్నతాధికారులతో మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో శుక్రవారం హోంమంత్రి సమీక్షించారు. మహిళలపై నేరాల తీరుతెన్నులు, కట్టడిపై జిల్లాల ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించారు. మహిళలపై నేరాల కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. సైబర్ నేరాల కట్టడికి అధునాతన టూల్స్ పయోగిస్తే.. ఈ సమస్యకు ఏపీ పోలీసు శాఖ నుంచే మెరుగైన పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. శాంతిభద్రతల ఏడీజీ మధుసూదన్ రెడ్డితోపాటు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

కేటాయించిన భూమి దివ్యక్షేత్రం పరిధిలో లేదు

- హైకోర్టులో ఒబెరాయ్ హోటల్స్ కౌంటర్

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): 'హోటళ్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం మాకు కేటాయించిన 20 ఎకరాల భూమి తిరుమల దివ్యక్షేత్రం పరిధి వెలుపల ఉంది' అని ఒబెరాయ్ గ్రూప్ హోటల్స్ హైకోర్టుకు నివేదించింది. టూరిజమ్ పాలసీలో భాగంగా తిరుపతి రూరల్ మండలం పేరూరులో తమకు ప్రభుత్వం భూమి కేటాయించిందని ఒబెరాయ్ గ్రూప్ హోటల్స్ ప్రతినిధి రాజారామన్ శంకర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో కౌంటర్ వేశారు. ప్రభుత్వం కేటాయించిన భూమి టీటీడీ పరిధిలోకి రానందున వాటి రద్దుకు టీటీడీ తీర్మానం చేయలేదన్నారు. తిరుమల పవిత్రత, ఆధ్యాత్మికతను దెబ్బతీసేలా ఎలాంటి నిర్మాణాలు చేపట్టడం లేదన్నారు. చట్ట నిబంధనలు ఉల్లంఘించలేదన్నారు. అన్ని అనుమతులు తీసుకున్న తరువాతే నిర్మాణాలు ప్రారంభించామన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని హోటళ్ల నిర్మాణానికి భూకేటాయింపులను సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాలను కొట్టివేయాలని అఫిడవిట్‌లో కోరారు.

నేడు సీమ, కోస్తాలో వర్షాలు

అమరావతి, విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ, ఉత్తరాంధ్రలో ఎండలు మండిపోతున్నాయి. శుక్రవారం నంద్యాల జిల్లా చాగలమర్రిలో 40.9, కర్నూలు జిల్లా కోసిగిలో 40.6, కడప జిల్లా ఒంటిమిట్ట, అన్నమయ్య జిల్లా గాదెల, అనంతపురంలలో 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 28 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. శనివారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల్లోని 18 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. అలాగే, ఉపరితల ద్రోణి, బంగాళాఖాతంలో అధికపీడనం ప్రభావంతో శనివారం రాయలసీమలో పలుచోట్ల, కోస్తాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆది, సోమవారాల్లో కూడా రాయలసీమ, కోస్తాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

మందులపై 'ఆపరేషన్ గరుడ'

- రాష్ట్రవ్యాప్తంగా 645 మెడికల్ స్టోర్లు, ఏజెన్సీల్లో తనిఖీలు
- ఏకకాలంలో వంద బృందాలతో సోదాలు
- ప్రిస్క్రిప్షన్ లేకున్నా నిద్రమాత్రలు, మత్తుమందుల విక్రయం
- కాలం చెల్లిన ఔషధాలు కూడా అమ్ముతున్నట్లు గుర్తింపు
- అవకతవకలకు పాల్పడిన వారిపై కేసులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



విజయవాడ గుణదలలోని మెడికల్ షాపులో తనిఖీలు చేస్తున్న ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ



శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని మెడికల్‌షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఈగల్ టీం

మత్తు మహమ్మారికి సమాధి కట్టడమే లక్ష్యంగా రాష్ట్రంలో 'ఆపరేషన్ గరుడ' మొదలైంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలైన విజిలెన్స్, ఈగల్, డ్రగ్ కంట్రోల్‌తోపాటు పోలీసులు 100 బృందాలుగా ఏర్పడి శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 645 మెడికల్ షాపులు, ఏజెన్సీల్లో తనిఖీలు చేపట్టారు. గంజాయి, డ్రగ్స్ మొదలుకొని మెడికల్ షాపుల్లో విక్రయిస్తున్న నిద్రమాత్రలు, మత్తు మందులు, కాలంచెల్లిన ఔషధాలను గుర్తించారు. శుక్రవారం ఉదయం నుంచి అనేక చోట్ల ఏకకాలంలో నిర్వహించిన తనిఖీల్లో అవకతవకలకు పాల్పడుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. విజిలెన్స్ డీజీ హోదాలో డీజీపీ హరీశ్ గుప్తా ఈ తనిఖీలను పర్యవేక్షించి ఎక్కడికక్కడ చట్టపరమైన చర్యలకు ఆదేశాలిచ్చారు. ఆపరేషన్ గరుడకు నాయకత్వం వహించిన ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ క్షేత్రస్థాయిలో తనిఖీల్లో పాల్గొని నాలుగు విభాగాల బృందాలను సమన్వయం చేశారు. పలు జిల్లాల్లోని మెడికల్ షాపుల్లో అల్ప్రాజోలమ్, ట్రిమడాల్ లాంటి మత్తు మందులు వైద్యుల సిఫారసు లేకుండానే విక్రయిస్తున్నట్లు గుర్తించామని తనిఖీ బృందాలు విజిలెన్స్ హెడ్ క్వార్టర్స్‌కు సమాచారం ఇచ్చాయి. కొన్నిచోట్ల మానసిక రోగులకు విక్రయించాల్సిన మత్తు బిళ్లలను యువతకు అమ్ముతున్నట్లు తేలిందని, ఉమ్మడి కడప జిల్లాతోపాటు కొన్నిచోట్ల రికార్డులు సీజ్ చేశామని రవికృష్ణ తెలిపారు. కాగా.. నెల్లూరు, ఒంగోలు, అనంతపురం, కడప, నంద్యాల, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో వైద్యుల సిఫారసు లేకుండా నిద్ర మాత్రల విక్రయాలు జరుగుతున్నట్లు పసిగట్టినట్లు తెలిసింది. విజిలెన్స్, పోలీసు, ఈగల్ (టోల్ ఫ్రీ 1972)కు ఎక్కువగా ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాల్లో ఈ సోదాలు చేపట్టినట్లు తెలుస్తోంది.

గుంటూరులో సాధారణ కస్టమర్లలా వెళ్లి..

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అధికారులు రిటైల్ మందుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఎప్పటిలా మొక్కుబడి తనిఖీల్లా కాకుండా ఈసారి పక్కాప్లాన్‌తో దాడులు చేశారు. ముందుగా మఫ్టీలో ఉన్న పోలీసులను సాధారణ వినియోగదారులుగా మందుల దుకాణాలకు పంపారు. వీరికి సదరు దుకాణదారుడు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే మత్తు బిళ్లలు, యాంటీ బయోటిక్ మందులు విక్రయించడంతో.. సదరు పోలీసులనే సాక్షులుగా పెట్టి వారిపై కేసులు నమోదు చేశారు. ఇవి నార్కోటిక్ డ్రగ్ కిందకు రావడంతో 14 రోజుల పాటు రిమాండ్ తప్పదని, బెయిల్ కూడా రాదని అధికారులు చెబుతున్నారు. గుంటూరులో మూడు, పల్నాడులో రెండు, బాపట్లలో రెండు మందుల షాపులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. విజయవాడలో నిర్వహించిన తనిఖీల్లో అల్‌ప్రాజోల్, అల్బెండాజోల్, ట్రమడాల్ వంటి 41 రకాల మత్తు మందులను అధిక మొత్తంలో స్టాకు పెట్టుకున్నట్టు గుర్తించారు. అవనిగడ్డలో రూ.55 వేల విలువైన ట్రిమడాల్, అల్ప్రాజాలమ్ మందుబిళ్లలను స్వాధీనం చేసుకున్నారు. కొన్ని మెడికల్ షాపుల్లో చూపిన స్టాక్ రిజిస్టర్‌కు, ఉన్న స్టాక్‌కు లెక్క తేడా ఉందని గుర్తించారు. అనంతపురం జిల్లా, శ్రీసత్యసాయి జిల్లాల్లో కాలంచెల్లిన ఔషధాలు, ప్రిస్క్రిప్షన్ లేకుండా మందలు అమ్ముతున్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలో 10 మెడికల్ షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. విజయనగరంలోని వెంకటరత్నం మెడికల్ స్టోర్సులో కాలం చెల్లిన మందులు, నిషేధిత మత్తు మందులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుకాణం నిర్వాహకుడిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ప్రకాశం జిల్లాలో తొమ్మిది షాపుల్లో నిబంధనలు ఉల్లంఘించినట్టు గుర్తించారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో నిషేధిత మందులు విక్రయిస్తున్న పెంజర్ల నాగేశ్వరరావుపై కేసు నమోదు చేశారు.

వివేకా హత్య కేసు విచారణలో.. ఇంత జాప్యమా?

(మొదటి పేజీ తరువాయి)

అనుమతి ఇచ్చింది. వివేకా హత్య కేసుకు సంబంధించి నాంపల్లి సీబీఐ కోర్టులో ఇంత వరకు ట్రయల్ ప్రారంభం కాలేదని.. ఏడాదిన్నరగా సీఆర్పీసీ 207 (నిందితులకు ప్రాసిక్యూషన్ పత్రాల కాపీలు అందజేయడం) దశలోనే ఉందని పేర్కొంటూ సునీతారెడ్డి గత నెలలో పిటిషన్ దాఖలు చేశారు. ఇది తొలుత న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ ఎదుట విచారణకు వచ్చింది. ప్రజాప్రతినిధుల కేసుల్లో విచారణ వేగవంతం చేయాలని ఇప్పటికే నమోదైన సుమోటో పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ధర్మాసనం పర్యవేక్షిస్తున్నందున.. ఈ వ్యాజ్యాన్నీ అక్కడికే బదిలీ చేయాలని న్యాయమూర్తి ఆదేశించారు. దీంతో ఈ పిటిషన్ శుక్రవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ టి.వినోద్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చింది. సునీతారెడ్డి తరఫున న్యాయవాది ఎస్.గౌతమ్ వాదనలు వినిపించారు. 'సీబీఐ సమర్పించిన హార్డ్‌డిస్క్‌ల్లో 13 లక్షల పత్రాలుంటే.. అవి ఓపెన్ కావడం లేదని నిందితులు అడ్డుపుల్లలు వేస్తున్నారు. రోజుకు కొన్ని చొప్పున సీబీఐ కోర్టులో ఫైళ్లు ఓపెన్ చేస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే ఏడేళ్లయినా ట్రయల్ ప్రారంభం కాదు' అని తెలిపారు. ఈ వ్యవహారంలో మీ ప్రధాన అభ్యర్థనేంటో చెప్పాలని ధర్మాసనం అడిగింది. వెంటనే ట్రయల్ ప్రారంభించి.. ఆరు నెలల్లో పూర్తిచేయాలని గౌతమ్ కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. ముందు సీబీఐ, ఇతర ప్రతివాదుల (నిందితులు) స్పందన తెలుసుకుందామంటూ నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

హత్యాచారం కేసులో నలుగురికి జీవిత ఖైదు

- ఏలూరు పోక్సో కోర్టు సంచలన తీర్పు

ఏలూరు క్రైం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రేమ జంటపై నలుగురు ఆగంతకులు దాడిచేశారు! యువతిపై అత్యాచారం చేసి హత్య చేశారు. యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆరేళ్ల క్రితం నాటి ఈ కేసులో నలుగురు ముద్దాయిలకు ఏలూరు పోక్సో కోర్టు జీవిత ఖైదు విధిస్తూ తీర్పుచెప్పింది. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ కథనం ప్రకారం.. 2019 ఫిబ్రవరి 24న భీమడోలు మండలానికి చెందిన ప్రేమజంట కామవరపుకోట మండలం జీలకర్రగూడెం సమీపంలోని గుంటుపల్లి గుహలకు వెళ్లింది. కృష్ణాజిల్లా జి.కొండూరు మండలం మాధవరానికి చెందిన పోతునూరి రాజు అలియాస్ అంకమరావు(28), ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం జి.కొత్తపల్లికి చెందిన తుపాకుల సోమయ్య(22), తుపాకుల గంగయ్య అలియాస్ గంగరాజు (20), మైలవరం మండలం ముడిచెర్ల కృష్ణారానికి చెందిన కొమరగిరి నాగరాజు(22) పక్షులు, జంతువులను వేటాడడానికి వచ్చి.. ఈ జంటపై దాడికి తెగబడ్డారు. యువతిపై అత్యాచారం చేసి, హత్యచేశారు. ప్రేమికుడిని చావబాది అతడి సెల్‌ఫోన్, నగదు అపహరించుకుపోయారు. ఈ దారుణంపై తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. నాటినుంచి ఏలూరులోని పోక్సో కోర్టులో విచారణ సాగింది. విచారణ పూర్తవడంతో శుక్రవారం తుదితీర్పు వెలువడింది. హంతకులకు రెండు జీవిత ఖైదులు, ఒక్కొక్క సెక్షన్‌లో రూ.పదివేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి ఉమాసునంద తీర్పు చెప్పారు. మృతురాలి తల్లిదండ్రులకు రూ.3లక్షల పరిహారం ఇవ్వాలని, గాయపడిన నవీన్ కుమార్‌కు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా తగిన పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారని ఎస్పీ చెప్పారు.

పోసానికి షరతులతో బెయిల్



గుంటూరు(లీగల్), మార్చి 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో విపక్ష నేతగా ఉన్న ప్రస్తుత సీఎం చంద్రబాబు మార్ఫింగ్ ఫొటోలను చూపుతూ అసభ్య పదజాలంతో దూషించిన కేసులో సినీ నటుడు పోసాని కృష్ణ మురళికి బెయిల్ మంజూరైంది. ఈ కేసులో గుంటూరు జిల్లా పోలీసులు గతవారం పోసానిని పీటీ వారెంట్‌పై కర్నూలు నుంచి తీసుకువచ్చి గుంటూరు సీఐడీ కేసుల స్పెషల్ కోర్టులో హాజరు పరిచారు. దీంతో న్యాయాధికారి పోసానిని జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. ప్రస్తుతం కృష్ణ మురళి గుంటూరు జిల్లా జైల్లో ఉన్నారు. కాగా, ఆయన దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం సాయంత్రం మెజిస్ట్రేట్ స్పందన ఉత్తర్వులు జారీ చేశారు. పోసానికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. రూ.లక్ష చొప్పున ఇరువురు వ్యక్తులతోపాటు సొంత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించారు. చార్జిషీటు దాఖలు చేసే వరకు గుంటూరు సీఐడీ రీజినల్ ఆఫీసులో రెండు వారాలకోసారి హాజరు కావాలని షరతు విధించారు. పోలీసులు పిలిచినప్పుడు వచ్చి విచారణకు సహకరించాలని ఆదేశించారు.

పోలీసు కస్టడీకి వైసీపీ నేత రాకేష్ గాంధీ

చిలకలూరిపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా చిలకలూరిపేట వైసీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి దొడ్డా రాకేష్ గాంధీని పోలీస్ కస్టడీకి న్యాయస్థానం గురువారం అనుమతిచ్చింది. ఈ కేసులో నిందితుడి తరఫున మాజీ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదించగా, ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ ఎస్ఎస్ సుకుమార్ వాదనలు వినిపించారు. వాద ప్రతివాదనల అనంతరం నిందితుని బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. నిందితుడిని 48 గంటల పాటు పోలీస్ కస్టడీకి అనుమతించింది. శ్రీకాకుళం సబ్ జైల్లో ఉన్న నిందితుడిని చిలకలూరిపేటకు తీసుకురావడానికి అర్బన్ పోలీసులు అక్కడకు వెళ్లారు. పోలీస్ కస్టడీకి తీసుకొని 48 గంటల పాటు చిలకలూరిపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిందితుడిని విచారించనున్నారు.

వంశీ బెయిల్ విచారణ 26కి వాయిదా

- పోలీసు కస్టడీ పిటిషన్ కొట్టేసిన కోర్టు



విజయవాడ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్‌పై విచారణను కోర్టు ఈనెల 26వ తేదీకి వాయిదా వేసింది. విజయవాడ జిల్లా జైలులో ఉన్న తనకు బెయిల్ ఇప్పించాలని వంశీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానంలో బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. గురువారం దీనిపై వాదనలు జరిగాయి. కొనసాగింపుగా శుక్రవారమూ జరగాల్సి ఉంది. అయితే దీన్ని 26కి వాయిదా వేస్తూ న్యాయాధికారి హిమబిందు ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో విచారణ నిమిత్తం వంశీని 10 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలంటూ సీఐడీ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దానిని కొట్టేస్తూ న్యాయాధికారి తిరుమలరావు ఉత్తర్వులు ఇచ్చారు.



వైసీపీ నాయకుడు ఫయాజ్‌బాషాతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

తాడిపత్రిలో ఉద్రిక్తత

- వైసీపీ నేత ఇంటి నిర్మాణంపై వివాదం

తాడిపత్రి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రిలో శుక్రవారం ఉద్రిక్తత తలెత్తింది. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ కౌన్సిలర్ ఫయాజ్‌బాషా చేపట్టిన ఇంటి నిర్మాణం వివాదానికి దారితీసింది. అనుమతి పొందిన ప్లాన్ కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం చేపట్టారని పేర్కొంటూ మున్సిపల్ అధికారులు శుక్రవారం కూల్చివేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో అధికారులకు, ఫయాజ్‌బాషాకు మధ్య వాగ్వాదం జరిగింది. తనకు అన్ని అనుమతులు ఉన్నాయని, కోర్టును కూడా ఆశ్రయించానని ఫయాజ్ తెలిపారు. పైఅంతస్తుకు మాత్రమే అనుమతి లేదని, అలాంటప్పుడు మొత్తం ఇంటిని ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు. కోర్టు ఇచ్చిన పత్రాలను చూపించారు. ఈ క్రమంలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అక్కడికి రావడంతో ఉద్రిక్తత ఏర్పడింది. వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య మాటమాట పెరగడంతో ఫయాజ్ బాషా ఇంటిపైకి జేసీ అనుచరులు రాళ్ల వర్షం కురిపించారు. పరిస్థితి చేయి దాటిపోవడంతో ఫయాజ్‌బాషాను పోలీసులు స్టేషన్‌కు తరలించి, జేసీని ఆయన అనుచరులను అక్కడ నుంచి పంపించేశారు.

బెంగళూరులో ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

- ముఖంపై పిడిగుద్దులు, కాలితో తన్నుతూ వీరంగం వేసిన కేఎస్ఆర్టీసీ బస్సు డ్రైవర్
- ప్రొద్దుటూరు బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



బెంగళూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బెంగళూరు మెజిస్టిక్‌లోని కేఎస్ ఆర్టీసీ బస్టాండులో ఏపీఎస్ ఆర్టీసీ బస్సు డ్రైవర్ రవిశంకర్‌రెడ్డిపై దాడి జరిగింది. కేఎస్ ఆర్టీసీ బస్సు డ్రైవర్ హనుమంత చలవాది ఆయనపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గురువారం రాత్రి మెజిస్టిక్ బస్టాండులో శ్రీసత్యసాయి జిల్లా కదిరి బస్సు బయల్దేరేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో కేఎస్ ఆర్టీసీ బస్సు వచ్చింది. బస్సు అడ్డంగా ఉంచుతావా అంటూ కదిరి బస్సు డ్రైవర్‌తో కేఎస్ ఆర్టీసీ డ్రైవర్ వాగ్వాదానికి దిగాడు. అంతలోనే కడప జిల్లా ప్రొద్దుటూరు బస్సు డ్రైవర్ రవిశంకర్‌రెడ్డి అక్కడికి వెళ్లి జోక్యం చేసుకున్నారు. దీంతో కోపోద్రిక్తుడైన కేఎస్ ఆర్టీసీ డ్రైవర్ హనుమంత.. రవిశంకర్ రెడ్డి ముఖంపై పిడిగు ద్దు గుద్దాడు. కిందకు పడిపోయినా వదలకుండా కాలితో తన్నాడు. దాడిలో గాయపడ్డ రవిశంకర్‌రెడ్డిని ఇతర సిబ్బంది ఆసుపత్రికి తరలించారు. అతని ముఖంపై వైద్యులు ఐదు కుట్లు వేశారు. కేఎస్ ఆర్టీసీ ఉన్నతాధికారులు డ్రైవర్ హనుమంతపై సస్పెన్షన్ వేటు వేశారు.

సీమ కంట్లో జగన్ కారం!

- సాంకేతిక అధ్యయనం లేకుండానే సీమ ఎత్తిపోతలకు నాడు పాలనామోదం
- డీపీఆర్ సిద్ధం కాకుండానే జీవో జారీ
- పర్యావరణ అనుమతులూ తీసుకోలేదు
- దీంతో 2020 అక్టోబరు 19న ఎన్‌జీటీ స్టే
- పర్మిషన్ ఇచ్చేది లేదని తాజాగా తేల్చేసిన ఈఏసీ
- ఆ పాపం కూటమిపై నెట్టేందుకు జగన్ యత్నం
- నీలి మీడియాతో విషపు రాతలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



పుట్టినగడ్డనే మోసగించారు. ముందస్తు అనుమతులు తీసుకోకుండా రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రకటించారు.. ఆనక ఎన్‌జీటీ దానిని నిలిపివేస్తే.. స్టే ఎత్తివేయించేందుకు ఏ దశలోనూ ప్రయత్నించలేదు. ఫలితంగా ఆ పథకానికి పర్యావరణ అనుమతులు ఇచ్చేది లేదని కేంద్రం తాజాగా తేల్చిచెప్పింది. దీంతో సీమ కరువును పారదోలడానికే ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టానంటూ జగన్ ఆడిన డ్రామా బయటపడింది. దీని నుంచి జనం దృష్టి మళ్లించేందుకు.. కూటమి ప్రభుత్వం వల్లే పథకం ఆగిపోయిందంటూ తప్పుడు కథనాలను నీలి మీడియాలో వండివారుస్తున్నారు.

రాజకీయ ప్రయోజనాల కోసం నాటి సీఎం జగన్ 2020 ఆగస్టులో రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రకటించారు. కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలను కరువురహితం చేసి.. 19 లక్షల ఎకరాలకు నీరిచ్చేందుకంటూ రూ.3,278 కోట్ల అంచనా వ్యయంతో ఈ స్కీంకు పాలనానుమతి ఇచ్చేశారు. అధ్యయనం చేయలేదు. ప్రాజెక్టు డిజైన్లే రూపొందించలేదు. పర్యావరణ మదింపు కూడా చేయలేదు. అసలు సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)నే తయారుచేయకుండా జీవో జారీచేసేశారు. శ్రీశైలం జలాశయం ఎగువన 800 అడుగుల్లో సంగమేశ్వరం వద్ద నుంచి కుడి ప్రధాన కాలువలోకి రోజుకు టీఎంసీ చొప్పున నీటిని ఎత్తిపోస్తామని పేర్కొన్నారు. దీనిపై తెలంగాణకు చెందిన గవినోళ్ల శ్రీనివాస్ జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్‌జీటీ)ను ఆశ్రయించారు. పర్యావరణంతోపాటు ఎలాంటి అనుమతులూ లేకుండా ఏకంగా పనులే చేపట్టారని తెలిపారు. అయితే ఎలాంటి పనులూ చేయడం లేదని.. డీపీఆర్ తయారీ కోసమే తవ్వకాలు సాగిస్తున్నామని జగన్ సర్కారు బుకాయించింది. దీనిపై సర్వేకు ఎన్‌జీటీ ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి, కేంద్ర అటవీ పర్యావరణ శాఖ అనుమతులు కావాలని స్పష్టం చేసింది. దీంతో సీమ స్కీంపై ఎన్‌జీటీ స్టే విధించింది. కేంద్ర అటవీ శాఖ అనుమతులు పొందాకే పనులు చేపట్టాలని 2021 డిసెంబరులో మధ్యంతర ఉత్తర్వు జారీ చేసింది. ఆ తర్వాత మూడేళ్లు అధికారంలో ఉన్న జగన్.. ఆ స్టే ఉత్తర్వులు ఎత్తివేయించేందుకు ప్రయత్నించలేదు. కనీసం కేంద్ర శాఖలతో సంప్రదింపులు జరుపలేదు. ఇప్పుడు కేంద్ర పర్యావరణ శాఖ ఆధ్వర్యంలోని పర్యావరణ మదింపు కమిటీ అనుమతిచ్చేది లేదని తేల్చిచెప్పడంతో కూటమి ప్రభుత్వంపై నెపం మోపాలని చూస్తున్నారు.

ఈ ప్రశ్నలకు బదులేది?

చంద్రబాబు ప్రభుత్వంపై జగన్ విమర్శలను సాగునీటి రంగ నిపుణులు ఆక్షేపిస్తున్నారు. పర్యావరణ అనుమతుల కోసం తన హయాంలో మాజీ సీఎం ఎందుకు ప్రయత్నించలేదని నిలదీస్తున్నారు. పూర్తి నిర్లక్ష్యం వహించడంపై రాష్ట్రానికి సంజాయిషీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పుట్టిన గడ్డకు ద్రోహం చేసిన ఆయన.. సీమ ప్రజలకు క్షమాపణలు కోరాలని జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు అంటున్నారు. నిపుణులు ఈ సందర్భంగా జగన్‌కు కొన్ని ప్రశ్నలు సంధించారు.

- నాటి సీఎం కేసీఆర్ పిలువగానే.. రాష్ట్రానికి అన్యాయం చేసేలా గోదావరి నదిపై తెలంగాణ నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి జగన్ 2019 జూన్ 21న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే తెలంగాణ సీఎంతో సామరస్యంతో ఉంటున్నామని సమర్థించుకున్న ఆయన.. మరి తన ప్రాంతానికి న్యాయం చేసే రాయలసీమ ఎత్తిపోతల పథకానికి మద్దతివ్వాలని కేసీఆర్‌ను నాడెందుకు కోరలేదు?
- రాయలసీమ ఎత్తిపోతల నిర్మాణ ఆచరణలో అనుసరించాల్సి సాంకేతిక, పాలనా విధానాలను ఎందుకు పాటించలేదు? డీపీఆర్ రూపొందించకుండానే రూ.3,278 కోట్లకు పాలనామోదం ఎలా ఇచ్చేశారు?
- పర్యావరణ అనుమతులు లేకుండా ప్రాజెక్టును చేపట్టవద్దంటూ ఎన్‌జీటీ ఆదేశించినా.. కాంట్రాక్టు సంస్థలతో ఎలా ఒప్పందం చేసుకున్నారు? 2020 అక్టోబరు 19న ఎన్‌జీటీ ఆదేశాలు ఇస్తే.. తొమ్మిది నెలలు నిద్రపోయి.. 2021 జూన్ 8వ తేదీన పర్యావరణ ఆమోదం కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపడంలోనే పథకంపై మీకున్న శ్రద్ధ ఏపాటిదో తేలిపోయింది.
- జగన్ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనపై 2021 జూన్ 17వ తేదీన.. 2021 జూలై 19వ తేదీన పర్యావరణ మదింపు కమిటీ (ఈఏసీ) చర్చించి మరింత సమాచారం కావాలని కోరింది. డీపీఆర్ కూడా సమర్పించాలని కోరింది. సకాలంలో సమాచారం ఇవ్వకపోవడంతో రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రాజెక్టు ప్రతిపాదనల జాబితా నుంచి ఈఏసీ తొలగించడం నిజం కాదా?
- ఇది జరిగిన ఏడాది తర్వాత 2023 సెప్టెంబరు 20న గుర్గామ్‌కు చెందిన ఓయెంట్స్ సొల్యూషన్స్ సంస్థకు డీపీఆర్ బాధ్యతలను అప్పగించింది. ఆ డీపీఆర్‌ను ఈఏసీకి పంపగా.. సీమ ఎత్తిపోతల స్కీంను 2023 నవంబరు 11వ తేదీన తన ప్రాజెక్టుల జాబితాలో ఉంచింది. ఆ తర్వాత ఎన్‌జీటీ నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టారంటూ 2024 మార్చి 13వ తేదీన రాష్ట్రప్రభుత్వంపై రూ.2.65 కోట్ల జరిమానా విధించింది. ప్రాజెక్టుల జాబితా నుంచి దీనిని మళ్లీ తొలగించింది. తద్వారా రెండుసార్లు డీలిస్ట్ అయిన తొలి ప్రాజెక్టుగా రాయలసీమ ఎత్తిపోతల పథకం నమోదు కావడం వాస్తవం కాదా?
- డీపీఆర్ కోసమే రూ.883 కోట్లతో పంప్‌హౌస్ పనులు, మెషినరీ కొనుగోలు చేశామంటూ ఎన్‌జీటీ ముందు బుకాయించలేదా? రూరల్ ఎలక్ట్రికల్ కార్పొరేషన్ (ఆర్‌ఈసీ) నుంచి రూ.740 కోట్ల రుణం తీసుకోవడం, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేలా బలమైన వాదనలను ఎన్‌జీటీలో వినిపించేందుకు సమర్థులైన సీనియర్ న్యాయవాదులను నియమించకపోవడం నిజం కాదా?
- తాగునీటి అవసరాలకు ఈఏసీ ఆమోదం అక్కర్లేదని తెలిసినా మూడేళ్లు నిద్రపోయి ఎన్నికల ముందు 2023 ఆగస్టు 11వ తేదీన ప్రాజెక్టును తాగునీటి అవసరాలకు కుదిస్తూ పాలనామోదం ఇవ్వడం నిజం కాదా?

సేవకు సరైన 'సమయం'!

- రాష్ట్రంలో 'టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' సేవలు
- ఇప్పుడు వృద్ధుల సేవకోసం సమయం కేటాయించి.. భవిష్యత్తులో తామూ సేవలు పొందవచ్చు

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఇప్పుడు వృద్ధులు, వికలాంగులు, ఇతర నిస్సహాయులకు సేవ చేయండి! సేవ చేసిన 'సమయాన్ని' మీ ఖాతాలో దాచుకోండి. మీకు అవసరమైనప్పుడు అంతే సమయాన్ని మీకోసం కేటాయిస్తారు! ఇది... 'టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' సరికొత్త 'డిపాజిట్ స్కీమ్'! వృద్ధుల కోసం వినూత్న సేవలందించే టైం బ్యాంక్ ఇండియా కార్యక్రమాలు త్వరలో రాష్ట్రంలో ప్రారంభం కానున్నాయి. ఈ సంస్థ తరఫున రాజస్థాన్‌కు చెందిన వీసీ జైన్ బృం దం ప్రభుత్వ అధికారులతో శుక్రవారం భేటీ అయింది. సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా సేవలు అందిస్తామని చెప్పారు. వృద్ధుల్లో ఒంటరితనం పోగొట్టి వారికి సామాజిక అండ లభించాలన్న దే సీఎం ఆలోచన అని అధికారులు తెలిపారు. 'టైమ్ బ్యాంక్' సేవల ను దేశంలోనే మొట్టమొదటిసారి 2019లో సిక్కింలో అమలు చేశారు. ప్రస్తుతం రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లోను ఉచితంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సంస్థ మన రాష్ట్రంలోను తమ సేవలు ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. ఇప్పటికే విశాఖను పైలట్ జిల్లాగా తీసుకుని టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ సేవలు ప్రారంభించింది. అక్కడి పరిస్థితులపై అవగాహన వచ్చిన తర్వాత మరింత ముందుకు వెళ్లేందుకు ప్రణాళికను రచిస్తున్నారు.

పెరుగుతున్న ఒంటరి వృద్ధులు..: గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉండడం వలన వృద్ధులకు ఒంటరితనం ఉండేది కాదు. కానీ కాలక్రమేణా వారు ఒంటరిగా మారుతున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో దాదాపు 10.38 కోట్ల మంది సీనియర్ సిటిజన్లు ఉండగా 2047 నాటికి ఈ సంఖ్య 30 కోట్లకు చేరుకుంటుందని అంచనా. కాబట్టి భవిష్యత్‌లో రాష్ట్రంలోని వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకునేందు కు టైమ్ బ్యాంక్ అండగా నిలుస్తుంది. తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం-2007, దత్తత, పోషణ చట్టం-1956 ప్రకారం వృద్ధులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరు ఆనందంగా ఉన్నప్పుడే హ్యాపీ, హెల్తీ, వెల్తీ ఏపీ సాధ్యమౌతుందని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు.

టైం బ్యాంక్ పనిచేస్తుంది ఇలా..

టైం బ్యాంక్ ఆర్థిక లాభాపేక్షలేని సామాజిక వ్యవస్థ. వృద్ధులకు, ఒంటరిగా జీవించేవారికి సహాయం చేయడం కోసం దీనిని ప్రారంభించారు. ఈ బ్యాంకు సహాయం కావాలంటే ముందుగా సభ్యులుగా చేరాలి. దీనిలో సభ్యులు తమ సమయాన్ని డబ్బుకు బదులుగా సేవల కోసం ఉపయోగించుకుంటారు. బ్యాంకు సభ్యులైనవారు మరొక సభ్యుడైన ఒంటరివ్యక్తికి ఇంటిపనుల్లో సాయం, తోడుగా ఉండటం తదితర సహాయ పనులు చేసి ఆ సమయాన్ని తన ఖాతాలో డిపాజిట్ చేసుకోవచ్చు. సదరు సహాయం చేసిన వ్యక్తి తన అవసరంలో తన ఖాతాలో ఉన్న డిపాజిట్ సమయం మేరకు మరొక వ్యక్తి నుంచి సహాయం పొందవచ్చు.

50% పచ్చదనం లక్ష్యం

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడి
- ఏపీ నగర వనాల లోగో ఆవిష్కరణ



అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పచ్చదనం 50శాతానికి పెంచడానికి, అటవీ అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఏపీ నగర వనాల లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దార్శనిక నాయకత్వంలో అడవులు, పులుల కారిడార్‌ను బలోపేతం చేయడానికి, క్షీణించిన ఆవాసాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సహజ అడవులను అనుకరించే పట్టణ పచ్చని ప్రదేశాలను సృష్టించడం లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా 50 నగర వనాలు ఏర్పాటు చేయగా, 2024-25లో మరో 11 మంజూరయ్యాయని, అదనంగా మరో 12 నగర వనాల ఏర్పాటు ప్రతిపాదన పరిశీలనలో ఉందని చెప్పారు. అటవీకరణ, జీవ వైవిధ్య పరిరక్షణను ప్రోత్సహించేలా పట్టణ ప్రాంతాల్లో నగరవాసులకు ఈ వనాలు సహజ అనుభవాన్ని అందిస్తాయన్నారు. ఈ హరిత చొరవను మరింత విస్తరిస్తూ, పిఠాపురంలో కూడా ఒక నగర వనాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అడవులు, వన్య ప్రాణుల సంరక్షణ, పర్యావరణ సమతుల్యతకు అటవీ శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది చేస్తున్న కృషిని ప్రశంసించారు.

రాష్ట్రంలో 76 పులులు ఉన్నట్లు నివేదిక

కార్యక్రమంలో నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ కోసం పులులు, ఆహారం, ఇతర క్షీరదాల స్థితిపై 2024 వార్షిక నివేదికను విడుదల చేశారు. ఈ నివేదిక ప్రకారం పులుల సంఖ్యలో గణనీయమైన పెరుగుదలను సూచించగా, ప్రస్తుతం పిల్లలు మినహా 76 పులులు ఉన్నట్లు నిర్ధారించారు. అడవుల్ని, వన్య ప్రాణుల్ని కాపాడితే.. భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందని అటవీ ముఖ్య దళాధికారి ఏకే నాయక్ అన్నారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పోలీసు, అగ్నిమాపక సేవలకు ఉగాది పురస్కారాలు

- 9 మందికి ముఖ్యమంత్రి శౌర్య పతకాలు

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు, అగ్నిమాపక సేవల విభాగంలో విశిష్ట సేవలకుగాను ఉగాదిని పురస్కరించుకుని వివిధ రకాల అవార్డులు ఇస్తున్నట్టు ప్రభుత్వం శుక్రవారం జీవో జారీ చేసింది. రాష్ట్ర హోం శాఖలోని వివిధ విభాగాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి అర్హుల జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. పోలీసు, ఫైర్, విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విభాగాల నుంచి అర్హత ఉన్నవారిని ఎంపిక చేసినట్టు పేర్కొంది. పోలీసువిభాగంనుంచి ముఖ్యమంత్రి శౌర్య పతకానికి 9 మందిని ఎంపిక చేశారు.

ఆ హోటళ్లకు అనుమతులు రద్దు

- ఏడుకొండల్లో వ్యాపారీకరణను అనుమతించం
- అందుకే గత ప్రభుత్వం ఇచ్చిన 35.32 ఎకరాలను రద్దు చేస్తున్నాం
- అన్నిరాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు
- గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి నూతన ట్రస్ట్
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి
- మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా స్వయంగా భక్తులకు అన్నప్రసాదం వితరణ
- అన్నదానానికి రూ.44 లక్షల విరాళం
- కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం



మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్. చిత్రంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు తదితరులు

తిరుమల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఏడుకొండల్లో వ్యాపారీకరణను (కమర్షియలైజేషన్) అనుమతించబోమని, వాటి పరిధిలో గత ప్రభుత్వం హోటళ్ల నిర్మాణానికి ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణితో కలిసి సంప్రదాయ వస్త్రధారణతో వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుంచి ఆలయం వద్దకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. దేవాన్ష్ పేరిట ఒకరోజు అన్నప్రసాద కార్యక్రమానికి రూ.44 లక్షలు విరాళంగా అందించారు. మనవడితో కలిసి చంద్రబాబు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి చంద్రబాబు అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. "నా ప్రథమ ప్రాధాన్యం శ్రీవేంకటేశ్వరస్వామి. ఏడుకొండలు శ్రీవారి సొంతం. వీటిని అపవిత్రం చేయకూడదు, అందువల్లే గత ప్రభుత్వంలో ముంతాజ్, ఏఆర్‌కే, దేవ్‌లోక్‌కు ఏడుకొండలకు అనుకుని ఉన్న ప్రాంతంలో ఇచ్చిన 35.32 ఎకరాల స్థలాన్ని రద్దు చేస్తున్నాం." అని చంద్రబాబు వెల్లడించారు. వివిధ ప్రాంతాల్లో హోటళ్లు కడుతున్న ఒబెరాయ్ సంస్థ, అలిపిరిలో తమ హోటల్ పేరు మారుస్తామని, శాకాహారం మాత్రమే పెడతామని చెప్పినప్పటికీ ఏడుకొండలు ప్రాంతంలో ప్రైవేట్ వ్యక్తులు ఉండకూడదని తేల్చిచెప్పామన్నారు. అవసరమైతే రోడ్డుకు అవతలి వైపు నిర్మించుకోవాలని సూచించానని చెప్పారు. ఏపీ టూరిజం పరిధిలోని స్థలాన్ని కూడా టీటీడీకే అప్పజెప్పేలా చర్యలు తీసుకునే ఆలోచన చేస్తున్నామన్నారు. "అమరావతిలో ఇటీవల జరిగిన శ్రీవారి కల్యాణం రాజధానికి నూతన శోభను తెచ్చింది. ఈ సందర్భంగా నేను నూతన సంకల్పం చేశాను. చాలా గ్రామాల్లో ఆలయాలు లేవు. వాటి నిర్మాణం కోసం నూతన ట్రస్టును ఏర్పాటు చేస్తాం. శ్రీవాణిట్రస్టుకు వచ్చే నిధులను కూడా ఈ నూతన ట్రస్టులో పెడతాం. ప్రస్తుతానికి ఈ ట్రస్టుకు 'శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల నిర్మాణ నిధి' అనే పేరును అనుకుంటున్నాం. త్వరలోనే టీటీడీ ఓ మంచి పేరు నిర్ణయిస్తుంది." అని చంద్రబాబు తెలిపారు. హథిరాంజీమఠం భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆలయాల నిర్వహణలో స్థానిక భక్తుల భాగస్వామ్యం పెంచుతామని తెలిపారు. టీటీడీ తరహాలో మిగిలిన ఆలయాలకు స్వయంప్రతిపత్తి కల్పిస్తారా అన్న ప్రశ్నకు బదులిస్తూ.. రాష్ట్రంలో అద్భుత టెంపుల్ ఎకో సిస్టమ్ ఉందని తెలిపారు. "రూ.20 కోట్ల నుంచి రూ.వంద కోట్ల వరకు రెవెన్యూ వచ్చే ఆలయాలు ఏడు, రూ.ఐదు కోట్లపైబడి ఆలయాలు వచ్చేవి 13 ఉన్నాయి. రాష్ట్రంలోని ఆలయాలను అభివృద్ధి చేసి టూరిస్టులకు అనుకూలంగా మలుస్తాం." అని చంద్రబాబు తెలిపారు. శ్రీవారి ఆలయాల్లో పనిచేసే వ్యక్తులు హిందువులే అయి ఉండాలని స్పష్టం చేశారు.

అరెస్టు చేయిస్తానని చెప్పా..

గతంలో అధికారులు తన వద్దకు వచ్చి తిరుమలలో నీళ్ల లేని కారణంగా, మూడు నెలల పాటు ఆలయాన్ని మూసివేయాలని కోరారని చంద్రబాబు గుర్తు చేశారు. "వాళ్లను గట్టిగా హెచ్చరించా. 90నుంచి 95 రోజుల్లో కల్యాణి డ్యాం నుంచి తిరుమలకు నీళ్ల తీసుకువచ్చేలా పైప్‌లైన్ ఏర్పాటుచేయండి. లేకుంటే అరెస్ట్ చేయిస్తానని వార్నింగ్ ఇచ్చాను." అని తెలిపారు. అంతకుముందు.. చంద్రబాబు కుటుంబసభ్యులకు మహాద్వారం వద్ద టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఆలయ అర్చక బృందం ఇస్తికఫాల్ స్వాగతం పలికారు.

అన్నదానం మా ఆనవాయితీ: బాబు

"మా ఇంటి కులదైవం వేంకటేశ్వరస్వామి. మా దేవాన్ష్ పుట్టినప్పటి నుంచీ ఏటా తిరుమలలో అన్నదానం చేయడం ఆనవాయితీగా పెట్టుకున్నాం." అని సీఎం చంద్రబాబు వివరించారు. టీటీడీలో అన్నదానం ట్రస్టును ఎన్టీఆర్ ప్రారంభించారనీ, ఇప్పటివరకు ఇబ్బందులు లేకుండా అన్నదాన కార్యక్రమాలు సజావుగా సాగుతున్నాయన్నారు. ఈ పథకంలో ప్రస్తుతం రూ2,200 కోట్ల కార్పస్ ఫండ్ ఉందని, ప్రతి రోజూ ఎంతోమంది భక్తులు ట్రస్టుకు విరాళాలు ఇవ్వడంతోపాటు మరికొందరు ఒకరోజు అన్నప్రసాద వితరణకు ముందుకు వస్తున్నారని సీఎం తెలిపారు. శ్రీవారి ఆలయ ప్రక్షాళనతోనే పరిపాలన ప్రారంభించానని, అందులోభాగంగా తొలి పోస్టింగ్ టీటీడీ ఈవోగా శ్యామలరావును ఇచ్చానని గుర్తుచేశారు. రాయలసీమలో పెద్దగా ఆస్పత్రులు లేని విషయం గుర్తించి.. ప్రాణదానం ట్రస్ట్‌ను ఏర్పాటుచేశామన్నారు. ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల్లో లోపాలుంటే సరిచేస్తామన్నారు.

చీరపై రామాయణ ఘట్టాలు



దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సమయంలో నారా బ్రాహ్మణి కట్టుకున్న చీర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వాల్మీకి రామాయణాన్ని చీరపై ప్రత్యేక డిజైన్‌గా ముద్రించారు. రామాయణ ఘట్టాలతో పాటు వృక్షాలు, శంఖు చక్ర నామాలతో డిజైన్ చేశారు. ఆమె ధరించిన చీరను భక్తులు ఆశ్చర్యంగా చూశారు.

భక్తులకు అల్పాహారం వడ్డించిన దేవాన్ష్



'దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా ఆనవాయితీగా ఈ ఏడాది కూడా ఒకరోజు అన్నప్రసాదాల కయ్యే ఖర్చు రూ.44 లక్షలు అన్నప్రసాదం ట్రస్టుకు విరాళంగా ఇచ్చాం. ఆ తర్వాత అన్నదాన కేంద్రంలో తాత, నాయనమ్మతో కలిసి దేవాన్ష్ భక్తులకు అల్పాహారాన్ని స్వయంగా వడ్డించాడు' అని నారా బ్రాహ్మణి తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు.

మాట నిలబెట్టుకున్న చంద్రబాబు

- సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి

పొందూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలను గౌరవించే వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు అని సాధుపరిషత్ అధ్యక్షుడు, శ్రీకాకుళం జిల్లా ఆనందాశ్రమ పీఠాధిపతి స్వామి శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. అలిపిరి వద్ద నిర్మిస్తున్న అన్యమతస్థుల హోటల్ నిర్మాణం అనుమతులను రద్దుచేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో హోటల్ నిర్మాణానికి ఇచ్చిన అనుమతుల రద్దుకోసం స్వామీజీలు, పీఠాధిపతులు, హిందూసంఘాలు చేపట్టిన పోరాటాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గౌరవించారన్నారు. తిరుమల నుంచే ప్రక్షాళన ప్రారంభిస్తానన్న ముఖ్యమంత్రి తన మాట నిలబెట్టుకున్నారన్నారు.

అధికార పరిధి దాటి వ్యవహరించారు

- రంపచోడవరం డివిజనల్ ఆఫీసర్ ప్రొసీడింగ్స్‌పై హైకోర్టు ఆక్షేపణ
- ప్రొసీడింగ్స్‌ను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ పరిధిలోని డివిజనల్ ఆఫీసర్ కోర్టులలో ప్రాక్టీస్ చేసేందుకు కాంపిటెంట్ అథారిటీ నుంచి అనుమతి తీసుకోవాలంటూ రంపచోడవరం ఏజెన్సీ డివిజనల్ ఆఫీసర్/సబ్ కలెక్టర్ ఈనెల 7న ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. వాటిని సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఏజెన్సీ డివిజనల్ ఆఫీసర్ చర్య అధికార పరిధి దాటి వ్యవహరించడమేనని వ్యాఖ్యానించింది. ఇలాంటి చర్యలను అనుమతించబోమని పేర్కొంది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి, డైరెక్టర్, అల్లూరి జిల్లా కలెక్టర్, రంపచోడవరం సబ్‌కలెక్టర్‌కు నోటీసులు జారీ చేసింది. విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి గురువారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. ఏజెన్సీ పరిధిలోని డివిజనల్ ఆఫీసర్ కోర్టులలో ప్రాక్టీస్ చేసేందుకు కాంపిటెంట్ అథారిటీ నుంచి అనుమతి తీసుకోకుంటే చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామంటూ రంపచోడవరం ఏజెన్సీ డివిజనల్ ఆఫీసర్ ఈ నెల 7న ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ అడ్వొకేట్ వెంకట రత్న ప్రకాశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎస్.శివారెడ్డి వాదనలు వినిపించారు.

నేడే అంగన్వాడీ నోటిఫికేషన్

- 948 కార్యకర్తలు, హెల్పర్ పోస్టుల భర్తీ: మంత్రి సంధ్యారాణి



అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల పోస్టుల భర్తీకి కూటమి సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటిలో 160 అంగన్వాడీ కార్యకర్తలు, 60 మినీ అంగన్వాడీ కార్యకర్తలు, 728 ఆయాలు.. వెరసి 948 పోస్టులు భర్తీ చేయనున్నట్లు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఈమేరకు శనివారం జిల్లాల్లో పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను కలెక్టర్లు విడుదల చేయనున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోస్టుల భర్తీ ప్రక్రియ మొత్తం పారదర్శకంగా చేపట్టాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ పోస్టుల ఎంపికకు రాతపరీక్ష ఉంటుందని, అర్హత ఉన్నవాళ్లను మాత్రమే ఎంపిక చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. అలాగే, రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలో 139 కొత్త అంగన్వాడీ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి సంధ్యారాణి తెలిపారు. పీఎంజన్‌మన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో 139 కొత్త అంగన్వాడీ సెంటర్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.20.80 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. అంగన్వాడీల సేవలను మరింత బలోపేతం చేయడంతోపాటు, మహిళలకు ఉపాధి అవకాశాలను పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పిల్లల పోషణ, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చామని వెల్లడించారు. పిల్లలు, మహిళల అభివృద్ధి కార్యక్రమాల కోసం 2025-26 బడ్జెట్‌పై కూడా అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు మంత్రి తెలిపారు.

శనివారం 'నో బ్యాగ్ డే'

- ఆ రోజు క్విజ్‌లు, డిబేట్లు, ఇతర పోటీలు
- 2025-26 అకడమిక్ క్యాలెండర్‌పై కసరత్తు



అమరావతి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం నుంచి 'శనివారం.. నో బ్యాగ్ డే'గా మారనుంది. ఆ రోజున పిల్లలు బడులకు బ్యాగులు తీసుకురావాల్సిన అవసరం లేదు. ఆ రోజు ప్రతిరోజూ నిర్వహించే తరగతులకు బదులుగా ఇతరత్రా పోటీలు నిర్వహించనున్నారు. అందుకు అనుగుణంగా పాఠశాల విద్యాశాఖ 2025-26 అకడమిక్ క్యాలెండర్ రూపొందిస్తోంది. ప్రస్తుతం శనివారంతో సహా వారమంతా ఒకే విధంగా తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే విద్యార్థులకు కొత్తదనం ఉండేలా శనివారం రోజున క్విజ్‌లు, సమకాలీన అంశాలపై డిబేట్లు, సదస్సులు, వృత్తి విద్య అంశాలపై అవగాహన, క్రీడలు, రాజ్యాంగంపై మౌఖిక ప్రశ్నల పోటీలు లాంటివి నిర్వహిస్తారు. పాఠ్యాంశాలకు సంబంధిత అంశాలే అయినా రొటీన్‌గా కాకుండా మౌఖిక విధానంలో టెస్టులు పెడతారు. దీనివల్ల విద్యార్థులకు వారంలో ఒకరోజు కొత్తగా ఉండటంతో పాటు, కొత్త అంశాలపై అవగాహన పెరుగుతుందని పాఠశాల విద్యా వర్గాలు అంటున్నాయి. ప్రస్తుతం నెలలో మూడో శనివారం నో బ్యాగ్ డేగా ఉన్నా అది అమలుకావట్లేదు. కానీ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతి శనివారాన్ని కచ్చితంగా నో బ్యాగ్ డేగా అమలుచేయాలని నిర్ణయించారు. కాగా, ఏటా బడులు పునఃప్రారంభమయ్యే జూన్‌లో అకడమిక్ క్యాలెండర్ విడుదల చేస్తుండగా, ఇకపై వేసవి సెలవులకు ముందే విడుదల చేయనున్నారు. ఇందులో భాగంగా వచ్చే నెల రెండో వారంలో క్యాలెండర్ విడుదలకు కసరత్తు చేస్తున్నారు. మొత్తం పనిదినాలు 233 ఉంటాయి. అందులో కొన్ని ఆప్షనల్ సెలవులుంటాయి. అలాగే 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రత్యేకంగా బ్రిడ్జి కోర్సులు నిర్వహిస్తారు.

నాలుగు నెలల్లో విశాఖ మాస్టర్ ప్లాన్

- రాబోయే 30 ఏళ్లకు రూపకల్పన: మంత్రి నారాయణ
- జీవీఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్ష




అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): 'విశాఖపట్నం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌ను నాలుగు నెలల్లోగా సిద్ధం చేస్తాం. రాబోయే 30 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని దీనిని రూపొందిస్తున్నాం' అని మంత్రి నారాయణ తెలిపారు. విశాఖపట్నం నగర అభివృద్ధితోపాటు సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై జీవీఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలతో మంత్రి నారాయణ శుక్రవారం అమరావతి సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేశ్ బాబు, వంశీ కృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, ఏపీయూఎఫ్ఐడీసీ చైర్మన్ పీలా గోవింద్, ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. వైజాగ్‌లో రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ సమస్యలు, మెట్రో రైల్ ప్రాజెక్టు, భూముల ఆక్రమణ, తాగునీటి సమస్య, టీడీఆర్ బాండ్లు, యూజీడీ తదితర అంశాలను సమావేశంలో ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. సమావేశం అనంతరం మంత్రి నారాయణతోపాటు పలువురు ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడారు.

టీడీఆర్ బాండ్లపై స్పెషల్ డ్రైవ్

'గత ప్రభుత్వం స్వార్థంతో మాస్టర్ ప్లాన్ రూపొందించారు. భవిష్యత్ ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకొని మళ్లీ మార్పులు చేసి, ప్రజాభిప్రాయంతో ఫైనల్ ప్లాన్ విడుదల చేస్తాం. విశాఖలో కొన్ని చోట్ల రోడ్ల వెడల్పు చేయాల్సి ఉంది. మెట్రో రైల్ కూడా మాస్టర్ ప్లాన్‌లో భాగమే. టీడీఆర్ బాండ్లపై అన్ని మున్సిపాలిటీల్లో స్పెషల్ డ్రైవ్ జరుగుతోంది. త్వరలోనే పరిష్కారమవుతాయి.' అని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ, 'వైజాగ్ అభివృద్ధిపై జరిగిన సమీక్షలో కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. వివిధ సమస్యల పరిష్కారానికి మంత్రి నారాయణ అంగీకారం తెలిపారు' తెలిపారు. ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు విష్ణుకుమార్ రాజు మాస్టర్ ప్లాన్‌పై మాట్లాడారు. కాగా, రాష్ట్రంలో టౌన్‌ప్లానింగ్‌లో సంస్కరణలు అమలు చేస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. శుక్రవారం టౌన్‌ప్లానింగ్‌పై అధికారులతో ఆయన సమీక్షించారు. 'ఎక్కడ ఎలాంటి నిర్మాణం చేసినా అన్నీ రకాలుగా ఆహ్లాదకరంగా ఉండాలి. అసోషియేషన్ తరఫున కొన్ని మినహాయింపులు కావాలని బిల్డర్లు కోరారు. కొన్ని సాధ్యం కాదని తేల్చి చెప్పాం.' అని మంత్రి నారాయణ తెలిపారు.

పురాతన నిర్మాణాలు కాదు... నేహారెడ్డి నిర్మించిన పునాదులు



ఇది పురావస్తు శాఖ తవ్వకాల్లో బయటపడ్డ నిర్మాణం కాదు... భీమిలి బీచ్‌లో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి కంపెనీ చేపట్టిన నిర్మాణాలు. రెండేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి అనుమతులూ లేకుండానే బీచ్‌లో స్టార్ హోటల్ నిర్మాణానికి పునాదులు తీశారు. భారీ కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టారు. ఈ ప్రాంతం కోస్తా నియంత్రణ మండలి పరిధిలో ఉంది. వాటిపై పలువురు హైకోర్టుకు వెళ్లారు. ఆ నిర్మాణాలను పూర్తిగా తొలగించి నివేదిక ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. మేల్కొన్న అధికారులు బీచ్‌లో పునాదులను తవ్వి తీస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి బయల్పడ్డ నిర్మాణమే ఇది. చతురస్రాకారంలో ఉన్న నిర్మాణాల్లో ఒకటి 10 అడుగుల ఎత్తు ఉండగా, మరొకటి 12 అడుగులు ఉంది. ప్రహరీ కోసం నిర్మించిన పునాదులు 700 మీటర్లు, 1,000 మీటర్ల పొడవున ఉన్నాయి. హైకోర్టుకు నివేదిక ఇవ్వాల్సిన సమయం దగ్గరపడడంతో అధికారులు పనుల్లో వేగాన్ని పెంచారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

అమరావతి ఓఆర్ఆర్ అలైన్‌మెంట్‌లో మార్పులు



- తెనాలి, పేరేచర్ల దగ్గర నాలుగుచోట్ల సూచించిన కేంద్రం
- వచ్చే మార్చి నాటికి పనులకు శ్రీకారం చుట్టే యోచన

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు(ఓఆర్ఆర్) అలైన్‌మెంట్‌ను మార్చాలని కేంద్రం సూచించింది. ఇటీవల నిర్వహించిన డ్రోన్ సర్వేలో ప్రస్తుత అలైన్‌మెంట్‌కు ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని గుర్తించారు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో తెనాలి, పేరేచర్ల గ్రామాల వద్ద నాలుగు ప్రాంతాల్లో మార్పులు చేయాలని జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్)కు కేంద్ర ఉపరితల రవాణా శాఖ నిర్దేశించింది. ఈ మేరకు ఎన్‌హెచ్ అమరావతి డివిజన్ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నారు. గత నాలుగేళ్లలో ఆయా ప్రాంతాల్లో చెరువులతో పాటు శ్మశానాలు, ఇతర నీటి వనరులు అభివృద్ధి చెందినట్టు గుర్తించారు. ఈ నాలుగు చోట్ల 43 కి.మీ. మేర అమరావతి ఓఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చనున్నారు. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డుకు 150 మీ. వెడల్పున అనుమతి ఇవ్వాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అయితే బెంగళూరు ఓఆర్ఆర్‌కు గరిష్ఠంగా 70 మీ. మేర అనుమతి ఇచ్చామని అమరావతికి కూడా అంతవరకే ఇవ్వగలమని చెబుతున్నట్టు తెలుస్తోంది. దీనిపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం చంద్రబాబు రాసిన లేఖలో 150మీటర్లకు అనుమతి ఇవ్వాలని ప్రత్యేకంగా కోరారు. ఈ విషయంలో కేంద్రం అంతిమ నిర్ణయం తీసుకునే వరకు అలైన్‌మెంట్ ఖరారయ్యే అవకాశాలు లేవని తెలుస్తోంది. 70మీ. వెడల్పు రహదారికి 8 వరసలకు అనుగుణంగా భూ సేకరణ చేయాల్సి ఉంటుంది. అదే 100, 150 మీటర్లకు పెరిగితే 14, 18 వరసలకు తగినట్లుగా భూసేకరణకు అలైన్‌మెంట్‌ను నిర్ధారించాల్సి ఉంటుంది. ఓఆర్ఆర్ వెడల్పు పెరిగే కొద్దీ భూసేకరణ కూడా పెరిగే అవకాశం ఉండటంతో ఎన్‌హెచ్ అమరావతి అధికారులు ప్రస్తుతానికి ఈ విషయంలో వేచి చూస్తున్నారు. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో భూ సేకరణ కోసం ఇప్పటికే జేసీలను నియమించారు. రహదారి వెడల్పు ఎన్ని మీటర్లో తేలినవెంటనే భూసేకరణప్రక్రియను ప్రారంభిస్తారు.

పర్యావరణ అనుమతులకు దరఖాస్తు

ఓఆర్ఆర్ గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టు కాబట్టి పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా ఉండాల్సిందే. ఈ నేపథ్యంలో అలైన్‌మెంట్ నిర్ధారించిన తర్వాత ఐదు జిల్లాల పరిధిలో అనుమతుల కోసం ఎన్‌హెచ్ అధికారులు దరఖాస్తు చేయనున్నారు. ఓఆర్ఆర్ కారణంగా పర్యావరణానికి ఏమైనా విఘాతం కలుగుతుందేమో తెలుసుకోవటానికి గాలి, నీరు, ధ్వని కాలుష్యాలకు సంబంధించి సర్వే నిర్వహిస్తారు. అంతిమంగా ప్రజల అభ్యంతరాల స్వీకరణకూడా పూర్తయ్యాక కేంద్ర పర్యావరణ శాఖనుంచి అనుమతులువస్తాయి. అలాగే ఓఆర్ఆర్ పరిధిలో అటవీ భూములు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో గుర్రాజుపాలెం, పేత్రంపాడు- గంగినేనిపాలెం, కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ (తిమ్మాపురం) ఉన్నందున వీటికి సంబంధించి అటవీ భూముల డీనోటిఫై కోసం కేంద్ర అటవీ శాఖకు ప్రతిపాదనలు పంపాల్సి ఉంది.

పదోన్నతులపై తీర్పును అమలు చేయలేదే?

- 2018నాటి ఉమ్మడి హైకోర్టు తీర్పు అమలులో తీవ్ర నిర్లక్ష్యం
- మూడు నెలల్లో పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయండి
- లేకుంటే సీఎస్ హాజరుకావాలని హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు పదోన్నతి కల్పన విషయంలో ఉమ్మడి హైకోర్టు 2018లో ఇచ్చిన తీర్పు అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. పదోన్నతి పొందిన ఉద్యోగుల్లో రిజర్వుడు కేటగిరీకి చెందిన ఉద్యోగులు ఎంతమంది ఉన్నారో గుర్తించడంలో ఎలాంటి పురోగతి లేదని ఆక్షేపించింది. మరోవైపు రిజర్వుడు కేటగిరీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించడం వల్ల ప్రభావితమైన ఉద్యోగులకు పదోన్నతి ఇచ్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొంది. ఉమ్మడి హైకోర్టు తీర్పునకు అనుగుణంగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేసి, నివేదికను కోర్టు ముందు ఉంచాలని ఆదేశించింది. దీనిలో విఫలమైతే జూన్ 23న కోర్టుకు హాజరుకావాలని రాష్ట్ర సీఎస్‌ను ఆదేశించింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు ఇచ్చింది.

పదోన్నతుల్లో అన్యాయం జరిగిందంటూ పలువురు ఉద్యోగులు 2016, 2017లో ఉమ్మడి హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన కోర్టు.. పదోన్నతుల్లో అన్ని వర్గాల ఉద్యోగులకు తగిన ప్రాతినిధ్యం ఉందా? లేదా? అనే విషయాన్ని అధ్యయనం చేయకుండా పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించారని తప్పు పట్టింది. బాధిత ఉద్యోగుల వాదన విని రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు అనుగుణంగా ప్రతీ ఉద్యోగి పదోన్నతిని సమీక్షించాలని ఆదేశించింది. రిజర్వ్ కేటగిరీ ఉద్యోగులు పరిమితికి మించి ప్రమోషన్లు పొందినట్లైతే, రిజర్వేషన్ పరిధిలోకి రాని ఇతర ఉద్యోగులకు పదోన్నతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి స్పష్టం చేస్తూ 2018 డిసెంబరు 11న తీర్పు ఇచ్చింది. ఈ ఉత్తర్వులు అమలుకాకపోవడంతో ది సెక్రటేరియట్ బీసీ అండ్ ఓసీ ఎంప్లాయిస్ అసోసియేషన్, మరికొందరు ఉద్యోగులు హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన ధర్మాసనం ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుపట్టింది. ఈ పిటిషన్లు గత ఆరేళ్లలో 32సార్లు విచారణకు వచ్చాయని గుర్తు చేసింది. పదోన్నతి పొందిన ఉద్యోగుల్లో రిజర్వ్ కేటగిరీకి చెందిన ఉద్యోగులు ఎంతమంది ఉన్నారో గుర్తించడంలో ఎలాంటి పురోగతి లేదని తెలిపింది.

రైతులకు రాయితీపై బ్రీడర్ విత్తనాలు

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రైతులకు బ్రీడర్ విత్తనాలను రాయితీపై సరఫరా చేసేందుకు కేంద్ర వ్యవసాయశాఖ విత్తన విభాగం ఆమోదం తెలిపింది. 7రకాల పంటలకు సంబంధించి, 1,736 క్వింటాళ్ల బ్రీడర్ విత్తనాలను రాష్ట్రానికి ఇవ్వడానికి అనుమతించింది. వరి, కంది, పెసర, మినుము, రాగి, వేరుశనగ, సజ్జ పంటలకు సంబంధించి, బ్రీడర్ విత్తనాలు రాష్ట్రానికి సరఫరా కానున్నాయి. న్యూఢిల్లీలో జరిగిన సమీక్షలో ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.